


# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు



మంత్రి లోకేష్ చేతులమీదుగా
**నేడు అశోక్ లేలాండ్ ప్లాంటు ప్రారంభం**
- తొలివిడతలో 600మందికి, మలివిడతలో 1200 మందికి ఉద్యోగాలు

5

గ్రూప్ ఫొటో!



*ఏపీ అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఫొటో సెషన్ నిర్వహించారు. మొదటి వరుసలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, మంత్రులు పాల్గొన్నారు. సీనియారిటీ ప్రకారం ఎమ్మెల్యేలు 2, 3, 4 వరుసల్లో కూర్చున్నారు. అనంతరం ఎమ్మెల్సీల ఫొటో సెషన్ నడిచింది.*



# ఢిల్లీలో సీఎం చంద్రబాబు



- అధికారిక, ప్రయివేట్ కార్యక్రమాలతో బిజీ
- కేంద్రమంత్రి చౌహాన్ కుమారుల పెళ్లికి హాజరు
- పార్లమెంట్ సెషన్స్‌పై పార్టీ ఎంపీలతో భేటీ
- నేడు బిల్‌గేట్స్‌తో సీఎం చంద్రబాబు కీలక భేటీ
- ఏపీ, గేట్ ఫౌండేషన్ మధ్య ఒప్పందాలు
- ప్రధాని మోదీతో భేటీకి అవకాశం
- అమరావతి పనుల పున:ప్రారంభానికి ఆహ్వానం

2

# వరల్డ్ టాప్ యాప్‌గా మనమిత్ర

- జూన్ 30నాటికి వాట్సాప్ ద్వారా 500 రకాల పౌరసేవలు
- వందరోజుల్లో ఏఐ ఆధారిత వాయిస్ ఎనేబుల్ సేవలు తెస్తాం
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో అవసరమైన చట్టసవరణలు చేస్తాం
- ప్రజల జేబుల్లోకి ప్రభుత్వాన్ని తేవాలన్నదే మనమిత్ర లక్ష్యం
- ఇకపై కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా శాశ్వత పత్రాలు
- శాసనసభలో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి లోకేష్

3



# పెద్దఎత్తున ప్రైవేటు, విదేశీ వర్సిటీలను రాష్ట్రానికి రప్పించేందుకు కృషి

- అమరావతిలో బిట్స్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది
- అమరావతిలో డీప్ టెక్, విశాఖలో ఎఐ వర్సిటీలు రాబోతున్నాయి
- ప్రైవేటు యూనివర్సిటీల సవరణ బిల్లు చర్చలో మంత్రి నారా లోకేష్

4

# 'ప్రయివేట్' టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా

- అందుకు ఆన్‌లైన్ మెకానిజంపై దృష్టి పెట్టా
- ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఏర్పాటుకు రక్షణమంత్రి సుముఖం
- శాసనసభలో మంత్రి నారా లోకేష్ సమాధానం

4



# దశాబ్దాల కలను సాకారం చేద్దాం

- దేశంలోనే ఆదర్శంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం
- పేదలకు మెరుగైన సౌకర్యాలతో నాణ్యమైన వైద్యం
- వంద పడకల ఆసుపత్రిపై మంత్రి లోకేష్ సమీక్ష

4



# ప్రముఖ క్షేత్రంగా మంగళగిరి

- శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి చర్యలు
- ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామిని దర్శించుకోవాలి
- మౌలిక వసతుల కల్పన, భక్తులకు మెరుగైన సౌకర్యాలు
- దేవాలయాభివృద్ధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశం

5

# ఏపీలో క్రీడలకు పూర్వవైభవం



- ప్రజాప్రతినిధులకు క్రీడలు ఆటవిడుపు
- అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్య
- ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ స్పోర్ట్స్‌తో కోలాహలంగా స్టేడియం

7



# ఏడాదిన్నరలోగా మంగళగిరి అభివృద్ధి

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్, స్టార్మ్ వాటర్ ప్రాజెక్ట్‌లపై దృష్టి
- మే నుంచి పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించాలి
- సమాంతరంగా అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్ పనులు పూర్తిచేయాలి
- యూజీడీ, డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ డీపీఆర్‌లపై సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశం

5

# నిజమైన సంక్షేమ సారథి చంద్రన్న

*మేనిఫెస్టో హామీలకు ఎగనామం పెట్టింది జగనే*

- పేదల్ని సొంత కాళ్లపై నిలబెట్టే సబ్‌ప్లాన్ నిధుల్ని దారి మళ్ళించిన జగన్
- పేదలను సొంత కాళ్లపై నిలబెడుతున్న చంద్రన్న
- మోసపూరిత సంక్షేమ సూత్రధారి జగన్
- అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయ ప్రదాత కాబట్టే 41 ఏళ్ళుగా ఆదరిస్తున్న ప్రజలు
- అవినీతి సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి అబద్ధాల కుతంత్రం - 15

6

# ఢిల్లీలో సీఎం చంద్రబాబు





- అధికారిక, ప్రయివేట్ కార్యక్రమాలతో బిజీ
- కేంద్రమంత్రి కుమారుల పెళ్లికి హాజరు
- పార్లమెంట్ సెషన్స్‌పై పార్టీ ఎంపీలతో భేటీ
- నేడు బిల్‌గేట్స్‌తో సీఎం చంద్రబాబు కీలక భేటీ
- ఏపీ, గేట్ ఫౌండేషన్ మధ్య ఒప్పందాలు
- ప్రధాని మోదీతో భేటీకి అవకాశం
- అమరావతి పనుల పున:ప్రారంభానికి ఆహ్వానం

అమరావతి (చైతన్య రథం): ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మంగళవారం సాయంత్రం ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయం నుంచి నేరుగా సమీపంలోని ఎయిర్ ఫోర్స్ ఆడిటోరియానికి వెళ్లారు. కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ కుమారులు కార్తికేయ, కునాల్‌ల వివాహ రిసెప్షన్‌కు హాజరైన చంద్రబాబు.. రెండు జంటలను ఆశీర్వదించారు. అక్కడినుంచి అధికార నివాసం వన్ జన్‌పథ్‌కు వెళ్లిన చంద్రబాబు.. టీడీపీ ఎంపీలతో సమావేశమయ్యారు. పార్లమెంటు సమావేశాలు తదితర అంశాలపై ఎంపీలతో చంద్రబాబు నాయుడు చర్చించినట్టు సమాచారం. బుధవారం కూడా ఢిల్లీలోనే చంద్రబాబు పర్యటిస్తున్నారు. బుధవారం గేట్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్‌గేట్స్‌తో చంద్రబాబు కీలకంగా భేటీ కానున్నారు. వివిధ రంగాల్లో ఏపీకి సహకారంపై రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య ఒప్పందాలను సీఎం చంద్రబాబు కుదర్చుకోనున్నారు. అలాగే, బుధవారం ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం చంద్రబాబు భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్ నెలాఖరులో అమరావతి పనుల పున:ప్రారంభానికి మోదీని ఆహ్వానించనున్నారు. ఈ భేటీ సందర్భంగా రాజధాని అమరావతికి ప్రపంచ బ్యాంకు నిధులతో పాటు పలు ఇతర అంశాలపై ప్రధాని మోదీతో చంద్రబాబు చర్చించనున్నారు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తోపాటు పలువురు కేంద్ర మంత్రులను కూడా సీఎం చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో కలవనున్నారు.

### తానా సమావేశాలకు చంద్రబాబుకు ఆహ్వానం

తానా సమావేశాలకు ఏపీ సీఎం చంద్రబాబును తానా బృందం ఆహ్వానించింది. మంగళవారం



అసెంబ్లీలో సీఎం చంద్రబాబు ఛాంబర్‌లో కలిసిన ప్రతినిధి బృందం ముఖ్యమంత్రికి ఆహ్వానాన్ని అందచేసింది. సీఎంను కలిసిన వారిలో తానా సమావేశాల చైర్మన్ నాదెండ్ల గంగాధర్, తానా మాజీ అధ్యక్షుడు కోమటి జయరాం తదితరులున్నారు. జూలై 3నుంచి 5వరకు తానా సమావేశాలు జరుగనున్నాయి.





అసెంబ్లీ ఆవరణలో అరకు కాఫీ స్టాల్‌ను ప్రారంభించిన శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చడం ఆనందంగా ఉంది: సీఎం

అమరావతి (చైతన్య రథం): చేనేత కార్మికులకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీలు నెరవేర్చడం పట్ల చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇచ్చేందుకు మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకున్నాం. దీనివల్ల 93 వేలమంది నేతన్నల గృహాలకు, 10,534 మరమగ్గాలకు ప్రయోజనం చేకూరుతుంది.

ఇప్పటికే చేనేత కార్మికుల ఇంటి నిర్మాణానికి అదనంగా రూ.50 వేల సహకారం అందజేసేందుకు... అలాగే చేనేత కార్మికులకు జీఎస్టీ రీయింబర్స్మెంట్ అమలు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. వీటన్నింటినీ నెరవేర్చడానికి... చేనేతరంగ అభివృద్ధికి ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.138.08 కోట్లు కేటాయించడం జరిగింది. చేనేత కార్మికులకు నేను ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఈ సహకారాన్ని అందుకుని నేతన్నలు వృద్ధిలోకి రావాలని కోరుతున్నాను' అంటూ చంద్రబాబు ట్వీట్‌లో పేర్కొన్నారు.



శాసన మండలి ఆవరణలో అరకు కాఫీ స్టాల్‌ను ప్రారంభించిన చైర్మన్ కొయ్యే మోషేన్ రాజు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ పంచుమర్తి అనురాధ, విపక్ష నేత బొత్స సత్యనారాయణ, పెద్దఎత్తున ఎమ్మెల్సీలు పాల్గొన్నారు.

# వరల్డ్ టాప్ యాప్‌గా మనమిత్ర

అమరావతి(చైతన్య రథం): ఈ ఏడాది జూన్ 30 నాటికి 500 రకాల ప్రభుత్వ సేవలను మనమిత్రలో వాట్సాప్ ద్వారా అందిస్తామని రాష్ట్ర విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై శాసనసభలో జరిగిన లఘుచర్చలో మంత్రి లోకేష్ మాట్లాడుతూ... 1983కి వెళితే ఎన్టీఆర్ సీఎం అయిన వెంటనే పటేల్, పట్వారీ రద్దుచేసి పరిపాలనను ప్రజలముందుకు తీసుకెళ్లారు. చంద్రబాబునాయుడు సింగపూర్ సిటిజన్ సర్వీస్ సెంటర్ ద్వారా ప్రేరణ పొంది ఈ–సేవ సర్వీసులను ఎలక్ట్రిసిటీ బిల్‌తో ప్రారంభించి, అనేకరకాల సేవలకు విస్తరించారు. తర్వాత మీ సేవగా మారింది. ప్రజలవద్దకు పాలన, ప్రజలవద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకోవాలని చంద్రబాబు పదేపదే చెప్పేవారు. స్టాన్‌ఫోర్డ్ ఎంబిఏ ద్వారా టెక్నాలజీ తెలుసుకున్నా, ప్రజాసమస్యలను నేరుగా పాదయాత్రలో తెలుసుకున్నా. ఆనాడు గ్రామగ్రామాన ప్రజలను కలిసినపుడు ఆఫీసుల ముందు పడిగాపులు పడాల్సి వస్తోందని చెప్పారు. బటన్ నొక్కితే సినిమా టిక్కెట్లు, స్విగ్గీ ఫుడ్, నిత్యావసర వస్తువులు, ట్యాక్సీవంటి అన్ని సేవలు ఇంటికి వస్తున్నపుడు ప్రభుత్వసేవలు ఎందుకు రావడం లేదని ప్రజలు నన్ను ప్రశ్నించారు. ఆఫీసులకు వెళితే డబ్బులు ఇవ్వాల్సి వస్తుందని, గంటల తరబడి నిలబడాల్సి వస్తుందని సామాన్య ప్రజలు అక్కడకు వెళ్లడానికి ఇష్టపడటం లేదు. ఆఫీసులకు వెళ్తే మెరుగైన సేవలు అందకపోగా, లేనిపోని సమస్యలు వస్తాయని భావించేవారు. మంగళగిరి నియోజకవర్గం దుగ్గిరాలలో ఎక్కువ ఎంపిటిసిలు టిడిపి – జనసేన గెల్చుకున్నాం, ఎంపిపిగా బీసీ మహిళకు రిజర్వేషన్ వస్తే ఆనాటి ఎమ్మెల్యే ఆమెకు కులధృవీకరణ పత్రం అందకుండా అడ్డుపడి, పదవికి దూరం చేశారు. ఆరోజే వ్యవస్థలో మార్పు తీసుకురావాలని నేను సంకల్పించుకున్నాను. అక్కడనుంచే నాకు వాట్సాప్ గవర్నెన్స్ ఆలోచన మొదలైందని లోకేష్ వివరించారు.


## గవర్నెన్స్‌లో కీలక సంస్కరణలకు మనమిత్రతో నాంది

ధనవంతులకు, పేదలకు తేడాలేకుండా నాణ్యమైన విద్య అందిస్తున్న తరహాలోనే ప్రభుత్వ సేవలు అందరికీ సమంగా అందించాల్సి ఉంది. ఇందుకోసం సుపరిపాలనపై చాలా అధ్యయనం చేశాను, విజిబుల్ గవర్నెన్స్ – ఇన్విజిబుల్ గవర్నమెంట్ నినాదం ద్వారా ప్రజల చేతిలో పరిపాలన ఉండాలన్నది నా ఆకాంక్ష. ప్రజల దైనందిన జీవితంలో అధికారులు, రాజకీయ నాయకుల అవసరం ఉండకూడదన్నదే నా లక్ష్యం. బేసిక్ సర్వీసెస్, వివిధరకాల సర్టిఫికెట్లను అధికారుల పాత్ర లేకుండా చేయాలనే ఆలోచనచేశాను. కొత్త యాప్‌తో అవసరం లేకుండా అందరికీ అందుబాటులో ఉన్నవాట్సాప్ ద్వారా మనమిత్ర పేరుతో ప్రజలచేతిలోకి పాలన తెచ్చే లక్ష్యంతో సేవలు ప్రారంభించాం. పౌరసేలకు గేమ్ ఛేంజర్ గా మనమిత్ర పేరుతో సేవలకు శ్రీకారం చుట్టాం. ప్రస్తుతం 200 సేవలను మనమిత్ర ద్వారా అందిస్తున్నాం. ఇతర దేశాల్లో విధానాలను తెలుసుకున్నపుడు ఎస్తోనియాలో ఈ గవర్నెన్స్ చాలా ముందుకు తీసుకెళ్లారు. సింగపూర్ లో స్మార్ట్ నేషన్ ఇనిషియేటివ్ కింద ఎఐ పవర్ తో సేవలు అందిస్తున్నారు. యుఎఇ లాంటి దేశాలు వాట్సాప్ ఆధారిత సేవలు అందజేస్తున్నారు. గవర్నెన్స్ లో విప్లవాత్మక సంస్కరణల అమలులో వాట్సాప్ గవర్నెన్స్ కీలక పాత్ర వహిస్తుందని మేం బలంగా నమ్ముతున్నాం.

## ఈనెలాఖరుకు మనమిత్ర ద్వారా 300 రకాల సేవలు

రాబోయే రోజుల్లో వాయిస్ అనేబుల్ చేసి ఏఐని అనుసంధానంతో ఇంకా మెరుగైన సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. ముఖ్యమంత్రి స్పీడ్ ఇప్పటికీ మేం అందుకోలేక పోతున్నాం. మనమిత్రకు సంబంధించి సెప్టెంబర్ 19, 2024న మెటాతో సమావేశమై, అక్టోబర్ 22,2024న ఎంఓయు చేసుకున్నాం. జనవరి 30, 2025కి 150 రకాల ప్రభుత్వ సేవలు (రెవిన్యూ సర్టిఫికెట్, ప్రాపర్టీ ట్యాక్స్ చెల్లింపు, గ్రీవెన్స్ సేవలు వంటివి) మనమిత్ర ద్వారా ప్రారంభించాం, ఈనెలాఖరుకు 300రకాల ప్రభుత్వ సేవలు వాట్సాప్ ద్వారా అందుబాటులోకి తేబోతున్నాం. ఏఐ చాటాబాట్ కూడా ఉపయోగించి మెరుగైన సేవలు ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నాం. మనమిత్ర

- జూన్ 30నాటికి వాట్సాప్ ద్వారా 500 రకాల పౌరసేవలు
- వందరోజుల్లో ఏఐ ఆధారిత వాయిస్ ఎనేబుల్ సేవలు తెస్తాం
- వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో అవసరమైన చట్టసవరణలు చేస్తాం
- ప్రజల జేబుల్లోకి ప్రభుత్వాన్ని తేవాలన్నదే మనమిత్ర లక్ష్యం
- ఇకపై కార్యాలయాల చుట్టూ తిరిగే పనిలేకుండా శాశ్వత పత్రాలు
- శాసనసభలో విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి లోకేష్



సేవలు 3 కేటగిరిల్లో అందించాలని నిర్ణయించాం. ఒకటి ప్రజలకు నేరుగా అందించే సేవలు, రెండొవది హ్యూమన్ ఇంటర్వెన్స్ ద్వారా, మూడొవది సంస్కరణలను అమలు చేయడం ద్వారా సేవలు. ఇటీవల కదిరికి వెళ్లినపుడు ఒకసారి సర్టిఫికెట్ ఇచ్చాక మళ్లీ మళ్లీ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు ఎందుకు రావాలని అడిగా. ఎటువంటి కొర్రీలు లేకుండా పర్మినెంట్ సర్టిఫికెట్ ఇవ్వాలని నిర్ణయించాం. క్లిష్టతరమైన సేవలను చట్టాలను సవరించి సర్వీసులను అందుబాటులోకి తెస్తామని ఐటీ మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

## క్యూఆర్ కోడ్, ఏఐ అనేబుల్‌తో మెరుగైన సేవలు

నూతన విధానంలో వివిధ రకాల సర్టిఫికెట్లు ట్యాంపరింగ్‌కు ఆస్కారం లేకుండా క్యూఆర్ కోడ్ అనేబుల్ సర్టిఫికెట్లు అందజేస్తాం. సెక్యూరిటీ పేపర్ పేరుతో పెద్దఎత్తున ప్రభుత్వ విభాగాల్లో డబ్బు ఖర్చవుతోంది. క్యూఆర్ కోడ్ అనేబుల్‌తో ఆ డబ్బు ఆదా అవుతుంది. ఏపీపీఎస్సీ డాక్యుమెంట్ వెరిఫికేషన్‌లో చాలా సమయం తీసుకుంటున్నట్టు మా పరిశీలనలో తెలిసింది. నూతన విధానంలో క్యూఆర్ కోడ్ ద్వారా వెరిఫికేషన్ సులభతరం చేస్తాం. పేమెంట్స్ అన్నీ ఇంటిగ్రేట్ చేసి ఒకే ప్లాట్ ఫాంపైకి తెచ్చాం. రాబోయే రోజుల్లో మరింత సులతరంగా ఏఐ చాట్‌బాట్ ద్వారా బస్ టిక్కెట్లు, ఇతర సేవలను కేవలం వాయిస్ కాల్‌తో అందేలా చేస్తాం. రాబోయే రోజుల్లో ఏఐ అనేబుల్ ద్వారా మెరుగైన, సౌకర్యవంతమైన సేవలు అందిస్తాం. ఇప్పుడు దేశవ్యాప్తంగా భాషలపై చర్చ జరుగుతోంది. కేవలం ఇంగ్లీషు, హిందీ, తెలుగు కాకుండా అన్నిభాషలకు ఇంటిగ్రేట్ చేసేలా చర్యలు తీసుకుంటామని లోకేష్ అన్నారు.

## త్వరలో టీటీడీ సేవలు కూడా మనమిత్రలోకి!

ఇప్పటివరకు ఎండోమెంట్‌లో 77 సర్వీసులు అందుబాటులోకి తెచ్చాం. తితిదే సేవలను కూడా మనమిత్ర పరిధిలోకి తేవాలని సిఎం సూచించారు. అధికారులతో చర్చించి 30 రోజుల్లో తితిదేకి సంబంధించి అన్ని సర్వీసులను ఈ ప్లాట్‌ఫాంపైకి తీసుకురాబోతున్నాం. మనమిత్రలో విద్యుత్ శాఖకు సంబంధించి ప్రస్తుతం 39 సర్వీసులు అందిస్తున్నాం. పాత బిల్లుల బ్రేకప్, న్యూకనెక్షన్ కూడా దీనిద్వారానే ఇస్తున్నాం. ఎపిఎస్ ఆర్‌టిసిలో పార్సిల్ బుకింగ్ తోసహా 13సర్వీసులు అందిస్తున్నాం. రెవిన్యూ శాఖలో 19సేవలు, మున్సిపల్ శాఖలో 29 సర్వీసులు పబ్లిక్ గ్రీవెన్స్‌లో 6రకాల సేవలు, విద్యాశాఖకు సంబంధించి 5రకాల సేవలు, ఆర్‌టిజిలో 10 సర్వీసులు అందుబాటులోకి తెచ్చాం. జనవరి నుంచి ఇప్పటివరకు మనమిత్ర ద్వారా 51లక్షల ట్రాన్సాక్షన్స్ జరిగాయి. విద్యాశాఖలో అత్యధికంగా 25.80లక్షలు, రెవిన్యూ శాఖలో 13లక్షల సేవలు అందించాం. మొత్తంగా వివిధ శాఖలకు సంబంధించి 25లక్షలమంది ప్రజలకు మనమిత్ర సేవలు అందాయి. మనమిత్రలో హాల్ టిక్కెట్లు అందజేయడం మా సక్సెస్ స్టోరీకి నిదర్శనం. గతంలో స్కూలు వద్దకు వెళ్లి హాల్ టిక్కెట్ తెచ్చుకోవడం చాలా కష్టతరంగా ఉండేది. ఇంటిలో కూర్చుని హాల్ టిక్కెట్ నెంబర్ ఎంటర్ చేయడం ద్వారా లక్షలమంది విద్యార్థులు ఇంటినుంచే హాల్ టిక్కట్లు పొందారు. త్వరలో విద్యార్థుల రిజల్ట్స్ కూడా వాట్సాప్ ద్వారానే వారి ఫోన్లకు పంపిస్తాం. ఇలా ప్రతిసేవను రియల్ టైమ్‌లో పుల్ అండ్ పుష్ మోడ్‌లో ప్రజలకు అందిస్తాం. జనవరి 2025నుంచి ఇప్పటివరకు జి టు సి (గవర్నమెంట్ టు సిటిజన్స్) అన్నివిభాగాల ద్వారా 1.23 కోట్ల ట్రాన్సాక్షన్ జరగగా, అందులో వాట్సాప్ ద్వారా (మనమిత్రలో) 41.4శాతం అందించగలిగాం. ప్రజలు సులభంగా సేవలు పొందుతున్నారు అనడానికి ఇదొక ఉదాహరణ అని మంత్రి లోకేష్ వివరించారు.

## 10 సెకన్లలో సేవలు అందించాలన్నదే మా లక్ష్యం

ప్రస్తుతం అందుబాటులో అధునాతన టెక్నాలజీ ఉంది, ప్రజలకు సేవ చేయాలనే తపన ఉంది, కొన్ని సవాళ్లు కూడా ఉన్నాయి. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన డేట్ బేస్ ను ఇంటిగ్రేట్ చేసి, ఆధార్ సీడింగ్ ద్వారా పక్కాగా పౌర సేవలు అందజేయాలన్నది మా ప్రభుత్వ లక్ష్యం. ఈ సరికొత్త విధానంపై అవగాహనకు పెద్దఎత్తున ప్రచారం చేయాల్సి ఉంది. వేగవంతమైన డాటాతో కేవలం 10సెకన్లలో సర్వీసెస్ అందజేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఈ క్రమంలో సైబర్ సెక్యూరిటీ కూడా కీలకమైన విషయం. మన మిత్ర లాంచ్ చేసినపుడు కొందరు పేటీఎం గాళ్లు పోస్టులు పెడితే, విశాఖలో నేను చాలెంజ్ చేశా. ఎవరైనా హ్యాక్ అయినట్లు నిరూపిస్తే 10కోట్లు ఇస్తానని చెప్పాను. ఆ తర్వాత అటువైపునుంచి స్పందనలేదు. మాజీ సిఎం కు లేదన్నారు, ఆర్థికమంత్రి ఫోన్ పంపితే ఆయన కూడా వాట్సాప్ గవర్నెన్స్ గురించి నేర్చుకుంటారు. సరికొత్త విధానంలో మేం ఎక్కడా పర్సనల్ డాటా మెయింటెయిన్ చేయడం లేదు, ఇన్ క్రిప్టెడ్ రోడ్ మాత్రమే. ఆధార్ బేస్ అథెంటికేషన్ ఒటిపి ద్వారా చేస్తున్నాం. అది కూడా యుఐడి ద్వారానే చేస్తున్నాం. ప్రభుత్వం పాత్ర ఏమాత్రం లేదు. ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా చేయమని సిఎం చెప్పారు, ఆ కార్యక్రమం కూడా చేపడుతున్నాం.

## జూన్ 30కి మనమిత్ర ద్వారా 500 రకాల సేవలు

కొందరు సభ్యులు లీగల్ వ్యాలిడిటీ ఉందా? అని అడిగారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఐటి యాక్ట్ ప్రకారం ఫిజికల్ డాక్యుమెంట్‌తో ఎలక్ట్రానిక్ డాక్యుమెంట్ సమానం. క్యూఆర్ కోడ్ బేస్డ్ అథెంటికేషన్‌కు కూడా చట్టబద్ధత తెచ్చే అంశాన్నివచ్చే సమావేశాలకు సభముందుకు తెస్తాం. రాబోయే రోజుల్లో ప్రతి ప్రభుత్వ సేవ వాట్సాప్ ద్వారా అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. జూన్ 30 నాటికి 500 సర్వీసులు మనమిత్ర ప్లాట్‌ఫాం ద్వారా అందుబాటులోకి తెస్తాం, ఎఐ అనేబుల్ కూడా చేస్తాం. ఫీడ్ బ్యాక్ మెకానిజం కూడా అందుబాటులోకి తెస్తాం. జి టు బి(గవర్నమెంట్ టు బిజినెస్) ఇన్సెంటివ్, పర్మిషన్లు వంటి సేవలను కూడా పారదర్శకంగా ఆన్‌లైన్ ద్వారా చేయాలని సభ్యులు అడిగారు, ఇప్పటికే ఆ ప్రక్రియ ప్రారంభిం చాం. డాక్యుమెంట్ అప్ లోడ్ చేశాక ఎఐ ద్వారా రియల్ టైమ్ వెరిఫికేషన్ చేసి, వేగవంతమైన సేవలు అందిస్తాం. ఇందుకోసం కొన్ని సంస్కరణలు కూడా తీసుకురావాల్సి ఉంది. కొన్నింటికి సంబంధించి వెరిఫికేషన్ అథారిటీ ఎవరు అనే విషయమై కొంత సందిగ్ధత ఉంది. దీనివల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుంది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు వచ్చే అసెంబ్లీ సమావేశాల నాటికి కొన్ని చట్టాలను సవరణచేయడం, కొన్ని కొత్త చట్టాలు చేయడం వంటివి చేయాల్సి ఉంది. ఈరోజు వాట్సాప్ గవర్నెన్స్‌కు సంబంధించి ఇతర రాష్ట్రాలు మనల్ని ఆదర్శంగా తీసుకొని పోటీపడుతున్నాయి. ఏపీలో మనం ప్రారంభించిన 45రోజుల తర్వాత మహారాష్ట్ర ప్రభుత్వం కూడా మన విధానాలను అధ్యయనం చేసి మెటాతో ఒప్పందం చేసుకుంది. ప్రస్తుతం పోటీ మొదలైంది. పోటీతత్వం ద్వారా ప్రజలకు మెరుగైన సర్వీసులు అందజేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని లోకేష్ అన్నారు.

## మీ-సేవ కేంద్రాల ద్వారా కూడా సమాంతర సేవలు

పాదయాత్ర సమయంలో నన్ను మీ–సేవ ఆపరేటర్లు కలిశారు. గత ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాలను తెచ్చాక మీ–సేవ కేంద్రాల సేవలను కుదించారు. ప్రస్తుతం మీ–సేవలు కూడా ఐటి శాఖ పరిధిలోకి వచ్చాయి. మీ–సేవలను కూడా అందుబాటులోకి తెస్తామని ఆపరేటర్లకు హామీ ఇస్తున్నాం. సమాంతరంగా సచివాలయాలు, వాట్సాప్, మీ–సేవల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలను అందిస్తాం. ఈ నూతన విధానంపై త్వరలో ఎమ్మెల్యేలకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాం. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు కూడా అవగాహన కల్పిస్తాం. సర్టిఫికేషన్ ఆరునెలల కోసారి రెన్యువల్ నిబంధనలు ఉన్నాయి, వచ్చే సమావేశాల్లో చట్టసవరణ చేసి పర్మినెంట్ సర్టిఫికెట్లు అందిస్తాం. క్యాస్ట్ సర్టిఫికెట్ల కోసం బీసీ సోదరులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నేను పాదయాత్రలో స్వయంగా చూశా. దానికి ఫుల్ స్టాప్ పెట్టాలనే ఉద్దేశంతోనే శాశ్వత సర్టిఫికెట్లు తేవాలని నిర్ణయించాం. వాట్సాప్ మెసేజ్ ద్వారా ధాన్యం కొనుగోళ్లలో విధానాన్ని మంత్రి మనోహర్ తెచ్చారు. దానిని కూడా మనమిత్రకు అనుసంధానం చేస్తాం. వ్యవసాయరంగ సేవలను కూడా ఈ పరిధిలోకి తెస్తామని లోకేష్ స్పష్టం చేశారు.

## వందరోజుల్లో అందుబాటులోకి వాయిస్ ఎనేబుల్ సేవలు

మారుమూల గిరిజన ప్రాంతాల్లో బేసిక్ రిజిస్ట్రేషన్ జరగక ఆధార్ లేకపోవడంతో ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సీనియర్ సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి చెప్పారు. దీనిపై ట్రైబల్ వెల్ఫేర్ విభాగంతో చర్చలు జరుపుతున్నాం. డాటా ఇంటిగ్రేషన్ తర్వాత ఎక్కడ సమస్యలు ఉన్నాయో తెలుసుకొని ఆధార్ సీడింగ్‌తో గిరిజనులకు రేషన్ కార్డులు అందిస్తాం. సిఎం గారు రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ నాకు ఇచ్చారు. అర్హులందరికీ రియల్ టైమ్ సేవలు అందించాలన్నదే ఆయన లక్ష్యం. గౌరవసభ్యులపై కూడా చాలా బాధ్యత ఉంది. నిరంతరం ప్రజల్లో తిరిగేటప్పుడు ఎక్కడ సమస్యలున్నాయో తెలియజేయాలి. అందరికీ సమానంగా ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ప్రభుత్వం అంటే కార్యాలయం కాదు... సేవ గుర్తుకు రావాలి. ఆఫీసు ప్రజల జేబులో ఉండాలన్నదే మన మిత్ర కాన్సెప్ట్ లక్ష్యం.. వందరోజుల్లో మనమిత్ర వర్షన్ 2.0 ఏఐ ద్వారా వాయిస్ ఎనేబుల్ విధానం తెస్తాం. అన్నిరంగాల్లో ఏపీ నెం.1గా ఉండాలన్నది ముఖ్యమంత్రి లక్ష్యం. ఎస్తోనియా, యుఎఇ, సింగపూర్ విధానాలను అధ్యయనం చేస్తున్నాం. అధికారుల బృందాన్ని అక్కడకు పంపి స్టడీ చేసి మనమిత్ర ద్వారా ప్రపంచంలోనే మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. మంత్రులపై కూడా బాధ్యత ఉంది. అందరం కలిసికట్టుగా పని చేస్తేనే అనుకున్నది సాధించగలుగుతాం. అన్నిశాఖల సర్వీసులను వాట్సాప్ ఫస్ట్(మనమిత్ర) ద్వారా అందిద్దాం. రాబోయే రోజుల్లో రాజకీయాల్లో ఇదొక కీలక సంస్కరణగా నిలవబోతోందని మంత్రి నారా లోకేష్ చెప్పారు. వాట్సాప్ గవర్నెన్స్‌పై లఘుచర్చపై శాసన సభ్యులు ఆరుమిల్లి రాధాకృష్ణ(తణుకు), బొజ్జల సుధీర్ రెడ్డి(శ్రీకాళహస్తి), నజీర్ అహమ్మద్(గుంటూరు తూర్పు), ఎన్ ఈశ్వరరావు(ఎచ్చెర్ల), లోకం మాధవి(నెల్లిమర్ల), ఆదిరెడ్డి శ్రీనివాస్(రాజమండ్రి), ఆదినారాయణ రెడ్డి (జమ్మలమడుగు), కొణతాల రామకృష్ణ (అనకాపల్లి), జీవీ ఆంజనేయులు (వినుకొండ), వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి (కోవూరు), బూర్ల రామాంజనేయులు (ప్రత్తిపాడు), విష్ణుకుమార్ రాజు పాల్గొన్నారు.

## పెద్దఎత్తున ప్రైవేటు, విదేశీ వర్సిటీలను

# రాష్ట్రానికి రప్పించేందుకు కృషి

- అమరావతిలో బిట్స్ ఏర్పాటుకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది
- అమరావతిలో డీప్ టెక్, విశాఖలో ఎఐ వర్సిటీలు రాబోతున్నాయి
- ప్రైవేటు యూనివర్సిటీల సవరణ బిల్లు చర్చలో మంత్రి నారా లోకేష్

అమరావతి (చైతన్య రథం): 'రాష్ట్రంలో పెద్దఎత్తున ప్రైవేటు, విదేశీ విశ్వవిద్యాలయాలను ప్రోత్సహించాని నిర్ణయించాం. దేశంలో పేరెన్నికగన్న బిట్స్‌ను అమరావతిలో ఏర్పాటుకు 70 ఎకరాలు కేటాయిస్తూ ఇటీవల కేబినెట్ ఆమోదం తెలిపింది. టాటా గ్రూప్, ఎల్ అండ్ టి, ఐఐటి మద్రాసు, యూనివర్సిటీ ఆఫ్ టోక్యోతో కలిసి డీప్ టెక్ యూనివర్సిటీ చేయాలని నిర్ణయించాం. దీనిని ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన, క్రమబద్ధీకరణ సవరణ బిల్లు -2025ను మంత్రి నారా లోకేష్ శాసనసభలో ప్రవేశపెడుతూ... దేశంలో విదేశీ విశ్వవిద్యాలయాలను కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. వివిధ ఫారిన్ వర్సిటీల క్యాంపస్‌లను రాష్ట్రానికి రప్పించాలన్నది సభ్యుల మనోగతం. 2016లో ప్రైవేటు వర్సిటీల చట్టం తేవడం జరిగింది. గత ప్రభుత్వం దీనికి ఐదు సవరణలు చేసింది. అవి యుజిసి గైడ్‌లైన్స్‌కి విరుద్ధంగా ఉన్నాయి. గ్రీన్‌ఫీల్డ్ వర్సిటీ ఏర్పాటు చేయాలంటే టాప్-100 గ్లోబల్ వర్సిటీతో జాయింట్ డిగ్రీ ఉండాలని నిబంధన విధించారు. ఈ విషయంలో యుజిసి నిబంధనలు వేరుగా ఉన్నాయి. పూర్తిస్థాయిలో చర్చించి, ఆ చట్టాన్ని సవరించాల్సి ఉంది. విశాఖలో ఏఐ వర్సిటీ, అమరావతిలో స్పోర్ట్ వర్సిటీ ఏర్పాటు చేయాలని భావిస్తున్నామని పేర్కొన్నారు.

పలు ప్రైవేటు వర్సిటీలు ఎకనమిక్ డెవలప్‌మెంట్ బోర్డుతో చర్చలు జరుపుతున్నాయి. యూనివర్సిటీ ఆఫ్ టోక్యో, ఎవింఇ వర్సిటీ ఫిలిప్పీన్స్ ఆసక్తి కనబర్చాయి. ఇతర వర్సిటీల ప్రతినిధులు కూడా చర్చలకు వస్తున్నారు. పెద్దఎత్తున ప్రైవేటు రంగంలో భారత్‌లో టాప్ వర్సిటీలతోపాటు విదేశీ యూనివర్సిటీలను ఏపీకి తెచ్చేవిధంగా ప్రోత్సహిస్తాం. కేవలం అమరావతి, విశాఖపట్నానికే కాకుండా అన్ని ప్రాంతాలకు తెస్తాం. ఇన్సెంటివ్‌లు అధికంగా ఇచ్చి రాయలసీమకు కూడా వర్సిటీలు రప్పించేందుకు కృషి చేస్తున్నాం. కనిగిరి ప్రాంతానికి ట్రిపుల్ ఐటి ఏర్పాటు అంశాన్ని పరిశీలిస్తాం. ఆంధ్రకేసరి యూనివర్సిటీని 2022లో ఎటువంటి శాంక్షన్ పోస్టులు లేకుండా ప్రకాశం జిల్లాలో ఏర్పాటు చేశారు. దీనివల్ల ప్రొఫెసర్లు, సిబ్బంది కూడా ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ యూనివర్సిటీల బలోపేతానికి దాతలు కూడా ముందుకు వస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకమైన మెకానిజం ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆంధ్రకేసరి యూనివర్సిటీని కూడా అభివృద్ధి చేస్తామని మంత్రి లోకేష్ వెల్లడించారు.



తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఎప్పుడూ విద్యకు ప్రాధాన్యత నిస్తుంది. ప్రధానంగా ఉన్నత విద్యకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగింది. 2016లో ప్రైవేటు వర్సిటీల ఏర్పాటుకు ఒక ప్రత్యేక చట్టాన్ని ఆనాటి తెలుగుదేశం ప్రభుత్వం తేవడం జరిగింది. అభివృద్ధి వికేంద్రీకరణ జరగాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నానికి సెంచూరియన్ వర్సిటీ మంజూరుచేసి, 75ఎకరాలు, 4.75 లక్షల చదరపు అడుగుల్లో భవనాలు ఏర్పాటుచేశారు. 23 ప్రోగ్రామ్‌లలో 133 మంది అధ్యాపకుల ద్వారా 2550మంది విద్యార్థులు అక్కడ శిక్షణ పొందుతున్నారు. దీనికి అనుబంధంగా 8 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, 3 ఇంక్యుబేషన్ సెంటర్లు పనిచేస్తున్నాయి. ఇందుకు సంబంధించిన ట్రస్ట్ పరిధి ఒరిస్సాలో ఉండటంతో కొన్ని పాలనపరమైన సమస్యలను వారు ఎదుర్కోవాల్సి వచ్చింది. సకాలంలో నిధులు వారికి రాలేదు. ఈ వర్సిటీ అభివృద్ధికి స్పాన్సరింగ్ బాడీగా ఏపిలో అనుమతి ఇవ్వాలని,ఇన్‌కం ట్యాక్స్ సియుటిఎఫ్ ఏపి కింద ఉంచాలని వారు కోరారు. వర్సిటీలకు సంబంధించి సవరణ చేయాలంటే శాసనసభ, మండలికి మాత్రమే అధికారం ఉంది. అందుకే ఈ సవరణ బిల్లు ప్రతిపాదిస్తున్నామని మంత్రి లోకేష్ ప్రతిపాదించారు.

అంతకుముందుకు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రైవేటు విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రంలోకి అనుమతించే విషయమై పరిశీలించాలని కోరారు. బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ... రాష్ట్రం నుంచి లక్షలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యకోసం ఇతర దేశాలు, ఇతర రాష్ట్రాలకు వెళ్తున్నారు. దీనివల్ల రాష్ట్ర సంపద కూడా పొరుగు రాష్ట్రాలకు తరలిపోతోంది. కొన్ని వర్సిటీలు ఇక్కడ ఏర్పాటుచేసినా ఐటి, జిఎస్‌టి రిజిస్ట్రేషన్ వేరే ప్రాంతాల్లో ఉండటం వల్ల ఆదాయం అక్కడకు వెళుతోంది. ప్రైవేటు యూనివర్సిటీలు ఇంకా పెద్దఎత్తున రాష్ట్రానికి రప్పించేందుకు సబ్సిడీపై వారికి భూములు ఇవ్వాలి. మన రాష్ట్రంలో కూడా ప్రైవేటురంగంలో పెద్దఎత్తున జాతీయ, అంతర్జాతీయస్థాయి వర్సిటీలను ప్రోత్సహించాలని కోరారు. కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి మాట్లాడుతూ... కనిగిరిలో ట్రిపుల్ ఐటి విషయంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది, తిరిగి ప్రారంభించాలని కోరారు. ప్రకాశం జిల్లాలో ఆంధ్రకేసరి యూనివర్సిటీని అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు.

# దశాబ్దాల కలను సాకారం చేద్దాం



- దేశంలోనే ఆదర్శంగా వంద పడకల ఆస్పత్రి నిర్మాణం
- పేదలకు మెరుగైన సౌకర్యాలతూ నాణ్యమైన వైద్యం
- వంద పడకల ఆసుపత్రిపై మంత్రి లోకేష్ సమీక్ష

అమరావతి (చైతన్య రథం): మంగళగిరి సమీపంలోని చినకాకానివద్ద ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన వందపడకల ఆసుపత్రిని భవిష్యత్తులో జి ప్లస్ 3కి విస్తరించేలా నిర్మాణం చేపట్టాలని రాష్ట్ర విద్య,ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ సూచించారు. వందపడకల ఆసుపత్రి నిర్మాణంపై ఆసుపత్రి సాధన కమిటీ సభ్యులు, అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ... డాక్టర్లు, నర్సులు, పేషెంట్ల బంధువులు, రోగులకు వేర్వేరు నడకదారులు ఉండే విధంగా డిజైన్‌లో మార్పులు చేయాలన్నారు. వైద్యులు, సిబ్బంది ప్రశాంత వాతావరణం ఉంటేనే మెరుగైన వైద్యం అందించగలరని చెప్పారు. మంగళగిరి వంద పడకల ప్రభుత్వ హాస్పటల్ ట్రెడిషనల్‌గా కాకుండా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా ఉండాలన్నారు. మంగళగిరి హాస్పటల్ నిర్మాణం ఈ ప్రాంతవాసుల దశాబ్దాల కల అని, ఎట్టి పరిస్థితుల్లో నాణ్యత విషయంలో రాజీపడవద్దని ఆదేశించారు. ఇటీవల కాలంలో డ్రగ్ అడిక్షన్ కేసులు ఎక్కువగా వస్తున్నందున ఆసుపత్రిలో ప్రత్యేకంగా డి-అడిక్షన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేయాలని సూచించారు.

ఫ్యామిలీ మెడిసిన్, ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాలను కూడా ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక గదులు నిర్మించాలన్నారు. సాధన కమిటీ సూచనల మేరకు డిజైన్‌లో పలు మార్పులు, చేర్పులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్ఎంఐడిసి చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, మంగళగిరి మున్సిపల్ కమిషనర్ హలీమ్ బాషా, ఎస్ఇ చిట్టిబాబు, మంగళగిరి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ స్నేహరాజ్, హాస్పటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు మాజేటి వంశీకృష్ణ, మాగంటి ప్రసాద్, రాజునాయుడు, భారతీదేవి, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రయివేట్' టీచర్ల సమస్యలు పరిష్కరిస్తా

- అందుకు ఆన్‌లైన్ మెకానిజంపై దృష్టి పెట్టా
- ఎన్‌సీసీ డైరక్టరేట్ ఏర్పాటుకు రక్షణమంత్రి సుముఖం
- శాసనసభలో మంత్రి నారా లోకేష్ సమాధానం



అమరావతి (చైతన్య రథం): ప్రైవేట్ స్కూల్ టీచర్ల సమస్యల పరిష్కారానికి ఆన్‌లైన్ మెకానిజం ఏర్పాటు చేయాలని ఆలోచిస్తున్నట్టు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ మంత్రి నారా లోకేష్ చెప్పారు. రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఆటస్థలాలు,అగ్నిమాపక భద్రతా పరికరాల ఏర్పాటుకుగల నిబంధనలు, ప్రైవేటు స్కూల్ టీచర్లు ఎదుర్కొంటున్న సమస్యలు, పాఠశాలల్లో ఎన్‌సిసి అభివృద్ధికి చేపడుతున్న చర్యలపై ఎమ్మెల్యేలు పంతం వెంకటేశ్వరరావు, వాల్మీకి పార్థసారథి అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... ప్రైవేటు స్కూళ్ల అనుమతులకు సంబంధించి ఫైర్ ఎన్‌ఓసిని అగ్నిమాపకశాఖ, బిల్డింగ్ పర్మిషన్స్ పంచాయతీ, లోకల్ బాడీస్ ఇస్తాయి. జీఓ 88 ప్రకారం అడ్మిషన్లను బట్టి ఎంత ఆటస్థలం ఉండాలనే విషయమై నిబంధనలు ఉన్నాయి. ఈ జీఓ ప్రకారం సరిపడనంత ఆటస్థలం లేకపోతే మున్సిపల్ గ్రౌండ్స్‌తో టైఅప్ కావచ్చు. అది కూడా అందుబాటులో లేకపోతే వేరే స్కూళ్లతో టైఅప్ కావచ్చని ఉంది. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెచ్చిన జీఓతో ఈ వెసులు బాటు కల్పించారు. ప్రైవేటు స్కూళ్ల పర్మిషన్లవిషయంలో కొన్ని లోటుపాట్లు ఉన్నట్లు నా దృష్టికి వచ్చాయి. ఇందుకు ట్రాన్సపరెంట్ మెకానిజం ఏర్పాటు చేయాలని నిర్ణయించాం. ఎన్‌సిసికి సంబంధించి రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి డైరక్టరేట్ ఏర్పాటు చేయాలని కోరగా, ఆయన సానుకూలంగా స్పందించారు. ఆటస్థలాల విషయంలో మార్పులు, చేర్పులు చేయాలంటే జీఓ 88 సవరణ తీసుకురావాల్సి ఉంది. 50శాతం మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కాలేజిల్లో చదువుతున్నారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాలని అనేక సంస్కరణలు చేపట్టాం. విద్యార్థుల మానసిక వికాసానికి ఫిజికల్ ఎడ్యుకేషన్ కీలకపాత్ర వహిస్తుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి పిఇటిలను నియమించే విషయమై సమీక్షిస్తున్నాం. క్రీడాస్థలాల విషయంలో నిబంధనలు ఖచ్చితంగా పాటించాలి. ప్రైవేటు స్కూల్ టీచర్ల జీతాల విషయమై ప్రైవేటు యజమానులతో సమావేశం కాగా, కొన్ని పత్రాలు ఇచ్చేందుకు ప్రైవేటు టీచర్లు నిరాకరిస్తున్నట్టు తమ దృష్టికి తెచ్చారు. ఏదేమైనా ఖచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. వచ్చేవారం ప్రైవేటు టీచర్లతో అధికారులు సమావేశమై వారి సమస్యలు తెలుసుకోనున్నట్టు మంత్రి లోకేష్ వెల్లడించారు.

# ఏడాదిన్నరలోగా మంగళగిరి అభివృద్ధి

- అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్, స్టార్మ్ వాటర్ ప్రాజెక్టులపై దృష్టి
- మే నుంచి పనులు ప్రారంభించేలా ప్రణాళికలు రూపొందించాలి
- సమాంతరంగా అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్ పనులు పూర్తిచేయాలి
- యూజీడీ, డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ డీపీఆర్‌లపై సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశం



ఉండవల్లి (చైతన్య రథం): మంగళగిరి-తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, డ్రింకింగ్ వాటర్, స్టార్మ్ వాటర్ (వర్షపునీటి నిర్వహణ) ప్రాజెక్టులకు సంబంధించి మేలో పనులు ప్రారంభించి ఏడాదిన్నరలోగా పూర్తిచేసేలా ప్రణాళికలు రూపొందించాలని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. ఉండవల్లి నివాసంలో యూజీడీ, డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్టుల డీపీఆర్‌లపై అధికారులతో మంత్రి సమీక్షించారు. పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో పురపాలక మంత్రి పి.నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆయా ప్రాజెక్టుల డీపీఆర్‌లను పకడ్బందీగా రూపొందించాలని, ప్రజలనుంచి ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పొరుగు రాష్ట్రాల్లో అమలుచేస్తున్న ఉత్తమ విధానాలను పరిశీలించి అందుకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేయాలన్నారు. ఆయా ప్రాజెక్టులతో పాటు సమాంతరంగా అండర్ గ్రౌండ్ గ్యాస్, పవర్ పనులు కూడా చేపట్టాలన్నారు. మంగళగిరి ప్రజలు నాపై బాధ్యత పెట్టారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో మూడో అత్యధిక మెజార్టీతో గెలిపించారు. మంగళగిరి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్ మెంట్ ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్, సీఆర్డీయే కమిషనర్ కన్నబాబు, పబ్లిక్ హెల్త్ ఈఎన్ సీ మరియన్న, ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్ బాషా, ఏపీయూఐఏఎంఎల్(యూజీడీ) రాజేష్ బాబు, డ్రింకింగ్ వాటర్ ప్రాజెక్ట్ కన్సల్టెంట్ అశోక్ రాజు, సీఆర్డీయే డైరెక్టర్(టీపీ) వి.సునీత తదితరులు పాల్గొన్నారు.

# ప్రముఖ క్షేత్రంగా మంగళగిరి

- శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయ అభివృద్ధికి చర్యలు
- ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామిని దర్శించుకోవాలి
- మౌలిక వసతుల కల్పన, భక్తులకు మెరుగైన సౌకర్యాలు
- దేవాలయాభివృద్ధి మాస్టర్ ప్లాన్‌పై సమీక్షలో మంత్రి లోకేష్ ఆదేశం



ఉండవల్లి (చైతన్య రథం): మంగళగిరి శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని ప్రముఖ దేవాలయాల తరహాలో అభివృద్ధి చేస్తామని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం అభివృద్ధికి సంబంధించి అధికారులు రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై మంత్రి సమీక్షించారు. కొండ దిగువన ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవాలయం, పానకాల నరసింహస్వామి, గండాలయ స్వామి దేవాలయ అభివృద్ధికి సంబంధించిన డిజైన్లను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రహదారుల నిర్మాణం,వసతి, ఇతర సదుపాయాలు, పార్కింగ్ తదితర అంశాలపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. మన సంప్రదాయాలను పాటిస్తూ భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులు రెండు, మూడురెట్లు పెరిగే అవకాశం ఉందని, అందుకు తగ్గట్టుగా సౌకర్యాలు, వసతి కల్పించాలన్నారు. ప్రశాంత వాతావరణంలో భక్తులు స్వామివారిని దర్శించుకోవాలని, అందుకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను తీర్చిదిద్దాలని ఆదేశించారు. ఇందుకు ఆలయ పండితులతోపాటు నిపుణుల సలహాలు తీసుకోవాలని సూచించారు. వీలైనంత త్వరగా డిజైన్లను పూర్తిచేసి పనులు ప్రారంభించాలన్నారు. ఏడాదిలోగా నిర్మాణాలను పూర్తి చేయాలని నిర్దేశించారు. ఎకో పార్క్ అభివృద్ధిపైనా సమావేశంలో చర్చించారు. సమీక్షలో ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి, ఎండోమెంట్స్ కమిషనర్ రామచంద్రమోహన్, ఎస్ఎంజీ కన్సల్టెంట్ మూర్తి, ఏపీటీడీసీ ఈడీ శేషగిరిరావు, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఈవో కోటిరెడ్డి, లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు ఎమ్ శ్రీనివాస దీక్షితులు, ఏపీటీడీసీ ఎస్ఈ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి లోకేష్ చేతులమీదుగా
# నేడు అశోక్ లేలాండ్ ప్లాంటు ప్రారంభం

**-తొలివిడతలో 600మందికి, మలివిడతలో 1200 మందికి ఉద్యోగాలు**

అమరావతి (చైతన్య రథం): భారత ఆటోమొబైల్ రంగంలో 2వ అతిపెద్ద వాహన తయారీసంస్థ అశోక్ లేలాండ్ ప్లాంటును విజయవాడ సమీపంలోని మల్లవల్లి మోడల్ ఇండస్ట్రియల్ పార్కులో రాష్ట్ర విద్య, ఐటి మంత్రి నారా లోకేష్ బుధవారం సాయంత్రం ప్రారంభించనున్నారు. హిందూజా గ్రూప్ అనుబంధ సంస్థ అయిన అశోక్ లేలాండ్ ప్రపంచంలోబస్సుల ఉత్పత్తిలో 4వస్థానం, ట్రక్కుల ఉత్పత్తిలో 13వ స్థానంలో ఉంది. ఇటీవల భారత దేశంలో 34వ ఉత్తమ బ్రాండ్‌గా ర్యాంక్ పొందింది. 75సంవత్సరాల చరిత్ర కలిగిన అశోక్ లేలాండ్ 50 దేశాలకు తమ వాహనాలను ఎగుమతి చేస్తోంది. విజయవాడ బెల్ట్‌లో ప్రారంభం కానున్న మొట్టమొదటి ఆటోమొబైల్ ప్లాంటు ఇది. ఇందులో ఫేజ్ -1లో 600మందికి, ఫేజ్ -2లో 1200 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మల్లవల్లి పారిశ్రామికవాడలోని 75 ఎకరాల్లో విస్తరించిన ప్లాంటులో అత్యాధునిక సాంకేతిక ప్రమాణాలతో అశోక్ లేలాండ్ బ్రాండ్ వాహనాలను తయారు చేస్తారు. ఈ ప్లాంట్‌లో 7 మీటర్ల నుండి 13.5 మీటర్ల వరకు బిఎస్-6 మోడళ్ల బస్సులను ఉత్పత్తి చేస్తారు. ఇది ఎలక్ట్రిక్ వాహనాల కోసం బాడీ బిల్డింగ్‌ను కూడా చేపడుతుంది. ఈ ప్లాంటు ఫేజ్-1లో, 2లలో సంవత్సరానికి 2400 బస్సుల ఉత్పత్తి సామర్ధ్యంతో పని చేయనుంది.

## విద్యుత్ బకాయిలపై
# సర్ ఛార్జి మాఫీ

అమరావతి (చైతన్య రథం): రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ విభాగాలు, సంస్థలు విద్యుత్ సర్‌ఛార్జి మాఫీ చేస్తున్నట్లు ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీమ్ (ఓటీఎస్) కింద సర్‌ఛార్జి మాఫీ చేసేందుకు అనుమతిచ్చింది.

2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వ విభాగాలు, సంస్థలన్నీ విద్యుత్ వినియోగం కింద రూ.3,176 కోట్ల మేర డిస్కాంలకు బకాయి పడ్డాయి. బకాయిలపై విధించిన సర్‌ఛార్జిని మాఫీ చేయాలంటూ ప్రభుత్వం లేఖ రాసింది. 2024 డిసెంబరు 31నాటికి ప్రభుత్వం మొత్తం పెండింగ్ బకాయిలు రూ.12,169 కోట్లుగా ఉన్నట్లు ఈఆర్సీ వెల్లడించింది. ఇందులో కరెంటు బకాయిలు రూ.9,010కోట్ల మేర చెల్లింపుల ఆలస్యంపై విధించిన సర్‌ఛార్జి రూ.3,158 కోట్లు ఉన్నట్లు స్పష్టం చేసింది. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కరెంటు బకాయిలు రూ.4,782 కోట్లుగా వెల్లడించింది. వీటిలో రూ.1,605కోట్ల మేర సర్‌ఛార్జి కట్టాల్సి ఉందని ఈఆర్సీ స్పష్టం చేసింది.

ప్రభుత్వ విభాగాలు, సంస్థలు కరెంటు బకాయిలు చెల్లించేందుకుగాను 2024-25 ఆర్థిక సంవత్సరానికి సర్‌ఛార్జిని మాఫీ చేసేందుకు ఈఆర్సీ అనుమతించింది. ప్రత్యేక కేసుగా పరిగణించి ఓటీఎస్ కింద రూ.1,605 కోట్ల మాఫీకి డిస్కమ్‌లకు అనుమతి ఇస్తూ ఈఆర్సీ ఉత్తర్వులు ఇచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన కరెంటు బకాయిలను మాత్రం 2025 ఏప్రిల్ 17వ తేదీలోపు చెల్లించాల్సిందిగా ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీచేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ గడువు తేదీని పొడిగించొద్దని డిస్కమ్‌లకు సూచిస్తూ ఏపీఈఆర్సీ ఉత్తర్వులిచ్చింది..

# ఇదీ.. ఆశయం నెరవేరిన ఆనందం

## చేనేతకు ఉచిత విద్యుత్‌పై ఐటీ మంత్రి లోకేష్ వ్యాఖ్య



అమరావతి (చైతన్య రథం): 'ఒక హామీ నెరవేర్చితే ఏదో నా బాధ్యత తీరిపోయినట్టు కాదు. భారం దించుకున్నట్టు అంతకంటే కాదు. లక్షలాది బతుకులకు అది వెలుగుదారి కావాలనే నాఆశయం నెరవేరుతుందనే ఆనందమిది' అని ఐటీ మంత్రి నారా లోకేష్ వ్యాఖ్యానించారు. చేనేత కళాకారులకు 200 యూనిట్లు, పవర్‌లూమ్‌కు 500 యూనిట్లు ఉచిత విద్యుత్ ఇవ్వాలనే ప్రతిపాదనకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన మంత్రిమండలి ఆమోదముద్ర వేయడం సంతోషాన్నిచ్చిందని వ్యాఖ్యానించారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే నేనిచ్చిన మాటను మంత్రిమండలి కార్యరూపంలో పెట్టడం ఎన్డీఏ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. 2019ఎన్నికలకు కొద్ది రోజుల ముందే మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి తక్కువ ఓట్లతో ఓడిపోయాను. అయినా నియోజకవర్గాన్ని వీడిపోలేదు. ఆరోజు నుంచి నియోజక వర్గంలో ప్రజల్లో ఒకడిగా మారాను. మంగళగిరిలో చేనేత కళాకారుల కుటుంబాలు ఎక్కువ. వారి ఇళ్లకు, పని ప్రదేశాలకు వెళ్లేటప్పుడు అందమైన వస్త్రాలను నేసేవారి జీవితాల్లో కష్టాలను చూశాను. యువగళం పాదయాత్రలో ధర్మవరం, వెంకటగిరి చేనేతల సమస్యలు విన్నాను. రాష్ట్రవ్యాప్తంగా చేనేతలందరూ పడుతున్న ఇబ్బందులు కళ్లారా చూశాక చేనేతలకు ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చాను. మాట నిలబెట్టుకుని చేనేతలకు చేదోడుగా నిలిచామన్నారు. నేను ఎక్కడికి వెళ్లినా.. ఏ అతిథిని కలిసినా మంగళగిరి చేనేత కళాకారులు నేసిన శాలువాతోనే సత్కరిస్తాను. చేనేత వస్త్రాలకు విస్తృత మార్కెటింగ్ కల్పించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నానని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# నిజమైన సంక్షేమ సారథి చంద్రన్న

## మేనిఫెస్టో హామీలకు ఎగనామం పెట్టింది జగనే

- పేదల్ని సొంత కాళ్లపై నిలబెట్టే సబ్‌ప్లాన్ నిధుల్ని దారి మళ్ళించిన జగన్
- పేదలను సొంత కాళ్లపై నిలబెడుతున్న చంద్రన్న
- మోసపూరిత సంక్షేమ సూత్రధారి జగన్
- అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయ ప్రదాత కాబట్టే 41 ఏళ్ళుగా ఆదరిస్తున్న ప్రజలు
- అవినీతి సాక్షి ఎడిటర్ వర్ధెల్లి మురళి అబద్ధాల కుతంత్రం - 15

**16.03.2025** అవినీతి విషపుత్రిక సాక్షిలో షరా మామూలుగానే వర్ధెల్లి మురళి మరో భారీ వ్యాసం రాశారు. ఇందులో జగన్ పాలనలో ప్రజలు, వ్యవస్థలు కళకళలాడాయని, నేడు చంద్రబాబు పాలనలో ప్రజలు, వ్యవస్థలు వెలవెల బోతున్నాయని, దాన్ని పవన్ నిలదీయ లేదనే విధంగా రాశారు. అలాగే ప్రజాస్వామ్య మీడియాను ఎల్లో మీడియా అంటూ నిందలు గుప్పించారు. కూటమి పార్టీల మధ్య మిత్రభేదాలు, చివరకు తండ్రి బిడ్డల మధ్య చిచ్చుపెట్టే కుట్ర పూరిత రాతలు కూడా రాశారు.

### జగన్ పాలనలోనే అధికంగా అన్నదాతల ఆత్మహత్యలు

అధికారిక లెక్కల ప్రకారం 2019-24 మధ్య జగన్ ఐదేళ్ల పాలనలో 1,300 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకు న్నారు. 2024 జనవరి నుంచి జూన్ వరకు అంటే 6 నెలల కాలంలో 109 మంది ఆత్మహత్య చేసుకున్నారు. 2024 జులై నుండి 2025 మార్చి వరకు 9 నెలల కూటమి పాలనలో 39 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. దీన్ని బట్టి చూస్తే జగన్ పాలనలో రైతు ఆత్మహత్యలు ఎక్కువగా జరగగా.. నేడు చంద్రబాబు పాలనలో గణనీయంగా తగ్గుముఖం పట్టాయని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్బీకేలు గొప్పగా రైతులకు లబ్ధి చేసి ఉంటే జగన్ పాలనలో రైతు ఆత్మహత్యలు అధికంగా ఎందుకు జరిగాయో మురళి సమాధానం చెప్పగలరా? ఆర్బీకేలు రైతు భరోసా గురించి గోరంతల్ని కొండంతలుగా అవినీతి సాక్షిలో డబ్బా కొట్టుకుంటే నమ్మడానికి రైతులేమీ అమాయకులు కాదు.

2014-19 మధ్య చంద్రబాబు ఐదేళ్ల పాలనలో ఖర్చు చేసిన మొత్తం బడ్జెట్ రూ. 7 లక్షల కోట్లు. అందులో రైతు రుణమాఫీ, అన్నదాత సుఖీభవ కింద రూ. 2 వేల కోట్లను రాష్ట్ర బడ్జెట్ నుంచి రైతులకు ఇచ్చారు. 2019-24 మధ్య జగన్ ఐదేళ్ల పాలనలో ఆయన ఖర్చు చేసిన మొత్తం బడ్జెట్ రూ. 12 లక్షల కోట్లు. ఇందులో రైతు భరోసా కింద రాష్ట్ర నిధుల నుండి జగన్ ఇచ్చింది కేవలం 19 వేల కోట్లు మాత్రమే. జగన్ పాలనలో ధాన్యం బకాయిలు చెల్లించడానికి మూడు నెలలకు పైగా పట్టింది. చంద్రబాబు ప్రభుత్వం 24 గంటలలోనే ధాన్యం నిధులు రైతు ఖాతాలలో జమ చేస్తున్నది.

2014-19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులపై రు. 71 వేల కోట్లు ఖర్చు చేసింది. జగన్ ప్రభుత్వంలో కేవలం రు.30 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు ఇవ్వనందున తుంగభద్ర, గుండ్లకమ్మ, పులిచింతల గేట్లు కొట్టుకుపోయాయి. ఇసుక మాఫియా వల్ల అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయి గ్రామాలకు గ్రామాలే వల్లకాళ్లయ్యాయి. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ పెట్టి రైతుల భూముల కబ్జాకు ప్లాన్ చేశారు. తాత, ముత్తాతల ఆస్తి అయిన పాస్ పుస్తకాలపై రాజముద్ర తీసేసి జగన్ ఫోటో వేసుకొన్నాడు. మరీ అన్యాయంగా సర్వేరాళ్లపై జగన్ పేరు వేసుకున్నారు. ఈ మెహర్బానీ కోసం 700 కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. జగన్ పాలనలో కౌలు రైతుల ఆత్మహత్యల్లో ఏపీ దేశంలోనే రెండవ స్థానానికి చేరింది. తండ్రి పాలనలో జలయజ్ఞాన్ని ధనయజ్ఞం చేశారు. రైతుల గురించి వర్ధెల్లి మురళి చర్చ చేపడితే అది జగన్ బండారాన్ని బట్టబయలు చేయగలదు.

### మేనిఫెస్టో హామీలపై 85 శాతం మడమ తిప్పింది జగనే

మద్య నిషేధంపై మాట తప్పి మడమతిప్పి విషపూరిత మద్యం పోసి 35 లక్షల మందిని రోగాల పాలు చేశారు. మెగా డీఎస్సీపై మాట తప్పారు. ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, సీపీఎస్ రద్దుపై మాట తప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకు సకాలంలో డిఏ ఇస్తానని చెప్పి మాట తప్పి వారికి రూ.26 వేల కోట్లు బకాయి పెట్టారు. ఎంతమంది పిల్లలు ఉన్నా అమ్మ ఒడి ఇస్తానన్న హామీపై మాట తప్పాడు. ఇసుక రేట్లు నియంత్రిస్తానన్న హామీపై మాట తప్పి ఇసుక రేట్లు మూడు రెట్లు పెంచి 40 లక్షల మంది భవన నిర్మాణ కార్మికులతో పాటు 125 వృత్తులు, వ్యాపారాలను నీరుగార్చారు. 25 లక్షల ఇళ్లు నిర్మిస్తానన్న హామీపై మాట తప్పి లబ్ధిదారులను అప్పుల పాలు చేశారు. సెంటు భూమి పట్టాలో రూ. 7వేల కోట్ల అవినీతి చేశారు. అసైన్ మెంట్ భూములు రక్షిస్తానన్న హామీపై మాట తప్పి 5లక్షల ఎకరాలు కబ్జా చేశారు. ఇమామ్, మౌజన్లకు నెలకు ఇచ్చే గౌరవ వేతనం రు.15 వేలకు పెంచుతామన్న హామీపై మాట తప్పాడు. పాస్టర్లకు ఇళ్లు కట్టిస్తామన్న హామీపై మాట తప్పాడు. పండగలకు బస్ చార్జీలు తగ్గిస్తానన్న హామీపై మాట తప్పారు. టిడ్కో ఇళ్లకు రూ.3 లక్షల రుణాలపై మాట తప్పడమే కాక వారిపై అదనంగా అప్పుల భారం వేశారు. అమరావతి రాజధాని నిర్మాణంపై మాట తప్పాడు. 2021 నాటికే పోలవరం పూర్తి చేస్తానన్న హామీపై మాట తప్పి మడమతిప్పాడు. పోలవరం నిర్వాసితులకు రూ.9 లక్షల పరిహారంపై మాట తప్పి మడమ తిప్పారు. ఇలా 85% హామీలపై మాట తప్పి మడమ తిప్పారు. పైగా హామీలు అమలు చేస్తున్న కూటమి ప్రభుత్వంపై నిత్యం అబద్ధపు ప్రచారం చేస్తున్నారు.

### 9 నెలల్లోనే 50 శాతానికి పైగా హామీలు నెరవేర్చిన చంద్రన్న ప్రభుత్వం

జగన్ ప్రభుత్వం మొదటి 9 నెలల్లో రూ. 250 పింఛన్ పెంచింది. చంద్రబాబు ప్రభుత్వం పింఛన్ ఒకేసారి రూ.1,000కు పెంచింది. 204 అన్న క్యాంటీన్లు ప్రారంభించింది. దీపం 2 ద్వారా కోటి మందికి ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చింది. ప్రకృతి విపత్తు సాయం రెట్టింపు చేసింది. ఉచిత ఇసుక వల్ల 125 వృత్తులు, వ్యాపారాలకు లబ్ధి చేకూర్చింది. తక్కువ ధరకే పేదలకు నాణ్యమైన మద్యం సరఫరా చేసింది. 33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొని 24 గంటల్లోనే రైతు ఖాతాల్లో నగదు జమ చేసింది. 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాల నియామకాలకు డీఎస్సీ నిర్వహణ ప్రక్రియ ప్రారంభమయింది. ఉపాధి హామీ నిధుల్లో ఇప్పటికే నాలుగు వేల కిలోమీటర్ల రోడ్ల మరమ్మతులు, మరో 3,500 కిలోమీటర్ల సిమెంటు రోడ్ల నిర్మాణం పూర్తి చేశారు. మన మిత్ర యాప్ ప్రవేశ పెట్టి 200 సేవలు వాట్సాప్ ద్వారా ప్రజలకు అందిస్తున్నారు. 7 లక్షల కోట్లకు పైగా పెట్టుబడుల ఆకర్షణతో ఐదు లక్షల ఉద్యోగాల కల్పనకు అవకాశం కల్పించారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు చేసి పౌరుల ఆస్తులకు రక్షణ కల్పించారు. చంద్రన్న ప్రభుత్వం గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కు పాదం మోపింది. 10 శాతం మహిళలపై నేరాలు తగ్గాయి. కర్నూలులో హైకోర్టు శంకుస్థాపనకు అసెంబ్లీ తీర్మానం చేసింది. ఓర్వకల్లు, కడప జిల్లా కొప్పర్తి పారిశ్రామిక వాడల్లో 25 వేల కోట్ల పెట్టుబడులు, 75 వేల ఉద్యోగాల కల్పనకు కేంద్రం నుండి హామీ సాధించింది. రామాయపట్నంలో 96 వేల కోట్లతో బీపీసీఎల్ స్థాపనకు ఆమోదం, నష్టాల్లో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంటుకు 12 వేల కోట్లు కేంద్ర సాయం సాధించింది. విశాఖ రైల్వే జోన్ కు 52 ఎకరాలు కేటాయించి ప్రధానితో ఫౌండేషన్, అమరావతికి రూ.15వేల కోట్లు, పోలవరానికి రూ.12,500 కోట్లు కేంద్ర సాయం సాధించింది. ఉత్తరాంధ్ర, రాయలసీమతో పాటు ప్రకాశం జిల్లాకు రూ.2,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీ సాధనతోపాటు 55 వేల కోట్ల జాతీయ రహదారులు, 70 వేల కోట్ల రైల్వే పనులకు అనుమతులు పొందడం జరిగింది. జగన్ 1.40 లక్షల కోట్ల బకాయిలు పెట్టి పోగా... అందులో చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికే రూ.23 వేల కోట్లు చెల్లించింది. ఇలా ఇప్పటికే 50 శాతం వరకు హామీలు అమలయ్యాయి. వచ్చే జూన్‌లోపు అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, మత్స్యకారులకు 20వేల పరిహారం అమలు చేయడానికి సీఎం ప్రకటన చేశారు. మేనిఫెస్టో హామీలు తొలి ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం అమలు చేసినన్ని హామీలు జగన్ ప్రభుత్వం అమలు చేయలేదు.

### మిత్రభేద సృష్టికి గోతి కాడ నక్కలా వైకాపా

ఏ రాష్ట్రంలోనైనా సంకీర్ణ ప్రభుత్వాలలో చిన్న చిన్న విభేదాలు ఉంటాయి. 2029 లోనూ చంద్రబాబు నాయకత్వంలో ఎన్నికలకు వెళ్తామని పవన్ కళ్యాణ్ స్పష్టంగా ప్రకటించడం గోరీ దగ్గర వైసీపీ నక్కలకు గొంతులో వెలక్కాయ పడ్డట్లయింది. 2019లో చంద్రబాబు ప్రభుత్వం కొనసాగి ఉంటే ఈ సరికే పోలవరం పూర్తై కరువు రహిత ఏపీ అయి ఉండేదని ప్రజలకు తెలుసు. 2019-24 మధ్య రాష్ట్రం ఎలా విధ్వంసమయిందో ప్రజలు మరిచిపోరు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్, గంజాయి, డ్రగ్స్, ఎర్రచందనం, రేషన్ బియ్యం మాఫియా ప్రజాధనం లూటీ చేసిందీ, జగన్ పాలనలో ప్రజల ధన, మాన, ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కోల్పోయిన చేదు అనుభవాన్ని ప్రజలు మరచిపోరు. తిరిగి వైకాపా కొరివితో ఎవరూ తల గోక్కోరు. 2029లో తిరిగి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుంది. స్వర్ణాంధ్ర విజన్ 2047 సాధిస్తుంది.



గురజాల మాల్యాద్రి
చైర్మన్: టీడీపీ నాలెడ్జ్ సెంటర్



# ఏప్రిల్ 1వరకూ వంశీకి

## రిమాండ్ విధించిన గన్నవరం కోర్టు

గన్నవరం (చైతన్య రథం): వైకాపా నేత వల్లభనేని వంశీని పీటీ వారెంట్‌పై అరెస్ట్‌చేసి గన్నవరం కోర్టులో హాజరుపరిచారు. విచారణ జరిపిన న్యాయస్థానం ఏప్రిల్ 1 వరకు వంశీకి రిమాండ్ విధించింది. అనంతరం గన్నవరం కోర్టు నుంచి విజయవాడ జిల్లా జైలుకు తరలించారు. ప్రస్తుతం సత్యవర్ధన్ కిడ్నాప్ కేసులో అరెస్టై విజయవాడ జిల్లా జైల్లో వంశీ రిమాండ్ ఖైదీగా ఉన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం ఆత్కూరు పీఎస్ పరిధిలో ఓ ముస్లిం మహిళకు చెందిన భూమిని.. ఆమె కుమారులని ఇద్దరు వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేశారు. భూమిని కొనుగోలు చేసేందుకు తాను మహిళతో అగ్రిమెంట్ చేసుకున్నానని శ్రీధర్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా రాము, వల్లభనేని వంశీ, రంగా మరొకరిపై ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో వంశీ ఏ2గా ఉన్నారు. గన్నవరం కోర్టులో ఆత్కూరు పోలీసులు ఇటీవల పీటీ వారెంట్ దాఖలు చేశారు. కోర్టు అనుమతించటంతో మంగళవారం విజయవాడ నుంచి గన్నవరం తీసుకెళ్లి కోర్టులో హాజరు పర్చారు.

తనకు జైలులో ఇనుప మంచం ఇచ్చారని, పరుపు, ఫైబర్ కుర్చీ ఇచ్చేందుకు జైలు అధికారులను ఆదేశించాలని వంశీ న్యాయమూర్తిని కోరారు. ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టులో ఈ అంశంపై విచారణ జరిగిన నేపథ్యంలో తాను వాటిపై ఆదేశాలివ్వలేనని గన్నవరం కోర్టు తెలిపింది. సంబంధిత కోర్టులోనే పరిష్కరించుకోవాలని వంశీకి సూచించింది. మెడికల్ రిపోర్టులు పొందుపరిస్తే వాటి ఆధారంగా ఫైబర్ కుర్చీ ఇచ్చే అంశంపై ఆదేశాలిస్తామని కోర్టు తెలిపింది. విచారణ అనంతరం వంశీని విజయవాడ జిల్లా జైలుకు తరలించారు.

# రాష్ట్రంలో క్రీడలకు పుర్వవైభవం

## ప్రజాప్రతినిధులకు క్రీడలతో ఆటవిడుపు - కోలాహలంగా ఇందిరా గాంధీ స్టేడియం - చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర శాసనసభ స్పీకర్





విజయవాడ, (చైతన్యరథం): శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులకు ఆటవిడుపు కల్పించాలనే ఉద్దేశ్యంతో కూటమి ప్రభుత్వం ఆహ్లాదకర వాతావరణంలో క్రీడా పోటీలను తలపెట్టిందని రాష్ట్ర శాసనసభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలను విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో మంగళవారం మంత్రులు, ఉపసభాపతి కే రఘురామ కృష్ణంరాజుతో కలసి ప్రారంభించారు. అనంతరం రాష్ట్ర శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు రోజూ బిజీగా ఫోన్ మాట్లాడుకుంటారని, కనీసం ఈ 3 రోజులైనా మొబైల్ ఫోన్లు పక్కన పెట్టి క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులకు క్రీడలు కొత్త సంప్రదాయం కాదని మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ హయాంలోనే ఎమ్మెల్యేల క్రీడలకు శ్రీకారం చుట్టామన్నారు. మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావుకు క్రీడలన్నా, సాంస్కృతిక కార్యక్రమాలన్నా చాలా మక్కువన్నారు. గత ప్రభుత్వ కాలంలో ప్రజాప్రతినిధుల క్రీడలు మరుగున పడిపోయాయన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడలతో కోలాహలంగా ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం మారిందన్నారు. మూడు రోజులపాటు ప్రజాప్రతినిధులు విధిగా క్రీడల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో క్రీడలకు పూర్వవైభవం చేకూరేలా అందరూ సహకరించాలన్నారు. అసెంబ్లీ మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహించి, 2 గంటల తరువాత క్రీడల్లో పాల్గొంటామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో క్రీడలను ప్రోత్సహించేందుకు కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఉపసభాపతి కనుమూరు రఘురామ కృష్ణంరాజు మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల్లో కూడా ఎంతో మంది నేషనల్ ప్లేయర్లు ఉన్నారన్నారు. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడానికి ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాల్లో కృషి చేయాలన్నారు. ప్రస్తుత అసెంబ్లీ సెషన్స్‌లోనే క్రీడలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం క్రీడా ప్రోత్సాహకాలు పెంచి క్రీడలకు అత్యధిక ప్రోత్సాహం అందిస్తోందన్నారు. నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తరువాత రాష్ట్రంలో క్రీడాకారులకు మంచి అవకాశాలు వచ్చాయన్నారు. క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ అయ్యన్నపాత్రుడు ఆదేశాలతో ప్రతిష్టాత్మకంగా క్రీడల నిర్వహణను చేపట్టామన్నారు. ప్రజాప్రతినిధుల క్రీడల నిర్వహణతో పాత సాంప్రదాయానికి నాంది పలికామన్నారు. క్రీడల శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి, క్రీడల కమిటీ సహకారంతో పటిష్ట ఏర్పాట్లు చేశామన్నారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడా పోటీలను శాప్ ఆధ్వర్యంలో చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. తొలుత మంత్రులు, ఛీఫ్ విప్‌లతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజులు క్రీడా జ్యోతిని వెలిగించారు. మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. మంగళవారం టగ్ ఆఫ్ వార్ పోటీలో మంత్రి సంధ్యారాణి వెర్సెస్ మంత్రి అనిత టీమ్ పోటీ పడ్డాయి. ఈ పోటీలో సంధ్యారాణి టీమ్ గెలిచింది. మహిళా ప్రజాప్రతినిధులు, పురుష ప్రజాప్రతినిధుల పోటీలో మహిళల జట్టు గెలవడం గమనార్హం. అదేవిధంగా ప్రజాప్రతినిధుల్లో సీఎం, స్పీకర్ టీములుగా క్రికెట్‌లో పోటీపడ్డారు.. వాలీబాల్, షటిల్ తదితర పోటీలు కూడా నిర్వహించారు.

# అయ్యన్న పాత్ర ప్రశంసనీయం

## మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



విజయవాడ, (చైతన్యరథం): శాసన సభ, మండలి సభ్యుల్లో కొత్త ఉత్సాహం నింపేందుకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు చొరవతో బడ్జెట్ సమావేశాలలో భాగంగా పలు క్రీడా పోటీలు నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గతంలో ఇటువంటి మంచి సంప్రదాయం ఉండేదని, మళ్లీ ఇన్నాళ్లకు ఆ సంప్రదాయాన్ని తెరపైకి తీసుకుని రావడం శుభపరిణామమన్నారు. శాసన సభ, మండలి సభ్యులలో కొత్త ఉత్సాహం నింపేందుకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు చొరవతో బడ్జెట్ సమావేశాలలో భాగంగా పలు క్రీడల నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని గౌరవ రాష్ట్ర వ్యవసాయ శాఖామాత్యులు కింజరాపు అచ్చెన్నాయుడుఅన్నారు. గతంలో ఇటువంటి మంచి సంప్రదాయం ఉండేదని, మళ్లీ ఇన్నాళ్లకు ఇటువంటి సంప్రదాయాన్ని తెరపైకి తీసుకుని రావడం అందుకు స్పీకర్ అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామ కృష్ణం రాజు, అధినేత నారా చంద్రబాబు నాయుడు చొరవ చూపడం సంతోషదాయకం అని అన్నారు. స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో అచ్చెన్నాయుడు టీం, నాదెండ్ల టీం క్రికెట్ లో నువ్వా నేనా అన్న విధంగా తలపడ్డాయి. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు తన కాలేజీ రోజులను తల్చుకుని తోటి సభ్యులతో ఉల్లాసంగా గడిపారు. ఇతర శాసనసభ్యుల చలోక్తులతో ప్రాంగణంలో నవ్వులు వెల్లివిరిశాయి. ప్రతి రోజూ ఒత్తిళ్లతో సతమతం అయ్యే తమకు ఇటువంటి క్రీడా పోటీలు మనోల్లాసం కలిగించడంతో పాటు క్రీడా స్ఫూర్తి చాటేందుకు ఉపయోగపడతాయని, గెలుపు ఓటములు ఎలా ఉన్నా వివిధ ప్రాంతాల సభ్యుల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొనడం ఖాయం అని అన్నారు. త్రోబాల్, టగ్ ఆఫ్ వార్, క్రికెట్, వాలీబాల్, షటిల్ పోటీల్లో సైతం పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. టగ్ ఆఫ్ వార్ లో విమెన్ టీం నెగ్గింది. వీరందరినీ మంత్రి అచ్చెన్నాయుడు ఎంతగానో ఉత్సాహపరిచారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతిరోజూ వ్యాయామం తప్పని సరి అని, ఎంత బిజీ షెడ్యూల్స్ ఉన్నా .. వ్యాయామం చేయడం మానుకోకూడదని, మానసికంగా దృఢంగా ఉండడం, శారీరకంగా దృఢంగా ఉండడం అన్నవి ఓ ప్రజా ప్రతినిధికి ఎంతో అవసరం అని అభిప్రాయపడ్డారు. మూడు రోజుల పాటూ సాగే ఈ పోటీలలో అంతా పాల్గొనాలని పిలుపు ఇచ్చారు. కొత్త తరంతో పోటీ పడి వివిధ క్రీడాంశాలలో పాల్గొనడం కూడా తనకు ఓ మంచి అనుభవం అని మంత్రి అన్నారు.






# వాలీబాల్ పోటీల్లో చించేసిన స్పీకర్

## విజేతగా అయ్యన్న పాత్రుడి జట్టు

విజయవాడ, (చైతన్యరథం): శాసనసభ్యులకు నిర్వహించిన ప్రత్యేక క్రీడా పోటీల్లో భాగంగా, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు వాలీబాల్ పోటీలో పాల్గొన్నారు. ఈ మ్యాచ్‌లో స్పీకర్ కెప్టెన్‌గా ఉన్న "స్పీకర్ టీం" 25 పాయింట్లు సాధించి విజయం సాధించింది, హోం మినిస్టర్ టీం 20 పాయింట్లతో నిలిచింది. స్పీకర్ అయ్యన్నపాత్రుడు యువకుడిలా మైదానంలో చురుకుగా కదలాడి, ప్రత్యర్థి జట్టుపై ఆధిక్యత చూపించారు. వాలీబాల్ ప్లేయర్‌గా గతంలో మంచి అనుభవం కలిగిన స్పీకర్, అదే నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ తన జట్టును అలవోకగా గెలుపు తీరాలకు చేర్చారు. ఈ క్రీడా పోటీలు శాసనసభ సభ్యుల మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పడానికి, ఆరోగ్యాన్ని ప్రోత్సహించడానికి నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలు ఉత్సాహంగా సాగిన ఈ సందర్భంగా, గెలుపొందిన స్పీకర్ టీం సభ్యులకు అభినందనలు వెల్లువెత్తాయి.

# భూ సమస్యలపై వెల్లువెత్తిన వినతులు

### టీడీపీ కేంద్ర కార్యాలయంలో అర్జీలు స్వీకరించిన మాజీ మంత్రి పీతల సుజాత, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్



మంగళగిరి, (చైతన్యరథం): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ సమస్యలపై తరలి వచ్చిన అర్జీదారుల నుండి మాజీ మంత్రి పీతల సుజాత, వన్యకుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ సీఆర్ రాజన్ అర్జీలు స్వీకరించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు. ఆర్మీ ఎక్స్ సర్వీస్‌మెన్ కోటా కింద గతంలో ప్రభుత్వం తనకు ఇచ్చిన భూమికి సరిహద్దు రాళ్లు పాతి ఆన్‌లైన్‌లో ఎక్కించాలని ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం ఇలపావులూరు గ్రామానికి చెందిన వై. ఎల్లయ్య గ్రీవెన్స్ లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు. గుంటూరు జిల్లా తెనాలి మండలం సుల్తానాబాదు గ్రామానికి చెందిన పావులూరి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేస్తూ తమకు ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం మొర్సిమిల్లి గ్రామంలో పొలం ఉందని, ఆ పొలానికి వెళ్లే పూర్వపు దారిని మోతళ్ల విష్ణువర్ధనరావు, శ్రీధర వెంకటేశ్వరరావు ఆక్రమించుకొని దారిలేకుండా చేస్తున్నారని.. తమ పొలానికి వెళ్లే దారిని కబ్జా నుండి విడిపించాలని వినతి పత్రం సమర్పించారు. వివిధ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ కేబుల్ ఆపరేటర్స్ జేఏసీ తరపున నేతలకు అర్జీ ఇచ్చి వారి సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కేబుల్ ఆపరేటర్లకు ప్రభుత్వ గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలన్నారు. అపరాధ రుసుముల నుండి తమను విముక్తులను చేయాలని కోరారు. అలాగే పోల్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.డి. పెద్దిరెడ్డి మరికొందరు కలిసి దొంగ డాక్యుమెంట్లు నకిలీ సొసైటీతో తమ స్వాధీనంలోని శ్రీ సత్య కృపా డిగ్రీ కాలేజీని ఆక్రమించుకున్నారని, వారికి అక్రమ రిజిస్ట్రేషన్ చేసిన అధికారులు, దొంగ పట్టాలు సృష్టించిన అక్రమార్కులపై చర్యలు తీసుకొని కాలేజీని కబ్జా నుండి విడిపించాలని అనంతపురం జిల్లా ధర్మవరానికి చెందిన మల్లిఖార్జున గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశాడు.

బాపట్ల జిల్లా రేపల్లె పట్టణానికి చెందిన ఆలపాటి రమేష్ బాబు విజ్ఞప్తి చేస్తూ పట్టణంలోని తమ స్థలాన్ని వేముల శ్రీనాథ్, వంకాయల రామకృష్ణ అనే వ్యక్తులు ఆక్రమించుకున్నారని దయచేసి అధికారులు స్పందించి తమ భూమిని సర్వే చేయించి స్థలాన్ని కబ్జా నుండి విడిపించాలని వేడుకున్నారు.



పల్నాడు జిల్లా మాచర్ల మండలం రాయవరం గ్రామానికి చెందిన మార్థమ్మ, కృష్ణం శెట్టి శ్రీలక్ష్మిలు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ.. తమకు చెందిన భూమిని బీమా రాజారావు , మరో వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించుకొని సాగుచేసుకుంటున్నారని, తమ భూమిని వారిని నుండి విడిపించి తమకు అప్పగించాలని వారు అభ్యర్థించారు. అచ్చంపేట మండలం వేల్పూరు గ్రామ పరిధిలో తమకు 3.70 సెంట్లు భూమి ఉండగా ప్రస్తుతం 3 ఎకరాలు ఉందని దయ చేసి మిగిలిన 70 సెంట్లను సర్వే చేసి తమ భూమిని చూపించాలని శాకమూరి కనకారావు నేతలకు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

## దివాన్ చెరువు సమీపంలో ఫారెస్ట్ అకాడమీ

అమరావతి, (చైతన్యరథం): అటవీ శాఖ సిబ్బందికి సంబంధించిన శిక్షణను బలోపేతం చేసే దిశగా తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువు సమీపంలో రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీని నెలకొల్పాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అటవీ శాఖ ఉద్యోగులు అటవీ, వన్య ప్రాణి సంరక్షణపై లోతైన శిక్షణ పొందేందుకు అనువైన వాతావరణం ఉండాలని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఉన్నతాధికారులకు సూచించారు. శాఖ పరిధిలో ఉన్న కొన్ని స్థలాలను కూడా సూచించారు. దివాన్ చెరువు దగ్గర ఉన్న రక్షిత అటవీ ప్రాంతంలో అకాడమీని ఏర్పాటు చేస్తే సిబ్బందికి అవసరమైన శిక్షణ, అటవీ వాతావరణాన్ని కల్పించడంతోపాటు రవాణా, తత్సంబంధిత మౌలిక సదుపాయాలూ ఉంటాయని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.

వారు శాఖ పరిధిలో ఉన్న కొన్ని స్థలాలను సూచించారు. రక్షిత అటవీ ప్రాంతాన్ని వినియోగించుకొనే విషయంలో కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ నుంచి స్పష్టత తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. దీనిపై కేంద్రానికి లేఖ రాశారు. దివాన్ చెరువులోని రక్షిత అటవీ ప్రాంతంలో రాష్ట్ర ఫారెస్ట్ అకాడమీ ఏర్పాటు చేసుకోవచ్చుంటూ స్పష్టత ఇచ్చింది. కేంద్రం స్పష్టత ఇచ్చిన క్రమంలో అకాడమీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు వేగంగా చేపట్టాలని అటవీ శాఖ ఉన్నతాధికారులకు మంత్రి పవన్ దిశానిర్దేశం చేశారు.

## ప్రకృతి విపత్తుల్లో విద్యుత్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివి

### బీసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ సభలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి



అమరావతి, (చైతన్యరథం): ప్రకృతి విపత్తులు, ఆపత్కాల సమయాల్లో విద్యుత్ శాఖ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. సచివాలయంలో ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను మాజీ విద్యుత్ శాఖ మంత్రి కిమిడి కళా వెంకట్రావుతో కలిపి విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ మంగళవారం ఆవిష్కరించారు. వైసీపీ ప్రభుత్వ అనాలోచిత చర్యలతో, సంస్థాగతంగా విద్యుత్ శాఖ ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఏపీ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు పోలాకి శ్రీనివాసరావు ఈ సందర్భంగా మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సానుకూలంగా స్పందించారు. ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. విజయవాడ బుడమేరు వరదలు, తుపానుల సమయంలో ప్రాణాలకు తెగించి విధి నిర్వహణలో పాల్గొన్న విద్యుత్ ఉద్యోగుల సేవలు వెలకట్టలేనివని మంత్రి గొట్టిపాటి ప్రశంసించారు. వైసీపీ ప్రభుత్వ తప్పిదాలతో నిర్వీర్యమైన విద్యుత్ వ్యవస్థను ఉద్యోగుల సహాయంతోనే మరలా గాడిలో పెడుతున్నామని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ఉద్యోగులు తమ హక్కులను కూడా కోల్పోయారని, కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత తమ సమస్యలు పరిష్కారం అవుతాయనన్న నమ్మకం ఏర్పడిందని సంఘం నేతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ నేత కేశన శంకరరావు, ఉపాధ్యక్షులు జీ.రాము, సెక్రెటరీ ఫైనాన్స్ ఎస్. వెంకటేశ్వర్లుతో పాటు ఉమ్మడి 13 జిల్లాలకు చెందిన సంఘం నేతలు పాల్గొన్నారు.

## ఆపన్నుల రక్షణే ప్రభుత్వ లక్ష్యం: వాసంశెట్టి సుభాష్



అమరావతి, (చైతన్యరథం): ఆపదలో ఉన్నవారు ఎవరైనా సరే వారిని ఆదుకొని సహకరించడమే ప్రభుత్వ లక్ష్యమని ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి చేస్తున్నారని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన పట్టణాల శివ కుమార్తె జాహ్నవి కిడ్నీ ల సమస్యతో బాధపడుతోంది. ఆమె డయాలసిస్ నిమిత్తం తిరుపతి ఆసుపత్రికి చేర్పించాల్సి ఉంది. ఇందుకు ఆమె వైద్య సేవలు దారి ఖర్చులు గురించి మంత్రి దృష్టికి తీసుకురావడంతో చలించి పోయిన మంత్రి వాసంశెట్టి సుభాష్ వెంటనే స్పందించారు. ఆమెకు రూ.50వేల ఆర్థిక సాయాన్ని మంగళవారం జహ్నవి తండ్రికి అందజేశారు.

# ఆదాయ ఆధారిత రుణపథకం కావాలి



- సిబిల్ స్కోర్‌తో ముడిపెట్టొద్దు
- లోక్ సభలో ఆటో నగర్ సమస్యల ప్రస్తావన
- ఎంపి కేశినేని శివనాథ్ చొరవపై స్థానికంగా ప్రశంసలు

అమరావతి, (చైతన్యరథం): లోక్‌సభ సమావేశాల్లో మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని నానీ కీలకమైన అంశాన్ని లేవనెత్తారు. నెంబర్ 377 కింద ఎమ్ఎస్ఎమ్ఈలకు కొత్త రుణ అంచనా విధానాన్ని అమలు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. విజయవాడ ఆటోనగర్‌లోని లక్షమందికి పైగా కార్మికులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను ఆయన ప్రస్తావించడం గమనార్హం. ఎమ్ఎస్ఎమ్ఈలు రుణాలు పొంద డంలో ప్రధాన అడ్డంకిగా మారిన సిబిల్ స్కోర్ విషయంలో అనుకూల నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. కొత్త రుణ అంచనా విధానం అమలుకు తీసుకుంటున్న చర్యలు వెల్లడించాలని ఎంపి కేశినేని శివనాథ్ కోరారు. విజయవాడలో దేశంలోనే అతి పెద్దదైన ఆటోనగర్ 305 ఎకరాల్లో వుందన్నారు. ఈ ఆటోనగర్‌లో లక్ష మందికి పైగా కార్మికులు పని చేసు_్తన్నారన్నారు. ఆటో మొబైల్ ఇండస్ట్రీకి సంబంధించి ఆటోమొబైల్ తయారీ యూనిట్లు సూక్ష్మ, చిన్న మధ్య తరహా సంస్థలుగా ఎంఎస్ఎంఈలు అనేకం వున్నాయన్నారు. ఈ ఆటో మొబైల్ ఇండస్ట్రీలోని పరిశ్రమలు స్థానిక ఆర్థిక వ్యవస్థకు చాలా కీలకంగా నిలుస్తున్నారన్నారు. ఈ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పారిశ్రామికవేత్తలు వారి వ్యాపారాల కోసం బ్యాంకుల నుంచి రుణాలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

ఈ ఇబ్బందులకు ప్రధాన కారణం సిబిల్ స్కోర్. సిబిల్ స్కోర్ ఆధారంగా రుణాలు మంజూరు చేయటం వల్ల సిబిల్ స్కోర్ తక్కువగా వున్న ఎమ్.ఎస్.ఎమ్.ఈలు రుణాలు పొందలేక చాలా ఇబ్బందులు పడుతున్న సమస్యను విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) లోక్ సభలో ప్రస్తావించారు. రూల్ 377 కింద ఎమ్.ఎస్.ఎమ్.ఈ.లకు ఆదాయ ఆధారిత కొత్త రుణ అంచనా విధానం అమలు చేయాలనే అంశం లేవనెత్తారు. సిబిల్ స్కోర్ అనేది గతంలో తీసుకున్న రుణాల చెల్లింపుల ఆధారంగా లెక్కించబడుతుందన్నా రు. కరోనా సమయంలో రుణాల చెల్లింపు సరిగ్గా లేకపోవటంతో ఆప్రభావం సిబిల్ స్కోర్ పై పడిందని పేర్కొన్నారు. దీంతో సిబిల్ స్కోర్ తక్కువగా ఉందన్న కారణంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేయటం లేదన్నారు. వీరికి మరో ముఖ్యమైన సమస్య తమ ఉత్పత్తులు అమ్మిన వెంటనే కస్టమర్ల నుంచి చెల్లింపులు జరగవన్నారు. దీంతో రుణాల చెల్లింపు విషయంలో ఆలస్యం కావడం వల్ల కూడా సిబిల్ స్కోర్ తగ్గిపోతుందని వివరించారు. ఈ సిబిల్ స్కోర్ తగ్గిపోవటం వల్ల కొత్త రుణాలు పొందలేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఒకవేళ రుణం మంజూరు చేసినా అధిక వడ్డీతో చేస్తున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితి వారిని ఆర్థికంగా కష్టాల్లో పడేలా చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్.ఎస్.ఎమ్.ఈలకు సిబిల్ స్కోర్ ఆధారంగా కాకుండా, వారి ఆదాయాన్ని బట్టి రుణ అర్హతను నిర్ణయించే ఆదాయ ఆధారిత రుణ అంచనా విధానం తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యను ప్రభుత్వం కూడా గుర్తించిందని తెలిపారు. 2024-25 కేంద్ర బడ్జెట్‌లో ఎమ్.ఎస్.ఎమ్.ఈల క్రెడిట్ స్కోర్‌పై ఆధారపడకుండా, వారి డిజిటల్ డేటా ఆధారంగా ఆదాయ ఆధారిత కొత్త రుణ అంచనా విధానాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వ రంగ బ్యాంకులకు ప్రభుత్వం సూచించదని వివరించారు. ఈ విధానం వల్ల ఎమ్.ఎస్.ఎమ్.ఈల వాస్తవ ఆర్థిక స్థితిని అర్థం చేసుకుని రుణాలు మంజూరు చేయడం సులభమవుతుందన్నారు. ఈ కొత్త విధానం వల్ల రుణాలు పొందడం సులభమవుతుందన్నారు. ప్రభుత్వం ఈ విధానం అమలుకు ఏ మేరకు చర్యలు తీసుకుందో వెల్లడించాలి” అని ఎంపీ కేసినేని శివనాథ్ కోరారు. ఎమ్.ఎస్.ఎమ్.ఈలకు ఉపయోగపడే ఆదాయ ఆధారిత కొత్త రుణ అంచనా విధానం అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకుంటుందో వెల్లడించాలని ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) విజ్ఞప్తి చేశారు.

# 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు : మంత్రి కొండపల్లి



అమరావతి (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు భవిష్యత్తులో 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్లు ఇస్తామని ఎంఎస్ ఎంఈ , సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. 50 ఏళ్లు నిండిన వారికి పింఛన్ ఇచ్చేందుకు ఈ బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్లు మంత్రి తెలిపారు. 50 ఏళ్లకు పింఛన్ పథకం అమలుపై శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ సమాధానం చెప్పారు. ఒంటరి మహిళలు, డప్పు కళాకారులు, చేనేతలు, ఆదివాసీ గిరిజనులు, సాంప్రదాయ చర్మకారులకు ఇప్పటికే పింఛన్లు ఇస్తున్నామని ఆయన పేర్కొన్నారు. మత్స్య, గీత కార్మికులు సహా పలు వర్గాల వారికి 50 ఏళ్లకే పింఛన్ ఇస్తున్నట్లు ఆయన గుర్తు చేశారు.

# భీమిలి బీచ్‌లో నిర్మాణాలను పరిశీలించిన అధికారులు



భీమిలి (చైతన్యరథం): విశాఖ జిల్లా భీమునిపట్నం బీచ్‌లో సీఆర్ జడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తోన్న సంస్థలను జీవీఎంసీ, ఎన్ఐవో, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల కమిటీ మంగళవారం పరిశీలించింది. భీమిలి ఆర్డీవో సంగీత్ మాధుర్, జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మ, ఎన్ఐవో సైంటిస్ట్ డాక్టర్ వీవీఎస్ఎస్ శర్మ, సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ పీవీబీఎల్ శాస్త్రిల బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. బీజాగ్, విరాగో, తీరప్రాంతం, సాంటమ్ బార్ అండ్ రెస్టరంట్, మార్లిన్ క్లేల అనుమతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన పనులపై ఆరా తీశారు. సీఆర్‌డ్ నిబంధనలకు విరుద్దంగా నిర్మించిన కట్టడాలపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్, గ్రామాభివృద్ధి సంఘం హైకోర్టులో పిటిషన్ వేసిన విషయం తెలిసిందే.

హైకోర్టు ఆదేశాలతో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న నిర్మాణాలకు సంబంధించి పూర్తి నివేదిక ఇవ్వాలని కమిటీని నియమించింది. ఈ నేపథ్యంలో నివేదికను ఇచ్చేందుకు క్షేత్రస్థాయి నిర్మాణాలు, అనుమతులపై అధికారులు సమాయత్తమవుతున్నారు.

# అనకాపల్లిలో కలకలం రేపిన మహిళ మృతదేహం

**• బెడ్ షీట్లో సగం డెడ్ బాడీ... విచారణ చేపడుతున్న పోలీసులు**



అనకాపల్లి (చైతన్యరథం): కసింకోట మండలం.. బయ్యవరం హైవేపై మంగళవారం ఉదయం ఒక్కసారిగా అలజడి మొదలైంది.. హైవే కల్వర్టు కింద ఓ బెడ్ షీట్ చుట్టి ఉంది. చుట్టూ కుక్కలు ఉన్నాయి.. ఈగలు కూడా తిష్టవేశాయి.. ఏం అర్థకావడం లేదు.. రగ్గు.. మూటలాగా కట్టి ఉండటం చూసి.. అనుమానం వచ్చింది.. దీంతో ఏంటో చూద్దామని స్థానికులు అక్కడికి వెళ్లారు.. దగ్గరకు వెళ్లి చూసేసరికి దెబ్బకు షాకయ్యారు.. బెడ్ షీట్లో ఉన్నది మృతదేహంగా గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అది.. మహిళకు చెందిన సగం మృతదేహంగా పోలీసులు గుర్తించారు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు.. విచారణ ప్రారంభించారు. ఓ మహిళను అత్యంత దారుణంగా హత్య చేసి.. ఆపై ఆమె సగం శరీర భాగాలు తీసుకువచ్చి పడేసినట్టు గుర్తించారు. మృతదేహంలో.. నడుము నుంచి కాళ్ళ వరకు భాగాలున్నాయి.. దీంతో పాటు ఓ చేయి ఉంది. రగ్గు లాంటి బెడ్ షీట్లో.. సగం మృతదేహాన్ని చుట్టి.. తీసుకొచ్చి కల్వర్టులో పడేశారు గుర్తుతెలియని దుండగులు. సమాచారం అందుకున్న అనకాపల్లి డీఎస్పీ శ్రావణి ఘటన స్థలిని పరిశీలించి.. పలు వివరాలు సేకరించారు. క్లూస్ టీం కూడా రంగంలోకి దిగింది. అనంతరం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. గుర్తుతెలియని ఆ మహిళ ఎవరై ఉంటుంది..? ఎవరు హత్య చేసి ఉంటారు.. అనేదానిపై పోలీసులు కూపి లాగుతున్నారు. ఈ ఘటనపై ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రాంతంలోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు.. మిస్సింగ్ మహిళ వివరాలు కూడా ఆరాతీస్తున్నారు. కాగా.. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం సృష్టించింది.

# ఓటర్ ఐడీ ఆధార్ అనుసంధానానికి సీఈసీ ఓకే




ఆధార్ కార్డులతో ఓటరు గుర్తింపు కార్డులను అనుసంధానించే అంశంపై కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) మంగళవారం కీలక ప్రకటన చేసింది. ప్రస్తుతం అమల్లో ఉన్న చట్టాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ఆధార్‌తో ఓటరు ఐడీలను అనుసంధానిస్తామని వెల్లడించింది. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలపై త్వరలోనే యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈసీలకు చెందిన నిపుణులు సంప్రదింపులు జరుపుతారని ఎన్నికల సంఘం తెలిపింది. ఈ అంశంపై చర్చించేందుకు మంగళవారం ఈసీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించింది. ఇందులో కేంద్ర హెూంశాఖ, న్యాయశాఖ, ఐటీ శాఖల కార్యదర్శులు, యూఐడీఏఐ సీఈఓ పాల్గొన్నారు. "రాజ్యాంగంలోని ఆర్టికల్ 326 ప్రకారం ఓటు హక్కు భారత పౌరులకు మాత్రమే ఉంది. ఒక వ్యక్తి ఉనికిని నిర్ధరించడానికి ఆధార్ ప్రాతిపదికగా నిలుస్తుంది. అందుకే మేం ఓటరు ఐడీని ఆధార్‌తో లింక్ చేస్తున్నాం. 1950 ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని 23(4), 23(5), 23(6) సెక్షన్ల ప్రకారం, 2023లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారమే మేం ఈ ప్రక్రియను చేపడుతున్నాం" అని ఈసీ ఓ ప్రకటనలో తెలిపింది.

**అది స్వచ్ఛందమే!**

ప్రజలు స్వచ్ఛందంగా తమ ఓటరు ఐడీతో ఆధార్ కార్డును లింక్ చేసుకోవచ్చు. ఆధార్-ఓటర్ ఐడీల అనుసంధానాన్ని పూర్తి చేయడానికి నిర్దిష్ట గడువేదీ లేదని ఇప్పటికే పార్లమెంటుకు కేంద్ర ప్రభుత్వం తెలిపింది. ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలనే లక్ష్యం మాత్రమే తమకు ఉందని పేర్కొంది. ఓటరు ఐడీతో ఆధార్‌ను లింక్ చేసుకోని వారి పేర్లను ఓటరు జాబితాల నుంచి తొలగించే ప్రసక్తే లేదని కేంద్రం స్పష్టం చేసింది. ప్రజా ప్రాతినిధ్య చట్టం -1950లోని సెక్షన్ 23ని 2021 ఎన్నికల చట్టాల సవరణ చట్టం ద్వారా సవరించారు. దీని ప్రకారం, "ఒక భారత పౌరుడి ఓటరు గుర్తింపును నిర్ధరించేందుకు, ఆధార్ కార్డును స్వచ్ఛందంగా చూపించమని అతడిని అడిగే అధికారం ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారులకు ఉంటుంది.

# విజయనగరం జిల్లాలో నలుగురు మృతి

**• వివిధ ఘటనల్లో ప్రాణాలు కోల్పోయిన యువకులు**

విజయనగరం (చైతన్యరథం): బొత్సవానివలసలో బెల్లం క్రషర్ వద్ద పని చేస్తున్న యువకుడు ఏడువాక రామ్‌కుమార్(25) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. వేపాడ మండలం డబ్బిరాజుపేటకు చెందిన రామ్‌కుమార్ మూడు నెలలుగా బొత్సవానివలసలోని ఓ బెల్లం క్రషర్ వద్ద పనిచేస్తున్నాడు. సోమవారం సాయంత్రం క్రషర్ పనులు ముగించుకుని సంబంధిత సామగ్రిని వ్యానులో లోడ్ చేస్తున్నాడు. వ్యానుపై నుంచి నిలబడి సామగ్రిని లోడ్ చేస్తుండగా.. పైన వేలాడుతున్న విద్యుత్ వైర్లు చేతికి తగిలాయి. దీంతో రామ్‌కుమార్ విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే బాడంగి సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరిశీలించి మృతిచెందినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించారు.

**రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి**

సీతానగరం మండలంలోని జగ్గునాయుడుపేట సమీపంలో రైలు పట్టాల పక్కన ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. జార్జాండ్ రాష్ట్రం వెస్ట్‌సింగారం జిల్లా హట్గామారియా ప్రాంతానికి చెందిన ప్రదానహేమార్బరన్(23) ప్రమాదవశాత్తు గుర్తు తెలియని రైలు నుంచి జారిపడినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడు కుటుంబీకులకు సమాచారం అందించినట్లు చెప్పారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు కేసు నమోదు చేశారు.

**బెంగుళూరులో జిల్లా యువకుడి మృతి**

బెంగుళూరులో మండలంలో కుమిలి గ్రామానికి చెందిన నరేళ్ల చంద్రమౌళి(25) రైలు ఢీకొని మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం ఈ యువకుడు బెంగుళూరులో ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తున్నాడు. రైల్వేస్టేషన్‌కు వెళ్లి ప్లాట్‌ఫాంపై నడుస్తూ వెనుక వైపు నుంచి వస్తున్న రైలు గమనించలేదు. దాంతో వేగంగా వస్తున్న రైలు చంద్రమౌళికి తగలటంతో తీవ్రమైన గాయాల పాలై అక్కడిక్కడే మృతి చెందినట్టు తెలుస్తోంది.

**బెంగుళూరులో జిల్లా యువకుడి మృతి**

ఎయిర్‌పోర్టు నిర్మాణంలో భాగంగా మండలంలోని కవులవాడ సమీపంలో రాళ్లు పేల్చే బాంబు పేలడంతో రామ చంద్రపేటకు చెందిన బోర కొత్తయ్య(35) సోమవారం దుర్మరణం పాల య్యాడు. రామచంద్రపేటకు చెందిన కొత్తయ్య కొన్ని రోజులుగా ఎయిర్‌పోర్టు పనులు చేస్తున్నాడు. కవులవాడ సమీపంలో రాళ్లను పేల్చడానికి పేల్చేందుకు ప్రయత్నించగా ప్రమాదవశాత్తు పేలింది. కొత్తయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. తగరపువలస ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే కొత్తయ్య మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి తల్లి, భార్య ఎర్రమ్మ, ఇద్దరు కుమారులున్నారు. సీఐ ప్రభాకర్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు.

# మండిపోతున్న తెలుగు రాష్ట్రాలు




విశాఖపట్నం (చైతన్యరథం): తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండిపోతున్నాయి. మే నెలలో కనిపించాల్సిన ఎఫెక్ట్- తెలుగురాష్ట్రాల్లో మార్చిలోనే కనిపిస్తోంది. వడగాడ్పులు ఠారెత్తిస్తున్నాయి. ఉదయం పదకొండు దాటిందంటే చాలు- ఎండ మండిపోతుంది. ఇప్పటికే టెంపరేచర్లు 42 డిగ్రీల మార్క్‌ను దాటేశాయి. దీంతో ఎండవేడిమికి బయటకు వెళ్లలేని పరిస్థితి ఉంది. రెండు రాష్ట్రాల్లో 42 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం అల్లాడుతున్నారు. ఒకవైపు ఎండవేడిమి, మరోవైపు ఉక్కపోతతో చుక్కలు చూస్తున్నారు. అత్యవసర పనుల కోసం బయటకు వచ్చేవారు.. వేడి గాలులకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలోనే.. వాతావరణ శాఖ అలెర్ట్ జారీ చేసింది.. మధ్యాహ్నం వేళ అసవరమైతేనే బయటకు రావాలంటూ సూచిస్తోంది.. ఎండ దెబ్బకు గురికాకుండా ఉండేందుకు జాగ్రత్తలు పాటించాలని సూచిస్తోంది. మంగళవారం ఆంధ్రప్రదేశ్ లో 128 మండలాల్లో వడగాలులు, 29 మండలాల్లో తీవ్ర వడగాలులు వీచే అవకాశముందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ చెప్పింది.. మంగళవారం (18-03-25) పార్వతీపురంమన్యం జిల్లా-13, శ్రీకాకుళం జిల్లా -7, విజయనగరం జిల్లా-8, అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలాల్లో తీవ్ర వడగాల్పులు (29), వడగాల్పులు(99) ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు ఎండి రోణంకి కూర్మనాథ్ తెలిపారు.

అటు తెలంగాణలో ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మార్చి రెండో వారంలోనే రికార్డుస్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఇక ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాలులు వీచే అవకాశం ఉంది. నిన్న తెలంగాణలోని 22 జిల్లాల్లో 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

**ఆంధ్రాలో అధికమైన ఎండ తీవ్రత..**

ఆంధ్రాలో ఎండ తీవ్రత అధికమైంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదువుతున్నాయి. గత సోమవారం ఏపీలో ఉష్ణోగ్రతలు ఒకసారి పరిశీలిస్తే.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో 42.8, విజయనగరం జిల్లా తుమ్మికపల్లిలో 42.6, అనకాపల్లి జిల్లా నాతవరం, 42.1, ప్రకాశం జిల్లా పెద్దారవీడు, 42.1, నంద్యాల జిల్లా గోనవరంలో 42.1, కర్నూలు జిల్లా నన్నూర్ లో 41.7.. అధిక ఉష్ణోగ్రతలు నమోదు కాగా 40 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 78 మండలాల్లో వడగాల్పులు వీచినట్లు వాతావరణ కేంద్రం చెప్పింది.

## వాట్సాప్ పరిపాలన... ప్రజలకు ప్రభుత్వాన్ని మరింత చేరువ చేస్తుంది : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్



రాజమహేంద్రవరం (చైతన్యరథం): ఐటి అంటే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గుర్తుకొస్తారని, ఇప్పుడు వాట్సాప్ గవర్నెన్స్ అంటే మంత్రి నారా లోకేష్ గుర్తుకు వస్తున్నారని రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఐటి నుంచి ఏఐకి మారడం గొప్ప విషయమని కొనియాడారు. వాట్సాప్ పరిపాలన ద్వారా అవినీతికి తావు లేకుండా, పారదర్శకత ఉండేలా జవాబుదారీతనంతో బెటర్ సర్వీసు అందేలా చర్యలు చేపట్టారని మంత్రి నారా లోకేష్ ను ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అభినందించారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా వాట్సాప్ గవర్నెన్స్ ఉండాలని ఆకాంక్షించారు. కుల ధృవీకరణ పత్రాల కోసం ఏటా సచివాలయాల చుట్టూ తిరిగే శ్రమ లేకుండా ఈయాప్ ద్వారా డౌన్ లోడ్ చేసుకునే అవకాశం కల్పించడం ప్రజలకు ఉపయోగకరంగా ఉందని అన్నారు. అయితే వాట్సాప్ పరిపాలన వల్ల ఉపాధి కోల్పోతామని మీ సేవ నిర్వాహకుల్లో ఉన్న అపోహలు తొలగించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. అర్హులకు సంక్షేమ పథకాలు అందుతాయని,ఇది తమకు చాలా ఉపయోగపడుతుందనే నమ్మకం ప్రజలకు కల్పించాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కోరారు. నిరుద్యోగులకు ఈయాప్ ద్వారా ఉద్యోగ అవకాశాలు తెలియచేయాలని ఆయన సూచించారు. గత వైసీపీ పాలకులు బటన్ నొక్కుడాన్ని నమ్ముకుంటే ఇప్పుడు మంత్రి నారా లోకేష్ టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని యోచిస్తున్నారని కొనియాడారు. వైసీపీ పాలనలో అందరి ఫోన్లు హ్యాక్ చేశారని ఆఖరికి తన ఫోన్ కూడా హ్యాక్ చేయడంవల్ల తాను ఆండ్రాయిడ్ ఫోన్ నుంచి ఐఫోనుకు మారాల్సి వచ్చిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ సభ దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పుడు కూటమి పాలనలో అలాంటి ఇబ్బంది లేదని ఆయన అన్నారు.

## సామాన్యుడి వాట్సాప్ మెసేజ్‌కు స్పందించిన మంత్రి కందుల దుర్గేష్




నిడదవోలు (చైతన్యరథం): సమస్య ఉందంటే స్పందించే నాయకులు చాలా అరుదు.. గత వైసీపీ ప్రభుత్వంలో అయితే అసలు ఆ క్వశ్చన్ లేదు.. నాయకులు ప్రజలను దగ్గరకు కూడా రానిచ్చేవారు కాదు. ప్రస్తుతం అధికారంలో ఉన్నది చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కావడంతో చిన్న సమస్య అయినా సరే ఏకంగా మంత్రులు స్పందిస్తున్నారు.. సమస్య పరిష్కరిస్తున్నారు. నిడదవోలులో ఆదివారం రాత్రి జరిగిన సంఘటనే అందుకు ఉదాహరణ. నిడద వోలు పెద్దమసీదు వీధి, జగనన్న కాలనీలో ఆదివారం రాత్రి కరెంట్ పోయింది. ఎంత సేపటికీ రాలేదు. సబ్ స్టేషన్‌కు ఫోన్ చేస్తే ఫోన్ స్విచ్ఛాఫ్ రావడంతో మంత్రి కూడా ఉన్న గ్రూప్‌లో కరెంటు కష్టాలు.. దోమల బాధలు అంటూ కాలనీకి చెందిన ఒక వ్యక్తి వాట్సప్ వేదికగా ఒక పోస్ట్‌పెట్టాడు. రాత్రి 10.50 గంటలకు మంత్రి కందుల దుర్గేష్ అమరావతిలో ఉండి స్వయంగా స్పందించారు. విద్యుత్ శాఖాధి కారులతో మాట్లాడి తక్షణం కరెంట్ వచ్చేలా చేశారు. అదే విషయాన్ని మెసేజ్ చేశారు. దాంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయాన్నే దోమల నివారణకు మునిసిపల్ కమిషనర్ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయా కాలనీల్లో సోమవారం పారిశుధ్య సిబ్బంది చర్యలు చేపట్టారు.

## మట్టి తవ్వకాలపై ప్రత్యేక నిఘా వ్యవస్థ



కొవ్వూరు (చైతన్యరథం): లంక భూముల్లో అనుమతి లేకుండా మట్టి తవ్వకాలను నిరోధించేందుకు ప్రత్యేక నిఘా వ్యవస్థ ఏర్పాటు చేశామని కొవ్వూరు తహసీల్దార్ ఎం.దుర్గాప్రసాద్ తెలిపారు. చిడిపి, కుమారదేవం గోదావరి మధ్య లంక భూముల్లో యంత్రాలతో మట్టి తవ్వి తరలిస్తున్నారని, రాత్రి వేళల్లో ఈ ప్రక్రియ చేపడుతున్నారని పలు ఫిర్యాదులు అందుతున్నాయని ఆయన అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో యంత్రాలు, వాహనాలు అక్కడ కనిపించడం లేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లంక భూముల వద్ద అక్రమంగా మట్టి తవ్వుతున్నా, తరలిస్తున్నా అందుకు వినియోగించే వాహనాలను స్వాధీనం చేసుకుంటామన్నారు. ఏటిగట్టుపై రెండు బృందాలతో నిఘా పెట్టనున్నామని, రెవెన్యూ ఆర్ ఐ బి. విశ్వేశ్వరరావు పర్యవేక్షణలో నలుగురు చొప్పున సిబ్బందితో వీటిని నియమించామన్నారు. సోమవారం నుంచి ఈ బృందాలు ఏటిగట్టుపై నిఘా పెడతాయన్నారు. రెవెన్యూ బృందాలకు ఒక్కొక్క కానిస్టేబుల్ సహకారంగా ఉంటారని, అత్యవసరమైతే ఆ శాఖ సిబ్బందిని పంపించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

## బుడమేరు ముంపు శాశ్వత పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక

● అసెంబ్లీలో మంత్రి నిమ్మల ప్రకటన



అమరావతి / పాలకొల్లు (చైతన్యరథం): బుడమేరు ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తుందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం అసెంబ్లీలో ప్రకటించారు. సభ్యులు బుడమేరుపై అడిగిన ప్రశ్నలకు మంత్రి రామానాయుడు సుదీర్ఘ, స్పష్టమైన సమాధానం ఇచ్చారు. బుడమేరు సమస్య ఒక విజయవాడ నగరానికే పరిమితం కాదని కొల్లేరు వరకు, అక్కడి నుంచి ఉప్పుటేరు, ఉప్పుటేరు మొదలు నుంచి సముద్రం వరకు సమస్య విస్తరించి ఉంది. బుడమేరు వరద సమస్య మూలాలను, తీవ్రతను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలోని క్యాబినెట్ సమావేశంలో తీవ్రంగా చర్చించి శాశ్వత పరిష్కారానికి ప్రణాళిక రూపొందించామన్నారు. ఒక్క జల వనరుల శాఖ మాత్రమే కాకుండా వరద సమస్య పరిష్కారంలో భాగంగా, రెవెన్యూ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖలను ఇందులో భాగస్వాములు చేసి ప్రణాళిక కు రూపకల్పన చేశాం. విజయవాడ నగరంతో పాటు బుడమేరు పరివాహక ప్రాంతంలోని వందల గ్రామాలకు, వేల ఎకరాలకు సమస్య ఉన్నట్లు మంత్రి స్పష్టం చేశారు. ఇంత పెద్ద సమస్య పరిష్కారానికి గాను డిజాస్టర్ మేనేజ్మెంట్ ద్వారా కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా కోరుతామన్నారు. బుడమేరు వరద సమస్య పరిష్కారంలో భాగంగా ఆ పనులను నాలుగు భాగాలుగా విభజించుకుని ముందుకెళ్లే విధంగా ప్రణాళికకు రూపకల్పన చేశామన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు, డైవర్షన్ ఛానల్ విస్తరణ, బుడమేరు గట్లు పటిష్ట పరచటం, విజయవాడ పరిసరాల్లో పాత కాలువను పునరుద్ధరించడం, కొల్లేరు చేరిన బుడమేరు వరద నీరు ఉప్పుటేరు ద్వారా సముద్రంలోకి పంపించడం వంటి పనులను ప్రతిపాదిత ప్రణాళికలో ముఖ్యాంశాలుగా చేర్చి ముఖ్యమంత్రి సమక్షంలో చర్చించామన్నారు. విజయవాడ పరిధిలోని ప్రస్తుత బుడమేరు విస్తరణ, స్థల సేకరణ చాలా ఖర్చుతో కూడుకున్నది. అనేక శాశ్వత కట్టడాలు, బహుళ అంతస్తుల భవనాలు ఉన్నాయి కాబట్టి నష్టపరిహారం భారీ స్థాయిలో ఉంటుంది. ప్రజలు కూడా ఇబ్బంది పడే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు బుడమేరు పాతకాలవను విస్తరించి, లోతు చేసినట్లయితే సమస్య తీవ్రత చాలా వరకు తగ్గుతుంది. పాత కాలువ పరిసరాలన్నీ పొలాలే కనుక భూ సేకరణ కూడా తక్కువ ఖర్చుతో అయిపోతుందని మంత్రి రామానాయుడు స్పష్టం చేశారు. కొల్లేరు లోని వరద నీటిని సముద్రంలోకి పంపే ఉప్పుటేరు ముఖద్వారం వద్ద ఆకివీడులో ఉన్న రైల్వే బ్రిడ్జి వరద ప్రవాహానికి అడ్డంకిగా తయారైందని అన్నారు. రైల్వే మంత్రిత్వ శాఖతో కూడా మాట్లాడి ఈ సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తామన్నారు.

## గోపాలపురంలో అతిసారవ్యాధి కలకలం



గోపాలపురం (చైతన్యరథం): గోపాలపురం మండలంలో అతిసారవ్యాధి కలకలం రేపుతోంది. పెద్దగూడెం, ఉప్పరగూడెం, గుడ్డిగూడెం, కొవ్వూరుపాడు, చిట్యాల, వేళ్లచింతలగూడెం, గోపాలపురం, పెద్దాపురం తదితర గ్రామాలకు చెందిన 25 మంది వాంతులు, విరేచనాలు, కడుపునొప్పితో ఆదివారం గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో చేరగా, వారిలో 20 మంది ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండడంతో సోమవారం డిశ్చార్జ్ చేశారు. చిట్యాల, పెద్దాపురం నుంచి ఒక్కొక్కరు, గోపాలపురం నుంచి మరో ఇద్దరు వ్యాధి లక్షణాలతో సోమవారం చేరారు. ప్రస్తుతం ఇక్కడ తొమ్మిదిమంది చికిత్స పొందుతున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కె. వెంకటేశ్వరరావు తెలిపారు. పది ప్రత్యేక బృందాలతో గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి సేవలందిస్తున్నారు. మరికొందరు సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నారు.

గోపాలపురం మండలంలో అతిసార వ్యాధి విజృంభణపై ముఖ్యమంత్రి చంద్రబాబు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతి, స్థానిక ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజుతో మాట్లాడారు. దీంతో ఎమ్మెల్యే, కలెక్టర్లు గోపాలపురం చేరుకున్నారు. రోగులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని వైద్యులతో చర్చించారు. పంచాయతీ, ఆర్డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేస్తున్నారని, ప్రభావిత గ్రామాల్లో ప్రజలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచినట్లు కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. అతిసారం రావడానికి మూలకారణం తెలుసుకునే క్రమంలో జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తోందన్నారు. బాధితుల రక్తం, గ్రామాల్లో నీటి నమూనాలను పరీక్షల నిమిత్తం పంపుతున్నామని, వ్యాధి ప్రబలడానికి గల కారణాలు వెల్లడి కావడానికి కొంత సమయం పడుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు ఎదురవకుండా సమన్వయంతో పని చేయాలని అన్ని శాఖల అధికారులకు ఆమె సూచించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉండటం, ఈ ప్రాంతంలో పొగాకు సాగు నేపథ్యంలో అధిక పని, ఇతర కారణాల వల్ల కూడా అతిసార వ్యాధి సోకి ఉండొచ్చని ఎమ్మెల్యే వెంకటరాజు అన్నారు.

## గెలుపు ఒక బాధ్యతగా తీసుకుని పనిచేస్తా... ఆలపాటి రాజా



విజయవాడ (చైతన్యరథం): ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీగా ఘన విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ అభినందన సభ మంగళవారం విజయవాడలోని వెన్యూ ఫంక్షన్ హాల్ నందు ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నెట్టెం శ్రీరఘురాం మాట్లాడుతూ... కష్టపడి ఓట్లు చేర్పి చివరి వరకు కూడా ఓటర్లను పోలింగ్ బూత్ వద్దకు తీసుకొచ్చి అత్యంత అద్భుతమైన విజయాన్ని ఎమ్మెల్సీగా ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు అందించిన తెలుగుదేశం పార్టీ, జనసేన, భారతీయ జనతా పార్టీ, ఉమ్మడి పార్టీ కార్యకర్తలందరికీ, అభినందనలు తెలియజేస్తున్నాను అని అన్నారు. మనం ఆలపాటి గురించి ప్రజలకు చెప్పామో వాటిని అన్నింటిని ప్రజలు గమనించి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు మంచి విజయాన్ని అందించారని అన్నారు. రెండు జిల్లాలోని సమస్యల పరిష్కారం కోసం ఆలపాటి రాజేంద్రప్రసాద్ కృషి చేయాలని నెట్టెం రఘురాం ఈ సందర్భంగా కోరారు. ఎమ్మెల్సీగా విజయం సాధించిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... మీరంతా చొరవ తీసుకుని నా గెలుపు కోసం పనిచేసినందుకు చాలా సంతోషంగా ఉంది. మీకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపే సభగా భావిస్తున్నాను. ఈ గెలుపు ఒక బాధ్యతగా తీసుకుని పనిచేస్తానని అన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో దగాపడిన ఆంధ్రప్రదేశ్‌ను తిరిగి గాడిలో పెట్టేందుకు కృషి చేస్తానని ఆలపాటి పేర్కొన్నారు.

# క్రీడావ్యాప్తికి ప్రజాప్రతినిధుల క్రీడలు దోహదం చేసే అవకాశం



వినుకొండ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడాపోటీలతో రాష్ట్ర మొత్తం విద్యార్థులు, యువతకు ఎంతో మేలు జరిగే అవకాశం ఉందని ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. రాష్ట్రం నుంచి ఒలంపిక్స్, జాతీయస్థాయిలో రాణించేలా యువతకు తీర్చిదిద్దడానికి ఇదెంతో ఎంతో మేలు ఉపయోగకరం అవుతుందన్నారు. ప్రజాప్రతినిధులు వారివారి నియోజవర్గాల్లో, స్థానికంగా అన్ని ప్రాంతాల్లో క్రీడల ప్రోత్సాహాని కృషి చేయడానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ క్రీడలు దోహదం చేస్తాయన్నారు. విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియ వేదికగా మంగళవారం ప్రారంభమైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల ఆటల పోటీల్లో ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడు, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, మహిళా మంత్రులతో కలిసి చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు జ్యోతి ప్రజ్వలన చేశారు. జాతీయ పతాకాన్ని ఎగురవేసి జాతీయగీతాన్ని ఆలపించారు. అనంతరం జరిగిన టగ్‌ఆఫ్‌వార్‌లో జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. బృందస్ఫూర్తిని, పోటీతత్వాన్ని ప్రదర్శించారు. తర్వాత మాట్లాడిన చీఫ్‌విప్ జీవీ పాఠశాలలు, కళాశాలల్లో క్రీడావ్యాప్తికి ప్రజాప్రతినిధుల క్రీడలు దోహదం చేసే అవకాశం ఉందన్నారు. ప్రాంతాలకు అతీతంగా అందరు కలసికట్టుగా పాల్గొంటున్న ఇలాంటి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు స్పీకర్, సీఎం చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజాప్రతినిధుల క్రీడలు ఎప్పటి నుంచో ఉన్న సంప్రదాయమే అయినా మధ్యలో కొంత విరామం వచ్చిందని... తిరిగి ఆ ఆటల్ని పునరుద్ధరించడం మంచి పరిణామంగా పేర్కొన్నారు. ఏటా ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తే బావుంటుందన్నారు.

# చేనేతల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి చరిత్రలో మరవలేనిది

## •చేనేత కార్మికులకు స్వీట్స్ పంపిణీ చేసిన తమ్మిశెట్టి జానకీదేవి



మంగళగిరి (చైతన్యరథం): చేనేత కార్మికులకు, ఉచిత విద్యుత్తు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబునాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదం తెలపడంతో 26వ వార్డు పాత మంగళగిరి భద్రావతి నగర్‌లో టీటీడీ పాలకమండలి సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తమ్మిశెట్టి జానకీదేవి మాట్లాడుతూ... చేనేత కార్మికుల ఇళ్లకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా ఇచ్చేందుకు మంత్రిమండలి సమావేశంలో నిర్ణయం తీసుకోవడం హర్షణీయమన్నారు. చేనేతల అభివృద్ధికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి చరిత్రలో మరవలేనిది అని అన్నారు. రాష్ట్రంలోని చేనేత కార్మికుల సంక్షేమానికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పొట్లబత్తుని లక్ష్మణరావు, 26 వార్డు అధ్యక్షులు ఉద్దంటి గాంధీ, గంజి లక్ష్మయ్య, బిట్రా నాగేశ్వర రావు, అడిగోపుల శ్రీనివాస రావు,కొన్నెల్ల పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులపై రాళ్లురువ్విన వైసీపీ కార్యకర్తలు

ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో వైసీపీ నాయకులు రెచ్చిపోయారు. ఇన్నాళ్లు కూటమి నేతలపై దాడులు చేసిన వైసీపీ కార్యకర్తలు ఇప్పుడు ఏకంగా పోలీసులపైనే దాడికి పాల్పడ్డారు. తిరుపతమ్మ ఆలయానికి ప్రభలను ఆపారని రాళ్లు రువ్వారు. ఈ క్రమంలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని రావణకాష్ఠంలా మార్చిన వైసీపీ నాయకులు అధికారం పోయినా దాడులు ఆగట్లేదు. కూటమి నాయకులను టార్గెట్ చేస్తూ ఎప్పటికప్పుడు దమనకాండ సృష్టిస్తూనే ఉన్నారు. ఇప్పుడు ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలులో ఏకంగా పోలీసులపైనే దాడులతో రెచ్చిపోయారు. ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్ర గాయాలయ్యాయి. కాగా ఈ ఘటనపై హెూంమంత్రి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ చేసి సమాచారం ఇవ్వాలని హెూం మంత్రి అనిత సూచనలు చేశారు. .

# క్రీడాంధ్రప్రదేశ్ దిశగా ప్రభుత్వం తొలి అడుగు : ప్రత్తిపాటి పుల్లారావు

విజయవాడ (చైతన్యరథం): కూటమి ప్రభుత్వం ప్రజాప్రతినిధులకోసం మూడురోజుల పాటు నిర్వహిస్తున్న సాంస్కృతిక, క్రీడా పోటీల్లో మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి జట్టు విజయం సాధించింది. విజయవాడలోని డీఆర్ఆర్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో తొలిరోజైన మంగళవారం సాయంత్రం జరిగిన పోటీల్లో మాజీమంత్రి ప్రత్తిపాటి, మంత్రి టీ.జీ.భరత్ ఒక జట్టుగా, టీడీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్, మాజీమంత్రి పితాని సత్యనారాయణ ఒక జట్టుగా బ్యాడ్మింటన్ ఆడారు. ఆద్యంతం సరదాగా సాగిన ఆటలో చివరకు ప్రత్తిపాటి, భరత్‌లు విజయం సాధించారు. ఆట ముగిసిన అనంతరం మాజీమంత్రి ప్రత్తిపాటి మాట్లాడుతూ... ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రభుత్వం మూడు రోజులపాటు క్రీడా, సాంస్కృతి పోటీలు నిర్వహించాలనే ఆలోచన చేయడం, పాత సంప్రదాయాన్ని పునరుద్ధరిచండం నిజంగా మంచి విషయమన్నారు. సభాపతి అయ్యన్నపాత్రుడి ఆలోచనను స్వాగతిస్తున్నామన్నారు. సభ్యులందరూ తప్పకుండా పోటీల్లో పాల్గొని తమజీవితాల్లో కొన్ని మధుర జ్ఞాపకాలుగా ఈ క్షణాలను పదిలపరుచుకోవాలని ప్రత్తిపాటి సూచించారు.



# చంద్రబాబు సీఎం అయ్యాక క్రీడలకు ప్రోత్సాహం పెరిగింది

## • ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం : తంగిరాల



విజయవాడ (చైతన్యరథం): రాష్ట్రానికి నారా చంద్రబాబునాయుడు సీఎం అయ్యాక క్రీడలకు ప్రోత్సాహం పెరిగిందని, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య వ్యాఖ్యానించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి ఎంతో తోడ్పాటుని అందిస్తాయన్నారు. మంగళవారం విజయవాడ మున్సిపల్ స్టేడియం నందు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ సభ్యులకు నిర్వహించిన క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, క్యారమ్స్, త్రోబాల్, టెన్నిస్, టెన్నికాయిట్, పరుగుపందెం పోటీలలో తంగిరాల సౌమ్య పాల్గొన్నారు. ఈ క్రీడల్లో మొత్తం 173 మంది ఎమ్మెల్యేలు పేర్లు నమోదు చేసుకున్నారని, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలకు దూరంగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు సైతం ఈ క్రీడా పోటీల్లో పాల్గొన్నాలని కోరారు.

# పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ప్రగతి బాటలు



గుంటూరు (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి ప్రగతి బాటలు వేస్తున్నామని, ఇప్పటికే నియోజకవర్గంలో అభివృద్ధి మార్క్ స్పష్టంగా కనిపిస్తున్నదని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. మంగళవారం 43 డివిజన్‌లో సాయిబాబా రోడ్డు, ద్వారకా నగర్ మరియు కొమ్మినేనినగర్‌లో మొత్తం 1కోటి 79లక్షల 95వేల రూపాయలతో సీసీ రోడ్లు, డ్రైన్లు మరియు ఆర్‌సీసీ కల్వర్టుల నిర్మాణానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నాను. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని చోట్ల అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వం టీడీపీ కార్పొరేటర్లు గెలిచిన చోట్ల అభివృద్ధి పనులకు నిధులు కేటాయించకుండా కక్షపూరితంగా వ్యవహరించారు. కక్షలు మా లక్ష్యం కాదు. నేను గెలిచిన నాటి నుండి ఈ రోజు వరకు కోట్లాది రూపాయల పనులు జరిగాయి. గత 5 సంవత్సరాలో పూర్తవని ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డు, దర్గా పక్క రోడ్డు మరియు కలెక్టరేట్ రోడ్డు,నల్లచెరువు ఎత్తు రోడ్డు,మార్కెట్ సిగ్నల్స్ వద్ద రోడ్డు పనులు పూర్తి చేశాం. అంతర్గత రోడ్లు, డ్రైన్లు ఇప్పటికే పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చాం. సాయిబాబా రోడ్డు పడమర కొరిటపాడు మెయిన్ రోడ్డు నుండి నార్నే టవర్స్ వరకు 40 లక్షల రూపాయల అంచనాలతో రోడ్డుకి వైపులా సీసీ డ్రైన్లు, ద్వారక నగర్ మెయిన్ రోడ్డు, అమరావతి మెయిన్ రోడ్డు నుండి ముత్యాలరెడ్డినగర్ 8వ లైన్ వరకు రూ.49.95 లక్షలతో సీసీరోడ్ నిర్మాణం చేపట్టామన్నారు. రోడ్ నిర్మాణం. కొమ్మినేనినగర్ 1వ లైన్ 1వ అడ్డరోడ్డు వరకు సీసీ డ్రైన్లు మరియు ఆర్.సీ.సీ కల్వర్టులు రూ.41 లక్షలతో నిర్మాణం, కొమ్మినేనినగర్ రెండు మరియు మూడు లైన్లో రూ.49 లక్షలతో సీసీ రోడ్లు మరియు డ్రైన్ల నిర్మాణం మొత్తం రూ.179.95 ఖర్చు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొమ్మినేని కోటేశ్వరరావు, ప్రసాద్, జమ్ముల వీరాంజనేయులు, సాయి, మన్నవ వంశీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ జిల్లాను మోడల్ జిల్లాగా తీర్చిదిద్దటమే ఎంపీ కేశినేని శివనాథ్ లక్ష్యం



తిరువూరు (చైతన్యరథం): స్వయం ఉపాధి రంగంలో ఎన్టీఆర్ జిల్లాను దేశంలో మోడల్ జిల్లాగా తీర్చిదిద్దటమే ఎంపీ కేశినేని శివనాథ్ లక్ష్యంగా పనిచేస్తున్నారని ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అండ్ పంచాయితీ రాజ్) ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ తెలిపారు. తిరువూరు నియోజకవర్గం ఎ.కొండూరు మండలంలోని మారేపల్లి గ్రామంలో మంగళవారం పంచాయతీ ఛాంపియన్స్ డ్వాక్రా మహిళలతో, గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. గ్రామ సర్పంచి తాళ్లూరి నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో సొంగా సంజయ్ వర్మ, మండలపార్టీ అధ్యక్షుడు గడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా వారి కాళ్ల మీద వారు నిలబడినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యమతుందన్నారు. గ్రామాల్లోని రైతులు, మహిళలు, యువకులు ఎంటర్ ప్రెన్యూర్స్‌గా మారి ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు అందిస్తున్న సహకారం గురించి వివరించారు. అలాగే స్వయం ఉపాధి రంగంలో ఎంటర్ ప్రెన్యూర్స్‌గా మారేందుకు ఉన్న అవకాశాలను వివరించారు. మధ్య, చిన్న తరహా పరిశ్రమలకు సంబంధించి మామిడి తాండ్ర, నాటు కోళ్లు పెంపకం, పుట్టగొడుగుల పెంపకం, కాలుష్యం లేని ఇటక తయారీ, చిరు ధాన్యాల నుండి పిండిని తయారు చేసే యంత్రాలు, ప్లాస్టిక్ నివారించి నాచురల్‌గా లభించే వేస్ట్ క్లాత్‌ల ద్వారా పేపర్ బ్యాగులు తయారీ, వర్మి కంపోస్ట్ ఎరువు తయారు చేయడం, తేనె, పట్టు పరిశ్రమ, సోలార్ ద్వారా డిహైడ్రేషన్ ఫుడ్ తయారు చేయడం గురించి వివరించి... వీటి ద్వారా సంపాదన ఏ విధంగా వుంటుందో కూడా తెలియజేశారు. ఈ కుటీర పరిశ్రమలకు ఏర్పాటు చేసి తయారు చేసే ఉత్పత్తులకు కావాల్సిన మార్కెటింగ్ సహకారం కూడా ఎంపి కేశినేని శివనాథ్ అందిస్తారని తెలిపారు. పి.ఎమ్.జి.పి (ప్రైమ్ మినిస్టర్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్– ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం) ద్వారా అందించే ఎంఎస్ఎంఈ (మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్ ప్రైజస్ ) రుణాలపై అవగాహన కల్పించారు. ఎంఎస్ఎంఈ లోన్లుపై చిన్న, మధ్య తరహా పరిశ్రమలు చేపట్టవలసిన విధి విధానాలను వాటిపై ప్రభుత్వం, బ్యాంకులు కలిగిస్తున్న ప్రోత్సాహకాలను తద్వారా చేకూరే సబ్సిడీలను తెలియపర్చారు. ఇందుకు పంచాయతీ ఛాంపియన్స్ ప్రజలకు పూర్తి సహకారం అందిస్తారనన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ వాసం మునియ్య, టీడీపీ నాయకుడు పోలిశెట్టిపాడు ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

# ప్రతి గింజా కొనుగోలు చేస్తాం

## నెల్లూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో మంత్రి నాదెండ్ల భేటీ



నెల్లూరు (చైతన్యరథం): ఆహారం, పౌర సరఫరాలు వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధ్యక్షతన నెల్లూరు జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో అసెంబ్లీలోని మంత్రి ఛాంబర్‌లో మంగళవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు పరిస్థితి, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ... ఇప్పటి వరకు జిల్లాలో 15 వేల టన్నుల పైగా ధాన్యం కొనుగోలు పూర్తి చేసామని తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, ప్రతి గింజా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం కొనుగోలు జరిగిన 24గంటల్లోపే రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతుందని తెలిపారు. రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు కొనసాగుతుందని, గన్ని బ్యాగులు అండ్ ట్రాన్స్‌పోర్ట్ సౌకర్యాలు అందుబాటులో ఉంచామని తెలిపారు. మిల్లర్స్‌తో చర్చించి ధాన్యం కొనుగోలు పకడ్బందీగా జరిగేలా చర్యలు తీసుకుంటామనీ చెప్పారు. తేమ శాతం 17 -20 ఉన్న ధాన్యాన్ని సైతం రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ధాన్యం అమ్మకం మరింత సులభతరం చేసేందుకు 7337359375 నెంబర్‌కు 'హాయ్' అని మేసేజ్ పంపితే రైతులు ధాన్యం అమ్మకం వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు. ఈ సమావేశంలో మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహమ్మద్ ఫరూక్, ఎంఎల్ఏలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, కే.రామకృష్ణ, దగుమాటి వెంకట కృష్ణారెడ్డి పౌర సరఫరాల సంస్థ ఎండీ మన్ వీర్ జిలాని తదితరులు పాల్గొన్నారు.

# గడువులోగా ప్రజా సమస్యలను పరిష్కరించాలి

### కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్

తిరుపతి, (చైతన్యరథం): ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో వచ్చిన అర్జీలను గడువులోగా సంతృప్తి స్థాయిలో పరిష్కరించాలనిచూపాలి అని సంబంధిత జిల్లా అధికారులను కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఆదేశించారు.మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు ప్రజా సమస్యల పరిష్కార వేదికపై జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, అర్జీలకు సంతృప్తి స్థాయిలో నాణ్యమైన పరిష్కారం చూపాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న అర్జీలను ప్రణాళిక బద్ధంగా సంబంధిత అధికారులు పరిష్కారం చూపాలన్నారు. క్షేత్ర స్థాయిలో స్వయంగా వెళ్లి పారదర్శకంగా విచారణ చేసి అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపుపరిష్కరించాలన్నారు. పరిష్కారం చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని ఆదేశించారు. ఎండార్స్మెంట్లను జాగ్రత్తగా అప్లోడ్ చేయాలని తెలిపారు. సరైన పరిష్కారం చూపగలిగితే రీ ఓపెన్ కేసుల సంఖ్య తగ్గుతుందని తెలిపారు. పదే పదే రీ ఓపెన్ అవుతున్న కేసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అర్జీదారులు వారి సమస్యకు పరిష్కార దిశగా గ్రీవెన్స్ రావడం జరుగుతుందని సంబంధిత అధికారులు అర్జీదారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానంగా విని సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపాలని అన్నారు. రోజువారీగా ఓపెన్ చేసుకోవాలని తెలిపారు.పి 4 సర్వే ప్రక్రియలో భాగంగా ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు ప్రత్యేక దృష్టి పెట్టి వెనుకబడిన గ్రామాలలో సర్వే ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలని తెలిపారు. పల్లె పండుగ కార్యక్రమములో భాగంగా సీసీ రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయవలసినదిగా సంబంధిత పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్క్ ఫ్రమ్ హోం సర్వ్ ప్రక్రియ ను వేగవంతం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో డీపీఓ సుశీలా దేవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రోస్మాండ్, డీఆర్డీఏ పీడీ శోభన్ బాబు డ్వామా పీడీ శ్రీనివాస్ ప్రసాద్, డీఎం అండ్ హెచ్ఓ బాలకృష్ణ నాయక్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు



# బాలాజీ తత్వవనం రిసార్ట్‌ను సందర్శించిన నూకసాని



నందిగామ (చైతన్యరథం): బాలాజీ తత్వవనం రిసార్ట్‌ను మంగళవారం ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని నూకసాని బాలాజీ సందర్శించారు. కృష్ణా జిల్లా, నందిగామ నియోజకవర్గంలోని తుర్లపాడు మండలం, కంచల గ్రామంలో మున్నేరు నది ఒడ్డున నిర్మిస్తున్న తత్వవనం – షేర్ జాయ్ విత్ నేచర్ రిసార్ట్‌ను బాలాజీ సందర్శించారు. దాదాపు 85 ఎకరాల విస్తీర్ణంలో ఎకో టూరిజం ప్రాజెక్ట్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ రిసార్ట్‌ను ఫౌండర్ నరేంద్ర మరియు డైరెక్టర్ ఒక్కిలిగడ్డ భాస్కర్ నేతృత్వంలో అభివృద్ధి చేస్తున్నారు. అనంతరం ఏపీటీడీసీ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ మాట్లాడుతూ, తత్వవనం రిసార్ట్ ఒక అద్భుతమైన పర్యాటక ప్రాజెక్ట్ అని కొనియాడారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ముఖ్యమంత్రి సహకారంతో ఈ ప్రాజెక్ట్‌ను మరింత ప్రోత్సహించి, రాష్ట్ర పర్యాటక రంగంలో ప్రత్యేక స్థానం కల్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ సహాయంతో ఈ ప్రాజెక్ట్ విజయవంతం కావడానికి అన్ని విధాలా మద్దతు ఉంటుందని చెప్పారు. పర్యాటక రంగంలో కొత్త ఉత్తేజం: తత్వవనం రిసార్ట్‌లో కార్పొరేట్ సమావేశాలు, కుటుంబ సమ్మేళనాలు, జాతీయ-అంతర్జాతీయ పర్యాటకులకు అనుకూలంగా ప్రత్యేక సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రాజెక్ట్ ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, గ్రామీణ సంస్కృతిని ప్రోత్సహించి, స్థానిక వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి స్థాయిలో ప్రారంభమవ్వడానికి నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో కొత్త శకం తెరవబోతున్న తత్వవనం రిసార్ట్‌కు పూర్తి సహకారం అందించేందుకు ఏపిటిడిసి ప్రాధాన్యత ఇస్తుందని చైర్మన్ నూకసాని బాలాజీ హామీ ఇచ్చారు.

# ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధికి కీలక అడుగులు

● ఇఫ్కో చైర్మన్, సీఈవోను కలిసిన ఎంపీ వేమిరెడ్డి



నెల్లూరు (చైతన్యరథం) : జిల్లాకు తలమానికమైన ఇఫ్కో కిసాన్ సెజ్ అభివృద్ధిలో కీలక ముందడుగు పడింది. జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఇఫ్కో కిసాన్ సెజ్‌లో పరిశ్రమలు తెచ్చేలా ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో ఇఫ్కో కిసాన్ సెజ్ చైర్మన్ దిలీప్ సంఘాని, ఇఫ్కో సీఈవో ఉదయ్‌శంకర్ అవస్థిని ప్రత్యేకంగా కలిశారు. ఈ సందర్భంగా నెల్లూరు జిల్లా కోవూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని ఇఫ్కో కిసాన్ సెజ్ కోసం సేకరించిన 2,777 ఎకరాల్లో అభివృద్ధి కార్యకలాపాలను చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం భూమిలో 1,900 ఎకరాలు సెజ్ నిమిత్తం, 877 ఎకరాలు డొమెస్టిక్ టారిఫ్ ఏరియా కింద ఉందన్నారు. ఇండియన్ ఫార్మర్స్ ఫెర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు పొందిన సహకార సంస్థ అని, వ్యవసాయం, ఇతర పారిశ్రామిక యూనిట్లకు ప్రాధాన్యతనిస్తూ పరిశ్రమలను ప్రోత్సహించడానికి ఎంతో ఉపకరిస్తుందని ఎంపీ వేమిరెడ్డి చెప్పారు. పరిశ్రమలను ప్రోత్సహించడానికి మెరుగైన నిర్వహణ దృష్టి కోసం ప్రోత్సహిస్తుందన్నారు. స్పెషల్ ఎకనమిక్ జోన్ చట్టం, 2005 ప్రకారం నెల్లూరులో 2009లో బహుళ-ఉత్పత్తి 'కిసాన్ సెజ్' ఏర్పాటు అయిందన్నారు. ఇఫ్కోలో పరిశ్రమలకు ప్రధాన అవసరాలైన విద్యుత్, నీరు, భద్రత వంటి వసతులు కల్పించేందుకు రూ.300 కోట్ల వ్యయంతో మౌలిక సదుపాయాలు కల్పించారన్నారు. ప్రస్తుతం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో విద్యుత్ సరఫరా, కాంపౌండ్ వాల్, నీరు, మురుగునీటి శుద్ధి కర్మాగారం, అంతర్గత రోడ్లు, తుఫాను నీటి పారుదల వ్యవస్థ, 24 గంటల భద్రత, ఫ్లగ్ మరియు ప్లే సౌకర్యాలతో పాటు 34,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉపయోగానికి అనువుగా ఉన్న కార్యాలయ స్థలం వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రస్తుతం ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన సిమెన్స్ గమేసా రెన్యూవబుల్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్, 2017లో ఏర్పాటై 150 ఎకరాల్లో కార్యకలాపాలు సాగిస్తోందన్నారు. అదేవిధంగా హిందుస్తాన్ కోకా కోలా బెవరేజెస్ లిమిటెడ్ , తమ యూనిట్ల కోసం 150 ఎకరాలను తీసుకుందని, దీంతోపాటు ఇతర పెట్టుబడిదారులు కంపెనీలు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారని వారి దృష్టికి తెచ్చారు. జిల్లాలో నైపుణ్యాలున్న యువతకు కొరత లేదని, ఇఫ్కో సెజ్‌లో పరిశ్రమలు ఏర్పాటయితే.. జిల్లాలో వేలాదిమంది యువతకు ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. స్థానికులకు ఉపాధి మెరుగుపడుతుందని వివరించారు. తద్వారా జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెంది ప్రజల జీవన ప్రమాణాలు మెరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కాబట్టి ఇఫ్కో సెజ్‌లో తగిన ప్రాజెక్టులు ఏర్పాటు అయ్యేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన అభ్యర్థించారు. ఎంపీ వేమిరెడ్డి విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన వారు.. ఇఫ్కో కిసాన్ సెజ్ లో పరిస్థితిని పరిశీలిస్తామన్నారు. తప్పకుండా సెజ్ భూములను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# దర్శిలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్

## సీఎం చంద్రబాబు హామీ



దర్శి, (చైతన్యరథం): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ మంగళవారం అసెంబ్లీ లాబీలో మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై జరిగిన చర్చలు బడ్జెట్ సమావేశాలపై ప్రజల నుండి సానుకూలత వ్యక్తం అవుతున్నట్లు ఈ సందర్భంగా లక్ష్మీ సీఎంకు, కూటమి ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. ముఖ్యంగా దొనకొండ ప్రాంతంలో సోలార్ పార్కు ఏర్పాటుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించి అసెంబ్లీలో ప్రకటన చేయడం పట్ల ప్రత్యేక ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు ముందుకు తీసుకు వెళ్లేందుకు ఆయా సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దర్శి నియోజకవర్గంలో చేపట్టిన ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ పనులు తిరిగి ప్రారంభించాలని కోరారు. దీనిపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారని, రాష్ట్ర ప్రభుత్వం నుండి సంబంధించిన నిధులు మంజూరుకు సిద్ధమని కేంద్రం నుండి రావాల్సిన నిధులు రావాల్సి ఉందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లు లక్ష్మీ ఈ సందర్భంగా తెలిపారు. నిర్మాణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అన్న క్యాంటీన్ అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రిని కోరారు. దొనకొండ, వెంకటాచలం రెండు లైన్ల రోడ్ల విస్తరణ అవసరమైన రూ.50 కోట్ల నిధులను మంజూరు చేసి దర్శి అభివృద్ధిలో కూటమి ప్రభుత్వ పాత్ర చిరస్థాయిగా నిలిచేలా చూడాలని కోరినట్లు లక్ష్మీ తెలిపారు. రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా నిధులు మంజూరు చేయాలన్నారు. దర్శి అభివృద్ధి బాధ్యత మన ప్రభుత్వం తీసుకుంటుందని సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రజలందరికీ అందేలా మీరు చూడాలని సీఎం చంద్రబాబు సూచించినట్లు గొట్టిపాటి లక్ష్మీ వెల్లడించారు.

# కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించే అవకాశాలు ఉన్నాయా? : పల్లె సింధూరరెడ్డి



పుట్టపర్తి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న ట్రెయిన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్స్‌గా పనిచేసే హిందీ, ఫిజిక్స్ బోధించే ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రమోషన్లు లేకపోవడం వల్ల తీవ్ర అన్యాయం జరుగుతోందని మిగతా వారికి ప్రమోషన్లు లభించి జూనియర్ లెక్చరర్లుగా, ప్రిన్సిపల్‌గా మిగతా చోట్ల పనిచేస్తున్నారని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం 13వ రోజు జరిగిన శాసనసభ సమావేశాల సందర్భంగా ప్రశ్నోత్తరాల సమయంలో సాంఘిక సంక్షేమ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలపై పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పలు అంశాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సాంఘిక సంక్షేమ పాఠశాలలో పనిచేసే వారికి పదవీ విరమణ వయస్సు 60 ఏళ్ళు మాత్రమే ఉందని వీరికి ఏమైనా 62 ఏళ్ల వరకు ప్రభుత్వం పొడిగించే అవకాశం ఏమైనా ఉందా? అని ప్రభుత్వాన్ని కోరారు. అంతే కాకుండా ఈ స్కూలులో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు ఏమైనా ఇచ్చే అవకాశం ఉందా అని మంత్రిని అడిగారు. గత ప్రభుత్వంలో జీవో 310, 311 ,312 ద్వారా వేతనాలు ఇస్తుండడం వల్ల ఇవి సక్రమంగా సకాలంలో వారికి జీతాలు అందడం లేదని చెప్పారు. వీటికి 010 పద్దు ద్వారా వేతనాలు ఇస్తే సకాలంలో వేతనాలు ఇస్తే వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. అదే విధంగా ఈ చిత్రంలో పాఠశాలలో సుమారు 779 మంది కాంట్రాక్ట్ పద్ధతిపై టీచర్లు పనిచేస్తున్నారని వీరంతా 2008 తర్వాత ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా వీటిని భర్తీ చేశారు. అయితే వీరికి బీఈడీ తోపాటు అన్ని అర్హతలు ఉన్న వారినే ప్రభుత్వ నోటిఫికేషన్‌తో నియామక రిజర్వేషన్ ప్రకారం ఈ పోస్టులు భర్తీ జరిగాయని, యాక్ట్ 30 –2023 ప్రకారం వీరిని క్రమబద్ధీకరించే అవకాశాలు ఏమైనా ఉన్నాయా అని ప్రభుత్వం ద్వారా సంబంధిత రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి బాల వీరాంజనేయ స్వామిని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. అదేవిధంగా ఈ పాఠశాలల్లో సుమారు 200 మంది పార్ట్ టైం టీచర్స్ పనిచేస్తున్నారని మీరు అన్ని అర్హతలు కలిగిన వారినే ఈ పోస్టుల్లో నియమించారని వీరికి మినిమం టైం స్కేల్ ఇచ్చే అవకాశం ఏమైనా ఉందా అని ప్రభుత్వాన్ని కోరారు. మిగతా రెగ్యులర్ ఉద్యోగులతో పాటు అన్ని విధులను నిర్వర్తిస్తూ సమాన విధుల భారాన్ని మోస్తున్నారని, వీరికి ప్రభుత్వం ద్వారా మినిమం టైం స్కేల్ అమలు చేసే అవకాశం ఏమైనా ఉందా అని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రభుత్వం ద్వారా సంబంధిత మంత్రిని కోరారు.

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి అడిగిన ప్రశ్నకు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి సమాధానం ఇస్తూ, ఈ పాఠశాలలో పనిచేస్తున్న టీచర్స్‌కు 010 పద్దు ద్వారా వేతనాలు ఇచ్చే అంశాన్ని ఆర్థికశాఖ ఆమోదానికి పంపితే అక్కడ తిరస్కరణకు గురైందన్నారు. ఈ అంశంపై మరోసారి ప్రభుత్వం పరిశీలన చేస్తామన్నారు. కాంట్రాక్టు టీచర్ పోస్టులను క్రమబద్ధీకరణ విషయంలో ప్రభుత్వ పాలసీ మేరకు నిర్ణయం తీసుకోవాల్సి ఉందని మంత్రి వెల్లడించారు. అయితే మరి కొన్ని పోస్టులను ఈ డీఎస్సీ నోటిఫికేషన్ ద్వారా సంబంధిత పోస్టులను భర్తీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి డోల బాల వీరాంజనేయ స్వామి సమాధానం ఇచ్చారు.

# ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి



విజయవాడ (చైతన్యరథం): ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు నిర్వహించిన క్రిడా పోటీల్లో అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఉత్సాహంగా పాల్గొన్నారు. బడ్జెట్ సమావేశాల అనంతరం ప్రజా ప్రతినిధులకు ఈ పోటీలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్, క్రికెట్, షటిల్ పోటీల్లో ఎమ్మెల్యే చురుగ్గా పాల్గొన్నారు. క్రికెట్‌లో ఎమ్మెల్యే ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. షటిల్ లో కూడా ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ ఈ పోటీల్లో పాల్గొన్నప్పుడు తన స్టూడెంట్ లైఫ్ గుర్తుకొచ్చిందన్నారు. ప్రజా జీవితంలో తాము నిత్యం బిజీగా గడుపుతుంటామని.. అయితే ఇలాంటి పోటీలు నిర్వహించడం ద్వారా ఎంతో మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. ఎమ్మెల్యేలంతా తమ విద్యార్థి దశను గుర్తు చేసుకుంటూ ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారని అన్నారు. ప్రజా ప్రతినిధులకు ఇలా క్రీడ పోటీలు నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టండి: నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి

న్యూఢిల్లీ / కర్నూలు (చైతన్యరథం): ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని భారత పౌర విమానాయశాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ బైరెడ్డి శబరి వినతి పత్రం అందించారు. ఢిల్లీలోని కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కె. రామ్మోహన్‌నాయుడును ఆయన కార్యాలయంలో ఎంపీ బైరెడ్డి శబరి మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. గత వైసీపీ ప్రభుత్వం నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెడతామని తెలిపి ఆయన పేరు పెట్టకుండా రాయలసీమ ప్రజలను విస్మరించారని మండిపడ్డారు.



# ఈ ఫోటో ఎప్పటికీ గుర్తుండిపోతుంది : పరిటాల సునీత

- సీఎం, మంత్రులు, తోటి శాసనసభ్యులతో ఫోటో దిగిన టీడీపీ ఎమ్మెల్యే
- ఒక మంచి వాతావరణంలో బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి



అమరావతి /రాప్తాడు (చైతన్యరథం): అసెంబ్లీ ఆవరణంలో బడ్జెట్ సమావేశాల ముగింపు సందర్భంగా దిగిన ఫోటో శాసనసభ్యులు అందరికి ఎప్పటికీ గుర్తుంటుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. మంగళవారం రోజు అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, శాసనమండలి చైర్మన్, మంత్రులు, ఎమ్మెల్యేలంతా కలసి ఫోటోలు దిగారు. ఆ తర్వాత మహిళా మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తో ఫోటో దిగారు. ఈ సందర్భంగా తన అభిప్రాయాలను ఎమ్మెల్యే సునీత పంచుకున్నారు. ఈ శాసనసభ సభ్యుల్లో తాను కూడా ఉండటం గర్వకారణంగా ఉందన్నారు. ప్రజలు నన్ను నాలుగవసారి గెలిపించి అసెంబ్లీకి పంపినందుకు వారికి ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. ఈ బడ్జెట్ సమావేశాలు ఎంతో మంచి వాతావరణంలో జరిగాయన్నారు. తొలిరోజు వైసీపీ శాసనసభ్యులు వ్యవహరించిన తీరు మినహా ఈ సమావేశాలు ఎంతో సంతృప్తినిచ్చాయన్నారు. కొన్ని సందర్భాల్లో మా నియోజకవర్గ సమస్యలు మాట్లాడేందుకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. మరోవైపు దక్షిణ భారతదేశంలో ఎంతో పేరు పొందిన అరకు కాఫీకి సంబంధించిన స్టాల్ ను అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తదితరులతో కలసి స్పీకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సహచర ఎమ్మెల్యేలతో కలిసి ఎమ్మెల్యే సునీత అరకు కాఫీ తాగారు. అరకు కాఫీకి ఒక ప్రత్యేకత ఉందని... ఏపీలోనే కాకుండా దేశంలోనే ఇది ఒక బ్రాండ్ అని ఆమె కొనియాడారు.

**క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత జట్టు విజయకేతనం**

ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల క్రీడా పోటీల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత జట్టు విజయకేతనం ఎగురవేసింది. విజయవాడలోని ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కోసం ప్రత్యేకంగా క్రీడా పోటీలు నిర్వహించారు. బడ్జెట్ సమావేశాల అనంతరం ఈ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ముందుగా టగ్ ఆఫ్ వార్ పోటీ నిర్వహించారు. హోంమంత్రి వర్సెస్ గిరిజన శాఖ మంత్రి బృందం మధ్య పోటీ జరిగింది. టగ్ ఆఫ్ వార్ పోటీలో గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి బృందం విజయం సాధించింది. ఈ బృందంలో ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నారు.

# ఎస్సీ వర్గంలోని అన్ని కులాలకు న్యాయం చేసేలా క్యాబినెట్ నిర్ణయం స్వాగతనీయం

**●రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ రిపోర్టుకు క్యాబినెట్ ఆమోదం ఆనందదాయకం : ఎం.ఎస్.రాజు**

అమరావతి (చైతన్యరథం): దళితుల్లో సామాజికన్యాయం, సమాన అవకాశాలు కల్పించేందుకు కట్టుబడిన పార్టీ టీడీపీ అని, ఎస్సీలకు అన్ని విధాలా న్యాయం చేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన చంద్రబాబు కట్టుబడి ఉన్నారని మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్ రాజు వ్యాఖ్యానించారు. “అధికారంలోకి వచ్చిన వెంటనే ఎస్సీ రిజర్వేషన్ అమలు కోసం రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ వేసి, అన్ని కులాలు, ఉపకులాల సంఘాలతో మీటింగులు నిర్వహించి అనేక ఆలోచనలను సమీకరించి కమిషన్ రిపోర్టును ప్రభుత్వానికి ఇచ్చారు. దీనికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దళితులకు రాజ్యాధికారం, గౌరవం కల్పించడంలో చంద్రబాబు గతంలో తన చిత్తశుద్ధిని మరోసారి నిరూపించారు. బాలయోగికి లోక్‌సభ స్పీకర్, ప్రతిభాభారతికి ఏపీ అసెంబ్లీ స్పీకర్ పదవులు ఇచ్చిన ఘనత చంద్రబాబుదే.” అని అన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో అవకాశాలు దక్కని వారికి ప్రాధాన్యతనిచ్చేందుకు చంద్రబాబు సంకల్పించారని, రామచంద్రరాజు కమిషన్ వేసి, రాష్ట్రపతి ఆర్డినెన్స్ ద్వారా ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, దీనివల్ల 25వేల ఉద్యోగాలు మాల, మాదిగలకు దక్కుతాయని అన్నారు. 2024 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం కట్టుబడి ఎస్సీ వర్గీకరణకు



చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని ఎం.ఎస్ రాజు కొనియాడారు. గతంలో ఉషామెహర కమిషన్ ఏపీలో పర్యటించి కులాల మధ్య అసమానతలు, విద్య, ఉద్యోగాల్లో అసమానతలు ఉన్నాయని ప్రభుత్వానికి తెలిపింది. అన్ని కులాలకు సమాన అవకాశాలు కల్పించే ఉద్దేశంతో దళిత కులాలు, ఉపకులాలకు న్యాయం చేయాలనే చంద్రబాబు నిర్ణయాన్ని దళిత ఎమ్మెల్యేలందరం స్వాగతిస్తున్నామని, అన్ని కులాలకు ఆమోదయోగ్యమైన నిర్ణయాన్ని చంద్రబాబు తీసుకున్నారని అన్నారు. 30ఏళ్ల దళితుల పోరాటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు సముచిత గౌరవాన్ని కల్పించారని అన్నారు.

# ఆదరణ-3 పథకం అవగాహన సదస్సు : పాలకవీటి విజయకుమార్

కర్నూలు (చైతన్యరథం): బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో ఈడి జాకీర్ హుస్సేన్ సార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదరణ–3 పథకం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి నాయి బ్రాహ్మణ స్టేట్ డైరెక్టర్ పాలకవీటి విజయకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయి బ్రాహ్మణ కళాకారులకు గతంలో డోలు, సన్నాయిలు మాత్రమే ఇవ్వడం జరిగేదని, ప్రస్తుతం బ్యాండ్ వాయిద్య కళాకారులకు కూడా కిలర్నాటు, తంపేట్, రండోలు, మంజూరు చేయాలని అదేవిధంగా వృత్తిదారులకు ఆధునిక పరమైన కుర్చీలు, ఆధునికమైన పనిముట్లు, మిషన్స్ మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతామని అన్నారు. ఆదరణ పథకం ఎంతో మంది బీసీలకు చేయుతనిచ్చిందన్నారు. ఆదరణ – 3 పథకాన్ని ప్రతిఒక్కరూ




సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## మహాకుంభమేళా విజయం..

# భారత సమష్టి కృషికి తార్కాణం



### భారత గొప్పతనాన్ని ప్రపంచమంతా చూసిందన్న ప్రధాని మోదీ

మహాకుంభమేళా విజయం అందరూ కలసికట్టుగా చేసిన కృషికి నిదర్శనమని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా భారత్ గొప్పతనాన్ని ప్రపంచం మొత్తం చూసిందని అన్నారు. ఈ విజయంపై దేశ ప్రజలందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా మంగళవారం లోక్‌సభలో ప్రధాని ప్రసంగించారు. "ఎర్రకోట నుండి సబ్కా సాథ్.. సబ్కా వికాస్ ప్రాముఖ్యతను నేను ప్రధానంగా ప్రస్తావించాను. గతేడాది శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ సందర్భంగా దేశం మొత్తం ఎలా పులకించిపోయిందో చూశాం. కుంభమేళాలో కూడా అలాంటి ఐక్యతే కనిపించింది. ప్రపంచం మొత్తం భారతదేశ శక్తిసామర్థ్యాలను ఈ రూపంలో చూసింది. మన బలాన్ని అవమానించే వారికి ఈ కార్యక్రమం తగిన సమాధానం ఇచ్చింది. ఇక భారత సంప్రదాయాలను కొత్తతరం గౌరవంతో స్వీకరిస్తోంది" అని మోదీ పేర్కొన్నారు. ఈ ప్రసంగంపై ప్రశ్నలు వేయడానికి అనుమతి లభించకపోవడంతో విపక్షాలు తీవ్ర నిరసన వ్యక్తంచేశాయి. దాంతో సభ వాయిదా పడింది. పన్నెండు ఏళ్లకు ఓసారి నిర్వహించే ఈ మహా కుంభమేళా జనవరి 13న మొదలుకాగా.. ఫిబ్రవరి 26 వరకు కొనసాగింది. కోట్లాది మంది ఉత్తరప్రదేశ్లోని ప్రయాగరాజ్ త్రివేణి సంగమం వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు.

కుంభమేళా ముగిసిన తర్వాత మోదీ ఓ పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. దేశంలో సరికొత్త ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిసిందని, ఇదే స్ఫూర్తితో, ఇదే ఆత్మవిశ్వాసంతో వికసిత భారత్ దిశగా అడుగులు వేయడానికి పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. ఆధ్యాత్మిక వేడుకలో ఏమైనా పొరపాట్లు జరిగితే క్షమించాలని గంగ, యమున, సరస్వతి నదీమ తల్లులతోపాటు ప్రజల్ని కోరారు. తన దృష్టిలో ప్రజలూ దేవుడి ప్రతిరూపాలేనని పేర్కొన్నారు. "ఇంత పెద్ద కార్యక్రమాన్ని నిర్వహించడం అంత సులువు కాదు. అమెరికా జనాభా కంటే రెండింతల మంది భక్తులు ఈ వేడుకలో పాల్గొన్నారు. అంచనాలను మించి ప్రజలు తరలివచ్చారు. ఐక్యతతో ఈ మహాయజ్ఞం దిగ్విజయంగా ముగిసింది" అని అప్పుడు తన బ్లాగ్లో రాసుకొచ్చారు. నదిలో స్నానమాచరించిన తర్వాత వారి ముఖాల్లో కనిపించిన సంతోషం, సంతృప్తి నేనెప్పటికీ మర్చిపోలేనన్నారు.

# సునీత రాక కోసం నిలువెల్లా కనులై..



అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్, మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ ఎట్టకేలకు భూమికి తిరుగు పయణమయ్యారు. దీంతో సునీతా రాక కోసం భారత్లోని ఆమె పూర్వీకుల గ్రామం ఎదురుచూస్తోంది. ఆమె తిరిగి వచ్చిన క్షణాలను పండగలా చేసుకునేందుకు సన్నద్ధమవుతోంది. గుజరాత్లోని ఝూలాసన్లో లో సునీతా విలియమ్స్ పూర్వీకులు ఉంటున్నారు. తన రాకపై ఆమె సోదరుడు దినేష్ రావల్ ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. "నా సోదరి సునీతా రాక కోసం మేమంతా ఎంతో ఎదురుచూస్తున్నాం. ఆమె తల్లి, సోదరి, సోదరుడుతో సహా భారత్లోని కుటుంబంలోని ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారు. ఆమె సురక్షితంగా పుడమికి చేరుకోవాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. మా సోదరి కోసం దేవాలయాలకు వెళ్లాం. ఇది మాకు చిరస్మరణీయమైన రోజు. దేశం గర్వించదగిన రోజు. సునీతా కోసం యజ్ఞం నిర్వహిస్తున్నాం" అని తెలిపారు. దాదాపు 9 నెలల పాటు అంతరిక్ష కేంద్రంలో చిక్కుకుపోయిన భారత సంతతికి చెందిన సునీతా విలియమ్స్ తో సహా మరో వ్యోమగామి బుచ్ విల్మోర్ ఎట్టకేలకు భూమి మీదకు తిరిగి రానున్నారు. వ్యోమగాములను భూమ్మీదకు తీసుకొచ్చేందుకు అంతరిక్ష కేంద్రానికి వెళ్లిన స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్లోకి వీరు చేరుకున్నారు. అనంతరం ఈ వ్యోమనౌక అంతరిక్ష కేంద్రం నుంచి విడిపోయి పుడమికి తిరిగి బయల్దేరింది. స్పేస్‌ఎక్స్ క్రూ డ్రాగన్ ఐఎస్ఎస్ను వీడే అన్లాకింగ్ దృశ్యాలను నాసా ప్రత్యక్ష ప్రసారం చేస్తోంది. ఈ నేపథ్యంలోనే సునీతా పూర్వీకుల గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ స్పందించారు. "మిమ్మల్ని భారత్లో చూసేందుకు ఎదురుచూస్తున్నాం" అని సునీతకు లేఖ రాశారు. ఆమె సురక్షితంగా భూమిపైకి తిరిగిరావాలని, ఆరోగ్యంగా ఉండాలని మోదీ ఆకాంక్షించారు. సునీత సాధించిన విజయాల పట్ల 140 కోట్లమంది భారతీయులు గర్వంగా ఉన్నారని పేర్కొన్నారు. "యూఎస్ పర్యటనకు వెళ్లినప్పుడు.. మీ గురించి అడిగితెలుసుకున్నాను. మీరు వేలాది కి. మీ. దూరంలో ఉన్నప్పటికీ.. మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు. మీ అంతరిక్షయాత్ర విజయం సాధించాలని మేమంతా కోరుకుంటున్నాం. తన కుమార్తెలకు ఆతిథ్యం ఇవ్వడం పట్ల భారత్ సంతోషంగా ఉంటుంది" అని మోదీ తన లేఖలో పేర్కొన్నారు. మార్చి ఒకటిన రాసిన లేఖను కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. ఈ లేఖ పట్ల సునీత సంతోషం వ్యక్తంచేశారు.

# మీ ద్వంద్వ ప్రమాణాలే కశ్మీర్ సమస్యకు మూలం

### ఐక్యరాజ్య సమితి తీరుపై జై శంకర్ ఆగ్రహం

కశ్మీర్ అంశంపై విదేశాంగ శాఖ మంత్రి ఎస్. జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఐక్యరాజ్య సమితిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. "కశ్మీర్ అంశంపై మేం ఐక్యరాజ్య సమితిని ఆశ్రయించాం. అప్పుడు వారు పాక్ దురాక్రమణను రెండు దేశాల వివాదంగా మార్చేశారు. అందులో పలు పాశ్చాత్య దేశాల పాత్ర ఉంది" అని ఆరోపణలు చేశారు. దాంతో భారత సార్వభౌమత్వాన్ని ప్రపంచం చూసే దృష్టిపై దీని ప్రభావం పడిందని మండిపడ్డారు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై చర్చించేందుకు 10వ 'రైసీనా డైలాగ్' సమావేశం ఢిల్లీలో జరుగుతోంది. ఇక్కడే మంత్రి స్పందించారు. కశ్మీర్ సమస్య విషయంలో తప్పుడు కథనాలు రూపొందించడంలో యూకే, కెనడా, బెల్జియం, ఆస్ట్రేలియా, యూఎస్ఏ కారణమని పరోక్షంగా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దాంతో భారత్ ఈ సమస్యను దౌత్యపరంగా పరిష్కరించుకోవడం



క్లిష్టతరంగా మారిందన్నారు. అలాగే పాశ్చాత్య దేశాలు అనుసరించే ద్వంద్వ ప్రమాణాలను ఆయన ఎండగట్టారు. ఈ సందర్భంగా భారత చరిత్రను అర్థం చేసుకోవాల్సిన ప్రాముఖ్యతను నొక్కిచెప్పారు. కశ్మీర్ సమస్యతో పాటు భారత స్వాతంత్ర్య పోరాటం... అంతర్జాతీయ సంబంధాల విషయంలో తమ విధానాన్ని ప్రభావితం చేసిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 1940ల్లో ప్రజాస్వామ్య దేశంగా ఉండాలని భారత్ నిర్ణయించుకుందని ఈ సందర్భంగా గుర్తుచేశారు. ప్రపంచ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించాలనే తమ ఆశయానికి అది నిదర్శనమన్నారు. భారతదేశం తన సార్వభౌమత్వాన్ని కాపాడుకోవాలనే దృఢసంకల్పం, ప్రముఖ గ్లోబల్ పవర్‌గా ఎదగాలనే లక్ష్యాన్ని ప్రతిబింబించేలా ఆయన ప్రసంగించారు. న్యూజిలాండ్ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సాన్, అమెరికా జాతీయ నిఘా డైరెక్టర్ తులసీ గబ్బార్డ్, ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆంద్రీ సైబిహాతో పాటు 125 దేశాలకు చెందిన 3,500 మంది ప్రతినిధులు రైసీనా డైలాగ్లో పాల్గొన్నారు. విదేశీ వ్యవహారాల శాఖతో కలిసి 'అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్' (ఓఆర్ఎఫ్) అనే సంస్థ దీనిని నిర్వహిస్తోంది. 'కాలచక్ర– ప్రజలు, శాంతి, భూగోళం' అనే ఇతివృత్తంపై చర్చలు జరగనున్నాయి.

# వైష్ణోదేవి క్షేత్రంలో భద్రతా వైఫల్యం

### పిస్తోలుతో మహిళ ఆలయ ప్రవేశం
### వెల్లువెత్తిన భక్తుల విమర్శలు



జమ్మూలోని ప్రఖ్యాత ఆధ్యాత్మిక ప్రదేశం శ్రీ మాతా వైష్ణోదేవి ఆలయంలో భారీ భద్రతా వైఫల్యం చోటుచేసుకుంది. ఓ మహిళ భద్రతా తనిఖీలను దాటుకుని పిస్టోలుతో ఆలయంలోకి ప్రవేశించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మార్చి 15న ఓ మహిళ పిస్టోలుతో వైష్ణోదేవి ఆలయంలోకి ప్రవేశించింది. దీన్ని గమనించిన ఆలయ అధికారులు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకొని ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆమెను ఢిల్లీ పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న జ్యోతి గుప్తాగా గుర్తించారు. గడువు ముగిసిన లైసెన్స్ గన్ను దేవాలయంలోకి తీసుకువచ్చినందుకు గాను ఆ మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఆమె ఆలయం లోపలికి ప్రవేశించేవరకు భద్రతా సిబ్బంది ఎవరూ దానిని గుర్తించకపోవడంపై భకులు విమర్శలు గుప్పిస్తున్నారు.

# ప్రజాసామ్యం అంటే పోలీసు రాజ్యం కాదు

### ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీం అసహనం



ట్రయిల్ కోర్టుల తీరుపై సుప్రీం కోర్టు అసహనం వ్యక్తంచేసింది. చాలా సాధారణ కేసుల్లో దర్యాప్తు పూర్తయిన ప్పటికీ బెయిల్ పిటిషన్లను తిరస్కరించ డాన్ని అత్యున్నత న్యాయస్థానం తప్పు బట్టింది. ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూదని హితవు పలికింది. ఒక చిన్న కేసులో బెయిల్ కోసం దాఖలైన పిటిషన్ విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. "ఒక ప్రజాస్వామ్య దేశం పోలీసుల రాజ్యంలా పని చేయకూడదు. ఇక్కడ నిజాలతో సంబంధం లేకుండా చట్టం అమలుచేసే సంస్థలు కొందరు వ్యక్తులను నిర్బంధించేందుకు ఏకపక్ష ధోరణితో వ్యవహరిస్తారు. అలా చేయడం ఆమోదయోగ్యం కాదు. రెండు దశాబ్దాల క్రితం.. చిన్న కేసుల్లో బెయిల్ పిటిషన్లు హైకోర్టు, సుప్రీంకోర్టులకు చాలా అరుదుగా వచ్చేవి. ట్రయిల్ కోర్టు స్థాయిలో పరిష్కారం కావాల్సిన కేసులకు సంబంధించి బెయిల్ పిటిషన్ల విషయంలో అత్యున్నత న్యాయస్థానం తీర్పు ఇవ్వడమనేది దిగ్భ్రాంతి కలిగిస్తోంది. అనవసరంగా వ్యవస్థపై భారం పడుతోంది" అని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఒక చిన్న కేసులో రెండేళ్లకు పైగా కస్టడీలో ఉన్న నిందితుడికి బెంచ్ బెయిల్ మంజూరుచేసింది. దర్యాప్తు పూర్తయి ఛార్జిషీట్ దాఖలు చేసినప్పటికీ నిందితుడి బెయిల్ పిటిషన్ను ట్రయల్ కోర్టు, గుజరాత్ హైకోర్టు తిరస్కరించాయి. మేజిస్ట్రేట్లు విచారించగలిగే కేసుల్లో బెయిల్ విషయాలను సుప్రీంకోర్టు ముందుకుతీసుకురావడం దురదృష్టకరమని అభయ్ ఎస్ ఓకా అసహనం వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గురించి ప్రస్తావించడం ఇదే తొలిసారి కాదు. చిన్నచిన్న నేరాలకు సంబంధించిన కేసుల్లోను బెయిల్ మంజూరు చేయడంలో ట్రయల్ కోర్టులు, హైకోర్టులు మరింత ఉదారవాద వైఖరితో వ్యవహరించాలని సూచించింది.

# మళ్లీ.. వణికిన గాజా

400 దాటిన మృతుల సంఖ్య



కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగింపుపై చర్చలకు సిద్ధమవుతున్న వేళ.. గాజాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులతో విరుచుకుపడింది. సోమవారం రాత్రినుంచి పలు ప్రాంతాల్లో జరిపిన అనూహ్య దాడుల్లో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఇప్పటివరకు కనీసం 404మంది మృతిచెందినట్టు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. మరో 562మంది గాయపడినట్లు తెలిపింది.

**భయానక పరిస్థితులు..**

ఖాన్ యూనిస్, రఫా, ఉత్తర గాజా, గాజా సిటీ ప్రాంతాల్లో ఈ వైమానిక దాడులు చోటుచేసుకున్నాయి. మృతుల్లో అత్యధికంగా మహిళలు, చిన్నారులే ఉన్నట్లు ఆరోగ్యశాఖ వెల్లడించింది. శిథిలాల కింద అనేకమంది చిక్కుకుపోయినట్లు తెలిపింది. తొలుత ఈ మరణాలు, గాయపడిన వారి సంఖ్య కొంత ఎక్కువగా చెప్పినప్పటికీ తర్వాత సవరించింది. మరోవైపు గాజా ఆసుపత్రుల్లో భయానక పరిస్థితులు నెలకొన్నాయని, పిల్లల ఐసీయూలు నిండిపోయాయని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న వైద్యులు చెబుతున్నారు. రఫాలో ఒకే కుటుంబానికి చెందిన 17మంది ప్రాణాలు కోల్పోగా.. ఇందులో 12మంది మహిళలు, చిన్నారులే ఉన్నట్లు యూరోపియన్ ఆసుపత్రి వెల్లడించింది. అటు ఖాన్ యూనిస్‌లోనూ క్షతగాత్రులతో అనేక అంబులెన్సులు ఆసుపత్రులకు క్యూ కడుతున్నట్లు తెలుస్తోంది.

**ఇప్పటికే మానవతా సంక్షోభం**

గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఇప్పటివరకు 48వేల మంది పాలస్తీనీయన్లు ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో సగంమంది మహిళలు, చిన్నారులే ఉన్నట్లు గాజా ఆరోగ్యశాఖ వెల్లడించింది. అయితే, ఇజ్రాయెల్ దాడుల నేపథ్యంలో గతంలో దాదాపు 90శాతం మంది పాలస్తీనీయన్లు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లగా.. ఇటీవల కాల్పుల విరమణతో అనేకమంది తిరిగి తమ స్వస్థలాలకు వచ్చారు. ఈ క్రమంలోనే నెతన్యాహు సేనలు భీకర దాడులు మొదలు పెట్టడంతో వారిలో మళ్లీ భయాందోళనలు నెలకొన్నాయి.

## మా కుమార్తె మృతినైనా ప్రకటించండి

**సుదీక్ష తల్లిదండ్రుల విజ్ఞప్తి**



డొమినికన్ రిపబ్లిక్‌లో అదృశ్యమైన భారత సంతతి విద్యార్థిని ఆచూకీ కోసం పోలీసులు గాలింపుచర్యలు చేపడుతున్నారు. ఈనేపథ్యంలో సుదీక్ష చనిపోయినట్టు ప్రకటించాలని ఆమె తల్లిదండ్రులు డొమినికన్ అధికారులను కోరినట్టు యూఎస్‌లోని పలు మీడియా సంస్థలు పేర్కొంటున్నాయి. తమ కుమార్తె మరణం విషయంలో ఎవరిపైనా అనుమానం లేదని... అందువల్లే ఈ విజ్ఞప్తి చేస్తున్నట్టు వారు అధికారులకు రాసిన లేఖలో పేర్కొన్నట్టు తెలుస్తోంది.

ఈ కేసులో అధికారులు చేస్తున్న దర్యాప్తును తాము విశ్వసిస్తున్నామన్నారు. తమ కుమార్తె మృతిని అధికారికంగా ప్రకటించడానికి కొన్ని చట్టపరమైన విధానాలను అనుసరించాల్సి ఉంటుందని అర్థం చేసుకున్నామని.. ఆ విషయంలో అధికారులకు పూర్తిగా సహకరిస్తామని వారు లేఖలో పేర్కొన్నారు. మరోవైపు సుదీక్ష కనిపించకుండా పోవడానికి ముందు యూనివర్సిటీలో తమ సీనియర్ అయిన 24ఏళ్ల జాషువా స్టీవ్‌రిబెతో కలిసి బీచ్‌కు వెళ్లినట్టు అధికారులు గుర్తించి అతడిని ప్రశ్నించారు. ఈ విషయంలో అతడి తప్పేమీ లేదని దర్యాప్తులో గుర్తించినట్టు తెలిపారు. రిబె దర్యాప్తునకు సహకరించాడని.. ఆ రోజు వారిద్దరూ కలిసే ఉన్నారని అంగీకరించాడన్నారు. అయితే బీచ్‌లో ఉండగా.. భారీ అల వారిని బలంగా తాకడంతో స్పృహ కోల్పోయానని, తర్వాత ఏం జరిగిందో తనకు తెలియదని తెలిపాడని పేర్కొన్నారు. లౌడాన్ కౌంటీ షెరీఫ్ కార్యాలయం తెలిపిన వివరాల ప్రకారం.. సుదీక్ష తన ఐదుగురు స్నేహితురాళ్లతో కలిసి బయటకు వెళ్లింది. అక్కడినుంచి వారు ఓ బార్‌కు వెళ్లి.. మద్యం తాగిన దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డ్ అయ్యాయి. అక్కడే ఆమె తమ సీనియర్ రిబెను కలిసింది. అనంతరం స్థానికంగా ఉన్న రియూ రిపబ్లికా రిసార్ట్ బీచ్ వద్ద చివరిసారిగా కన్పించింది. సుదీక్ష కనిపించకుండా పోవడంపై ఆమె తల్లిదండ్రులు మొదటినుంచీ అనుమానం వ్యక్తంచేస్తున్నారు. కుమార్తెను ఎవరైనా కిడ్నాప్ చేసి ఉంటారని.. అపహరణ కోణంలోనూ సమగ్ర దర్యాప్తు చేయాలని అధికారులను కోరారు. ఈనేపథ్యంలో తమ కుమార్తె మృతి చెందిందని ప్రకటన చేయమని అధికారులకు విజ్ఞప్తి చేయడం గమనార్హం.

## ‘బలోచ్’పైకి చైనా బలగాలు?



పాకిస్థాన్‌లో బలోచిస్థాన్ లిబరేషన్ ఆర్మీ దాడులు పెరుగుతున్న వేళ చైనా కీలక చర్యలు చేపట్టినట్టు తెలుస్తోంది. బీజింగ్‌కు చెందిన ప్రైవేటు భద్రతా దళాలను పాక్‌కు మద్దతుగా మోహరించాలన్నది దీని సారాంశం. ఇటీవల సీపెక్ ప్రాజెక్టులోని వర్కర్ను, ఇంజినీర్లను కాపాడేందుకు తమ దేశానికి చెందిన ప్రైవేటు భద్రతా బృందాలు, మిలిటరీ సిబ్బందిని నియమించేందుకు వీలుగా ఓ ఒప్పందంపై సంతకం చేసింది. దీని కింద డెవ్వె సెక్యూరిటీ ఫ్రాంటియర్ గ్రూప్, చైనా ఓవర్సీస్ సెక్యూరిటీ గ్రూప్, హయాక్సిన్ ఝాంగోన్ సెక్యూరిటీ సర్వీస్ సంస్థలు పాక్‌లోని చైనా జాతీయుల భద్రతను పర్యవేక్షించనున్నాయి. బలోచ్ రెబల్స్ దాడుల నేపథ్యంలో చైనా జాతీయుల భద్రత ప్రధానంగా మారింది. గతేడాది ఇద్దరు చైనా జాతీయులపై ఆత్మాహుతి దాడి జరిగిన విషయం తెలిసిందే. తాజాగా బీఎల్ఏ కార్యకలాపాలు ఊపందుకున్న నేపథ్యంలో పాక్‌లో బీజింగ్ దళాలను మోహరించే అవకాశాలున్నట్టు ఇంటెలిజెన్స్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఈ ప్రాంతంలో చైనా బలగాల మోహరింపులో ఇది కీలక అడుగుగా మారనుంది.

మరోవైపు పాక్-చైనా సంయుక్త సెక్యూరిటీ కంపెనీ ఏర్పాటు చేయాలని బీజింగ్ ప్రతిపాదించినట్టు తెలుస్తోంది. సీపెక్‌లోని ప్రాజెక్టులు, ఉద్యోగుల రక్షణ బాధ్యతల కోసం దీనిని వినియోగించాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలో యాంటీ టెర్రరిజం కోఆపరేషన్ అగ్రిమెంట్‌పై సంతకం చేయాలని చైనా కోరుతోంది. ఇదే జరిగితే డ్రాగన్ సైన్యం పాక్ గడ్డపై అధికారికంగా అడుగు పెట్టేందుకు అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం చైనా-పాక్ ఎకనామిక్ కారిడార్లో దాదాపు 30 వేలమంది చైనా జాతీయులు పనిచేస్తున్నారు. వారి భద్రతే ప్రధాన అంశంగా మారింది. ముఖ్యంగా బలోచిస్థాన్, గ్వదార్ ప్రాంతాల్లో ముప్పు మరింత తీవ్రంగా ఉంది.

## స్టాట్యూ ఆఫ్ లిబర్టీ ఇవ్వడం కుదరదు

**ఫ్రాన్స్ నేత డిమాండ్‌పై అమెరికా స్పందన**



అమెరికాలోని న్యూయార్క్ నగరం అనగానే వెంటనే గుర్తొచ్చేది స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ. దీన్ని అమెరికాకు ఫ్రాన్స్ బహూకరించిన సంగతి తెలిసిందే. స్మారకం కారణంగా రాజకీయ దుమారం రేగుతోంది. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని తమకు తిరిగిచ్చేయాలని ఫ్రాన్స్‌కు చెందిన నేత ఇటీవల డిమాండ్ చేశారు. తాజాగా దీనిపై అగ్రరాజ్యం స్పందించింది. ఆయన వ్యాఖ్యలు రాజకీయ ప్రేరేపితమైనవని కొట్టిపారేసింది. తాజాగా ఈ ఫ్రాన్స్‌కు చెందిన రాఫెల్ గ్లక్స్ మాన్ ఇటీవల ఓ కార్యక్రమంలో పాల్గొని సంచలన ప్రకటన చేశారు. స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని తిరిగి ఇవ్వమని అమెరికాను కోరనున్నట్టు తెలిపారు. ఏ విలువలను చూసి ఆ విగ్రహాన్ని అందజేశామో ఆ విలువలు ప్రస్తుతం అమెరికాలో కనిపించడం లేదని ఆయన విమర్శించారు. అందుకే దాన్ని వెనక్కి తిరిగివ్వాలని డిమాండ్ చేశారు. తాజాగా దీనిపై వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ స్పందించారు. కేవలం అమెరికా వల్లే ఫ్రాన్స్ ఇప్పుడు జర్మన్‌లో మాట్లాడటం లేదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఫ్రాన్స్ నేత గుర్తు చేసుకోవాలన్నారు. దీనికి వారు యూఎస్‌కు ఎప్పటికీ కృతజ్ఞతతో ఉండాలన్నారు. అమెరికాలోని న్యూయార్క్‌లో 1886 అక్టోబరు 28న ఈ స్టాచ్యూ ఆఫ్ లిబర్టీని ఏర్పాటుచేశారు. యూఎస్‌తో స్నేహబంధానికి గుర్తుగా ఫ్రాన్స్ ఈ స్మారకాన్ని బహూకరించింది.

## చైనాలో ఏం జరుగుతుంది?

**- కీలక సైనిక జనరల్ అరెస్ట్**



చైనా సైన్యంలో అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు అత్యంత సన్నిహితమైన ఫుజియాన్ నాయకులు, జనరల్స్‌పై చర్యలు మొదలయ్యాయి. అత్యంత కీలకమైన సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్ చైర్మన్ హి వైడాంగ్ అరెస్టయ్యారు. వాస్తవానికి ఈ కమిషన్‌కు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ చైర్మన్. ఇటీవలి కాలంలో చైనా కీలక పదవుల్లో ఉన్న వ్యక్తులను మార్చేస్తున్న క్రమంలో ఈ అరెస్టు జరగడం గమనార్హం. పీపుల్స్ లిబరేషన్ ఆర్మీలో సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్‌చైర్మన్ పదవి అత్యున్నతమైంది. ఈ అరెస్టుతో మరికొంతమంది కీలక నాయకులను కూడా అదుపులోకి తీసుకొన్నారు. వీరిలో పీఎల్ జనరల్ లాజిస్టిక్స్ డిపార్ట్మెంట్ మాజీ మంత్రి ఝావో కేషిని కూడా కస్టడీలోకి తీసుకొన్నట్టు తెలుస్తోంది.

ఝావో కేషి అరెస్టు కూడా అత్యంత కీలకమైంది. అతడు నాన్సింగ్ మిలిటరీ రీజియన్‌లో జనరల్ లాజిస్టిక్స్‌లో అధిపతిగా పనిచేశారు. దీంతోపాటు సైనిక బడ్జెట్, వనరుల కేటాయింపులు, రక్షణ పరిశ్రమలపై అతడి ప్రభావం ఉంది. సెంట్రల్ మిలిటరీ కమిషన్ వైస్‌చైర్మన్ హి వైడాంగ్ సెక్రటరీ అత్యంత కీలకమైన సైనిక సమాచారం లీక్ చేశారనే ఆరోపణలపై దర్యాప్తును ఎదుర్కొంటున్నారు. ఇక వెస్టర్న్ థియేటర్ కమాండ్ డిప్యూటీ కమాండర్, ఫుజియాన్‌లో పనిచేసే చాలామంది జనరల్స్‌ను కూడా అదుపులోకి తీసుకొన్నట్టు తెలుస్తోంది.

నేవీలో తూర్పు థియేటర్ కమాండర్, సెంట్రల్ మిలిటరీ కమిషన్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిప్యూటీ డైరెక్టర్, డైరెక్టర్ ఆఫ్ మిలిటరీ అఫైర్స్ స్థానాలను కూడా జిన్‌పింగ్ సర్కారు ప్రక్షాళన చేసింది. ఈ అరెస్టులను ఆ దేశ రక్షణశాఖ ధ్రువీకరించాల్సి ఉంది. ఫుజియాన్ ఫ్యాక్షన్‌కు చెందిన మరికొందరు సీనియర్ జనరల్స్ కూడా అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఫ్యాక్షన్ అధ్యక్షుడు జినిపింగ్‌కు అత్యంత సన్నిహితమైందిగా భావిస్తారు. కానీ, అధ్యక్షుడే వారిని స్వయంగా అణచివేస్తున్నారా..? లేదా సైన్యంలో తనకు వ్యతిరేకంగా గళం విప్పుతున్నవారిని అణచివేసే క్రమంలో చర్యలు తీసుకొన్నారో తెలియాల్సి ఉంది. ఇక చైనాలో గతేడాది కూడా మియావో లి అనే ఉన్నతస్థాయి సైనిక అధికారిని అరెస్టు చేశారు. ఆయన నాడు పొలిటికల్ వర్క్ డిపార్ట్మెంట్ డైరెక్టర్‌గా ఉన్నారు. అంతకుముందు చైనా రక్షణ మంత్రిని అరెస్టు చేశారు.



# కఠినశ్రమ వల్లే మళ్లీ ఈ స్థాయిలో ఉన్నా

**- శ్రేయస్ అయ్యర్**

కొన్ని నెలల కిందట జట్టులో స్థానం కోల్పోయిన శ్రేయస్ అయ్యర్ ఇప్పుడు టీమిండియా జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణించి తిరిగి జాతీయజట్టులో స్థానం సంపాదించుకున్న శ్రేయస్ ఇటీవల ముగిసిన ఛాంపియన్స్ ట్రోఫీలో అదరగొట్టాడు. అన్ని మ్యాచ్‌ల్లో నిలకడగా ఆడి జట్టు విజయాల్లో ముఖ్య భూమిక పోషించాడు. జట్టుకు దూరమైనప్పుడు శ్రేయస్ ఎన్నో విమర్శలకు గురయ్యాడు. ఛాంపియన్స్ ట్రోఫీ ప్రదర్శనతో అతను విమర్శకుల నోళ్లు మూయించాడు. తాజాగా శ్రేయస్ ఈ విషయంపై మాట్లాడాడు. న్యూజిలాండ్ జరిగిన లీగ్ మ్యాచ్‌లో సెంచరీ మిస్ అయినందుకు తనకు బాధగా లేదని, జట్టు 44 పరుగుల తేడాతో విజయం సాధించడం సంతృప్తి ఇచ్చిందన్నాడు.

'నాకు చాలా సంతృప్తిగా ఉంది. సెంచరీ మిస్ అయినందుకు బాధ లేదు. నా ఇన్నింగ్స్ (19 పరుగులు)తో జట్టుకు మంచి స్కోరు సాధించడం సంతోషాన్నిచ్చింది. మేము ఆ మ్యాచ్‌లో 44 పరుగుల తేడాతో గెలిచాం. దేశవాళీ క్రికెట్‌లో చాలా కఠిన బంతులకు సిక్సర్లు కొట్టా. అది నాలో ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. నేను ఎవరికీ ఎలాంటి సందేశం పంపాల్సిన అవసరం లేదు. నేను చేయాల్సిందల్లా నాపై నమ్మకం ఉంచి అత్యుత్తమ క్రికెట్ ఆడడమే. అప్పుడు ఆటోమేటిక్‌గా వారికి సందేశం వెళుతుంది. కఠినశ్రమ వల్లే మళ్లీ ఈ స్థాయిలో రాణిస్తున్నా. ఈ ప్రక్రియలో నాకు ప్రవీణ్ ఆమ్రే సర్, అభిషేక్ నాయర్, నా ట్రైనర్, న్యూట్రిషనిస్టులు సాగర్, నికోల్ కెడియా వంటి చాలామంది సహాయం చేశారు' అని శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు.

ఇక నుంచి పంజాబ్‌కు

గత సీజన్ వరకు కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు సారథ్యం వహించిన శ్రేయస్ అయ్యర్ ఇప్పుడు పంజాబ్ కింగ్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. 2024 సీజన్‌లో కోల్‌కతాను చాంపియన్‌గా నిలిపిన శ్రేయస్ ను మెగా వేలంలో రూ.27 కోట్ల భారీ మొత్తానికి కొనుగోలు చేసింది. ఐపీఎల్ చరిత్రలో వేలంలో భారీ ధర పలికింది ఇతనే.

# విరాట్ కోహ్లీకి అండగా కపిల్ దేవ్!



బీసీసీఐ మ్యాచ్‌ల సమయంలో ఆటగాళ్లు తమ కుటుంబసభ్యులతో కలిసి ఉండే విషయంలో కొన్ని పరిమితులు తీసుకొచ్చింది. వీటికి వ్యతిరేకంగా కోహ్లి వ్యాఖ్యలు చేశాడు. ఈ విషయంలో విరాట్‌కు క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ తన మద్దతు తెలిపాడు. ఇటీవల ఆస్ట్రేలియాలో జరిగిన బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు పేలవ ప్రదర్శన చేసింది. ఆ తర్వాత నుంచి బీసీసీఐ భారత ఆటగాళ్ల విషయంలో పలు ఆంక్షలు విధించింది. గతంలో కుటుంబసభ్యులు ఆటగాళ్లతో 45 రోజుల వరకు ఉండటానికి అనుమతి ఉండేది. కానీ ఆ వెసులుబాటును టూర్ ప్రారంభమయ్యాక మొదటి రెండువారాలకే పరిమితం చేశారు. ఈ కొత్త నియమంపై ఆర్సీబీ ఇన్నోవేషన్ ల్యాబ్ ఇండియన్ స్పోర్ట్స్ సమ్మిట్ సందర్భంగా కోహ్లి మాట్లాడాడు. సుదీర్ఘ పర్యటనలకు వెళ్లినప్పుడు క్రీడాకారులు తమతో కుటుంబసభ్యులు కూడా ఉండాలని కోరుకుంటారు. ముఖ్యంగా కఠిన సవాళ్లు ఎదురైనప్పుడు కుటుంబంతో కొంత సమయం వెచ్చిస్తారన్నాడు. ఇది ఆటగాళ్లలో మరింత బాధ్యతను తీసుకువస్తుందన్నాడు. 'మీరు క్రికెట్ టూర్ల సమయంలో కుటుంబంతో కలిసి ఉండాలని కోరుకుంటారా? అని ఎవరైనా ఆటగాణ్ని అడితే.. అతను అవును అనే సమాధానమే ఇస్తాడు. నేనైతే నా గదిలోకి వెళ్లి, ఒంటరిగా విచారంగా గడపాలి అని మాత్రం కోరుకోను. కుటుంబంతో ఉంటేనే ఆటలో మరింత బాధ్యతగా ఉండగలం' అని కోహ్లి వివరించాడు. విరాట్ ప్రస్తుతం ఐపీఎల్ 2025 సీజన్ కోసం సన్నద్ధమవుతున్నాడు.

'ఆట.. కుటుంబం కలిసే ఉండాలి'

గ్రాంట్ థోర్న్టన్ ఇన్విటేషనల్ గోల్ఫ్ టోర్నమెంట్ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమంలో క్రికెట్ లెజెండ్ కపిల్ దేవ్ మాట్లాడారు. ఆటగాళ్లకు వారి జట్టుతో పాటు కుటుంబం కూడా అవసరమే అని అన్నారు. తమ కాలంలో పర్యటనల్లో క్రికెట్, కుటుంబానికి సమాన ప్రాధాన్యం ఇచ్చేవారమని గుర్తు చేసుకున్నారు. 'క్రికెట్ బోర్డు ఇలా పిలుపు ఇచ్చింది అని అనుకుంటున్నాను. ఆటగాళ్లకు కుటుంబం తమతో ఉండటం అవసరమే. అదే సమయంలో జట్టుకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి. మా కాలంలో మేం మొదట జట్టుగా ఆడేవాళ్లం, తర్వాత నెమ్మదిగా మా కుటుంబాలు వచ్చేవి. అలా ఆట, కుటుంబం కలిసిపోయి ఉండేవి' అని కపిల్ దేవ్ అన్నారు.

# ఆ ఫిట్‌నెస్ ధోనీకే సాధ్యం

## వికెట్ కీపింగ్‌లోనూ తనని మించినవారిని నేను ఇప్పటికి చూడలేదు: హర్భజన్ సింగ్

టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పినా ఐపీఎల్‌లో మాత్రం కొనసాగుతున్నాడు. 43 ఏళ్ల వయసులోనూ అద్భుతమైన ఫిట్‌నెస్‌తో ఐపీఎల్‌లో ఫ్యాన్స్‌ను అలరిస్తున్నాడు. మరికొద్ది రోజుల్లో ప్రారంభం కానున్న ఐపీఎల్ 2025 సీజన్ కోసం మహీ ఫిబ్రవరిలోనే చెన్నైకి చేరుకొని రెగ్యులర్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. అయితే ఇటీవలే టీమిండియా మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్, ధోనీ ఓ వివాహ వేడుకలో కలుసుకున్నారు. ఈ క్రమంలో ధోనీతో జరిగిన సంభాషణ గురించి భజ్జీ తెలిపాడు. తాను ఇటీవలే ధోనిని ఓ ఫ్రెండ్ కుమార్తె వివాహ వేడుకలో కలిశానని హర్భజన్ సింగ్ వెల్లడించాడు. అప్పుడు ధోనీ చాలా ఫిట్‌గా, దృఢంగా కనిపించాడని చెప్పాడు.



"ఈ వయసులో ఏం చేస్తున్నావు (ఫిట్‌నెస్‌ను ఉద్దేశించి), కష్టమే కదా' అని అన్నాను. 'అవును ఈ ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం కష్టమే. కానీ, నేను చేయాలనుకుంటున్నది ఇదే. నేను దానిలో ఆనందాన్ని పొందుతాను. ఫిట్‌గా ఉంటూ ఆటను కొనసాగించాలనుకుంటున్నా" అని ధోనీ బదులిచ్చినట్లు హర్భజన్ సింగ్ చెప్పాడు.

**బౌలర్లపై ధోనీ ఆధిపత్యం : భజ్జీ**

ఏడాది పొడవునా ఎలాంటి క్రికెట్ ఆడకుండా ఫిట్‌నెస్‌ను కాపాడుకోవడం అనేది చాలా కష్టమైనదని భజ్జీ వ్యాఖ్యానించాడు. కానీ, అది ఎలా సాధ్యమో ధోనీ చేసి చూపిస్తున్నాడని కొనియాడాడు. ధోనీ ఇతరుల కంటే మెరుగ్గా ఏదో చేస్తున్నాడని, నామమాత్రంగా జట్టులో కొనసాగడం లేదన్నాడు. తన బ్యాటింగ్‌తో ధోనీ బౌలర్లందరిపై ఆధిపత్యం చెలాయిస్తున్నాడని పేర్కొన్నాడు.

"ఒకట్రెండు నెలలుగా ధోనీ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఎన్ని ఎక్కువ బంతులు ఆడితే ఆ స్థాయిలో సిక్సర్లు వస్తాయి. ధోనీ చెన్నైలో ప్రతిరోజూ 2-3 గంటలు బ్యాటింగ్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. ఇంత వయసులో కూడా గ్రౌండ్‌కి మొదటగా వచ్చి అందరికంటే ఆఖరిగా వెళ్లే వ్యక్తి ప్లేయర్ ధోనీనే. అదే ధోనీకి, ఇతర క్రికెటర్లకు ఉన్న తేడా. వికెట్ కీపింగ్‌లోనూ ధోనీని మించినవారిని నేను చూడలేదు. " అని ధోనీపై హర్భజన్ ప్రశంసలు కురిపించాడు.

**రెండు రోజుల్లో ఐపీఎల్ ప్రారంభం**

కాగా, ఐపీఎల్ 18వ ఎడిషన్ మార్చి 22 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే అన్ని ఐపీఎల్ ఫ్రాంచైజీలు ప్రాక్టీస్‌ను ముమ్మరంగా చేశాయి. ఈ సీజన్‌లో సీఎస్కే తన తొలి మ్యాచ్ ముంబయి ఇండియన్స్‌తో తలపడనుంది. మార్చి 23న చెపాక్‌లో ఈ మ్యాచ్ జరగనుంది.

# ప్రపంచంలోనే బ్లాక్ బస్టర్ టీ20 లీగ్ ఆవిర్భావం

## డేంజర్ జోన్‌లో ఐపీఎల్ - ఐసీసీ స్పందనపైనే అందరి దృష్టి

క్రికెట్ ప్రపంచంలో గత కొన్నేళ్లుగా సంపాదనపరంగా కానీ, క్రేజ్ పరంగా గానీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అగ్రస్థానంలో ఉన్న సంగతి తెలిసిందే. బిగ్‌బాష్ లీగ్, కరేబియన్ లీగ్, పాక్ సూపర్ లీగ్, దక్షిణాఫ్రికా టీ20 లీగ్‌లకు కూడా ఈ మధ్య ప్రజాదరణ పెరిగింది. దీంతో సౌదీ అరేబియా కూడా ఇదే బాటలో పయనించేందుకు గత రెండేళ్లగా గట్టిగానే ప్రణాళికలు సిద్ధం చేస్తూనే ఉంది. ఐపీఎల్ కన్నా రిచెస్ట్ లీగ్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. వ్యూహం, రచిస్తోంది. అయితే ఇప్పుడీ ప్రచారం మళ్లీ ఊపందుకుంది. దీంతో సౌదీ అరేబియా అనుకున్నట్టుగానే లీగ్‌ను ఏర్పాటు చేస్తే, అది ఐపీఎల్ పై ఎలాంటి ప్రభావం చూపిస్తుంది, అసలు ఆ లీగ్ కోసం ఎంత ఖర్చు పెడుతోంది, అందులో భారత ప్లేయర్లు ఆడతారా, ఆ లీగ్ ను ప్రారంభించేందుకు ఐసీసీ అప్రూవల్ ఇస్తుందా అనే ప్రశ్నలు క్రికెట్ అభిమానుల మెదడులో మెదులుతున్నాయి. వాటిని సమాధానాలను ఇప్పుడు తెలుసుకుందాం..

సౌదీ అరేబియా.. అతి పెద్ద క్రీడా దేశంగా ఎదిగే దిశగా అడుగులు ముందుకు వేస్తోంది. అందుకోసం ఇప్పటికే గోల్ఫ్, ఫార్ములా ఓ, 2034 ఫిఫా వరల్డ్ కప్ వంటి వాటిల్లో పెట్టుబడులు పెడుతోన్న ఆ దేశం.. ఇప్పుడు టీ20 క్రికెట్ లీగ్ లోనూ అడుగులు వేస్తోంది. ఇందుకోసం అక్కడి ప్రభుత్వం.. కొంతమంది ఆస్ట్రేలియన్ క్రికెట్ నిపుణులు, ఆస్ట్రేలియా క్రికెటర్స్ అసోసియేషన్ తో కలిసి లీగ్ ను ఏర్పాటు చేసేందుకు ప్లాన్ చేస్తోంది. వరల్డ్ బిగ్గెస్ట్ టీ20 క్రికెట్ లీగ్ ను సిద్ధం చేయాలని, ప్రాథమికంగా రూ.4,347 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ లీగ్ కోసం ఆస్ట్రేలియా క్రికెట్ లెజెండ్ నీల్ మ్యాక్స్‌వెల్ గత కొన్నేళ్లుగా బ్యాక్ గ్రౌండ్ వర్క్ కూడా చేస్తున్నారు. ఇప్పుడీ లీగ్ ఏర్పాటు కనుక జరిగితే ఐపీఎల్ కు ఇది గట్టి పోటీ అవుతుందని అందరి చర్చల్లో సారాంశం.

ఫండ్స్ కూడా..

సౌదీ అరేబియన్ ప్రభుత్వం స్పోర్ట్స్ కోటా ద్వారా ఈ లీగ్ ను లాంఛ్ చేయనుంది. అలానే కొన్ని మల్టీనేషనల్ కంపెనీలు కూడా ఈ లీగ్ కోసం ఫండ్స్ ఇవ్వనున్నాయి. 2020 తర్వాత ఫుట్ బాల్, టెన్నిస్, గోల్ఫ్, ఫార్ములా వన్ రేసింగ్ వంటి క్రీడలపై సౌదీ అరేబియా ఎన్ని బిలియన్లు ఖర్చు చేసింది. అలానే ఫిఫా వరల్డ్ కప్ కూడా హోస్ట్ చేసేందుకు సిద్ధమవుతోంది.

గ్రాండ్ స్లామ్ టెన్నిస్‌కు సిమిలర్‌గా

ఈ టీ20 లీగ్.. గ్రాండ్ స్లామ్ టెన్నిస్‌కు సిమిలర్‌గా ఉండనుంది. ముందు 8 జట్లతో ఇది ప్రారంభం కానుంది. ఏడాది మొత్తం జట్లన్నీ ఇతర దేశాల్లో ఆడతాయి. అనంతరం ఫైనల్ ను సౌదీ అరేబియాలో నిర్వహిస్తారు.

ఐపీఎల్ పై ఇంపాక్ట్ చూపిస్తుందా?

ఆసియా ఖండంలో క్రికెట్ కన్నా పెద్ద క్రీడ మరొకటి లేదని సౌదీ అరేబియాకు తెలుసు. కాబట్టి అటువంటి పరిస్థితిలో, వారు క్రికెట్‌లో తమను తాము నిరూపించుకోవాలనుకుంటున్నారు. ఇందుకోసం వారు ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ లీగ్ అయిన ఐపీఎల్‌ను అధిగమించాల్సి ఉంటుంది. ఐపీఎల్ బ్రాండ్ విలువ ప్రస్తుతం దాదాపు 1.2 బిలియన్ డాలర్లుగా ఉంది. అయితే ఐపీఎల్ లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న స్టార్ క్రికెటర్లు ఆడతారు. అందుకే తమ లీగ్ లో కూడా వరల్డ్ వైడ్ గా ఉన్న బడా స్టార్స్ ఆడేందుకు, వారిపై కాసుల వర్షం కురిపిస్తుంది. దీంతో వారు కూడా ఐపీఎల్ కన్నా ఈ కొత్త లీగ్ లోనే ఎక్కువగా ఆడేందుకు ఆసక్తి చూపిస్తారని పలువురి అభిప్రాయం. తద్వారా ఐపీఎల్‌పై ఎక్సైట్‌మెంట్ కూడా కాస్త తగ్గే అవకాశం ఉంటుందని మరికొంతమంది అభిప్రాయం.

ఐసీసీ అప్రూవల్ ఇస్తుందా?

ప్రపంచంలో ఏ క్రికెట్ లీగ్ ప్రారంభించాలనుకున్నా.. ఐసీసీ ఆమోదం పొందాలి. ఓ లీగ్ ప్లాన్ మొత్తం చూసి, అంతా నియమ, నిబంధనలతో పాటు ప్రమాణాలకు తగ్గట్టుగా సరిగ్గా ఉంటేనే ఐసీసీ ఆమోదం ఇస్తుంది.

# 'హీరో, నిర్మాత నన్ను నమ్మారు'

దర్శకుడికి స్వేచ్ఛనిస్తూ అతడి ప్రతిభను నిర్మాత నమ్మినప్పుడే అద్భుతాలు చేయగలరు. ఆ ప్రయత్నంలో కొన్ని విఫలం కూడా కావచ్చు. ముఖ్యంగా తొలిసారి దర్శకత్వం వహించే వారి విషయంలో నిర్మాత ఆచితూచి వ్యవహరిస్తాడు.

అయితే 'లూసిఫర్' నిర్మాత ఆంటోనీ పెరంబవూర్ తనపై పూర్తి నమ్మకం ఉంచారని నటుడు, దర్శకుడు పృథ్వీరాజ్ సుకుమారన్ అన్నారు. ఆ చిత్రానికి కొనసాగింపుగా రూపొందిన 'ఎల్2: ఎంపురాన్' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ క్రమంలో ఆనాటి సంగతులు గుర్తు చేసుకున్నారు.

"2018లో 'లూసిఫర్ ప్రకటించినప్పుడు ఇండస్ట్రీలోనే ఎవరూ చేయని భారీ ప్రయత్నమది. సినిమా ప్రకటించగానే నిర్మాత ఆంటోనీ పెరంబవూర్‌కు వరుసగా ఫోన్ కాల్స్ రావడం మొదలయ్యాయి. 'అసలు అతడు (పృథ్వీరాజ్) ఏం చేస్తున్నాడు. ఇప్పటివరకూ ఇండస్ట్రీలో ఎవరూ చేయనంత బడ్జెట్, పరిధితో నువ్వు మూవీ



చేస్తున్నావు. అతడికి ఈ కథను తెరపై ఆవిష్కరించే సామర్థ్యం ఉందా' అని కొందరు ఆంటోనీని అడిగారట. ఇండస్ట్రీలో ఇలా మాట్లాడుకున్నారని నేను కూడా విన్నాను. కానీ, అప్పట్లో మలయాళంలో అంత బడ్జెట్ పెట్టి మూవీ చేయడం నిజంగా రిస్కే. కానీ మోహన్‌లాల్, నిర్మాత నాపై ఉంచిన నమ్మకం నాకు ఎంతో ప్రేరణ ఇచ్చింది. అంతేకాదు, షూటింగ్ జరిగినంత కాలం హీరో, నిర్మాతలకు ఒక్కరోజు కూడా నాపై అపనమ్మకం ఏర్పడలేదు. సినిమాపై నాకున్న విజన్‌ను వాళ్లు అర్థం చేసుకున్నారు" అని గుర్తు చేసుకున్నారు.

## బ్లో అప్

### ఐశ్వర్య మీనన్



# ఎమర్జెన్సీకి లవ్‌లెటర్

కంగనా రనౌత్ నటించిన తాజా చిత్రం 'ఎమర్జెన్సీ' ఓటీటీలో ఆదరణ సొంతం చేసుకుంటోంది.తాజాగా కంగనా ఓ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. ప్రతిపక్ష నేత ఒకరు 'ఎమర్జెన్సీ'ని ప్రశంసించారని వెల్లడించారు. చేతిరాతతో ఉన్న ఒక లెటర్‌ను పోస్ట్ చేశారు. ఆ లెటర్ ఇచ్చిన వారి వివరాలను మాత్రం కంగనా చెప్పలేదు.

"నిన్న 'ఎమర్జెన్సీ' చూశాను. మీరు చాలా బాగున్నారు.. లవ్' అని రాసి ఉన్న లెటర్‌ను కంగనా పంచుకున్నారు. ఈ ప్రశంసాపత్రం తన వద్దకు వచ్చిందని ఆమె తెలిపారు. ఇది తన ముఖంపై చిరునవ్వు తెప్పించిందని ఇన్‌స్టా స్టోరీలో రాసుకొచ్చారు. దీంతో నెటిజన్లు ఈ లెటర్‌పై ఉన్న సంతకాన్ని డీకోడ్ చేసే పనిలో పడ్డారు. ఇక"ఎమర్జెన్సీకి ఓటీటీలో మంచి స్పందన వస్తోంది. జనవరి 17న థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మిశ్రమ స్పందనలకే పరిమితమైన ఈ సినిమా మార్చి 17నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతుందని తెలిపారు. కానీ, డిజిటల్ ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేస్తూ.. మార్చి 14నుంచే అందుబాటులోకి వచ్చేసింది. రిలీజ్ అయిన రోజు నుంచి ఈ చిత్రం దేశవ్యాప్తంగా నెటిఫ్లెక్స్‌లో టాప్ వన్‌లో కొనసాగుతోంది. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితాన్ని ఆధారంగా చేసుకొని 'ఎమర్జెన్సీ' చిత్రాన్ని రూపొందించారు. అత్యవసర పరిస్థితి ప్రకటించిన సందర్భాన్ని ఆధారంగా చేసుకొని దీనిని సిద్ధం చేశారు. ఇందిరాగాంధీగా కంగనా నటించగా.. జయప్రకాశ్ నారాయణ్ పాత్రలో అనుపమ్ ఖేర్ కనిపించారు.





## సికిందర్ నాచే సాంగొచ్చేసింది

సల్మాన్‌ఖాన్, రష్మిక జంటగా నటిస్తున్న చిత్రం 'సికిందర్'. మురుగదాస్ దర్శకుడు. ఇప్పటికే చిత్రీకరణ పూర్తి చేసుకున్న మూవీ రంజాన్ కానుకగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచార కార్యక్రమాల్లో భాగంగా 'సికిందర్ నాచే' సాంగును చిత్ర బృందం తాజాగా విడుదల చేసింది. ఇందులో సల్మాన్, రష్మిక తమ డ్యాన్స్‌లతో అదరగొట్టారు.

## ఓటీటీ డేట్ ఫిక్స్ చేసుకున్న డ్రాగన్



ఇటీవల తమిళ చిత్రం నుంచి వచ్చి సూపర్ హిట్టయిన చిత్రాల్లో లవ్ టుడే ఫేమ్ యంగ్ హీరో ప్రదీప్ రంగనాథన్ హీరోగా దర్శకుడు అశ్వత్ మారిముత్తు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం "డ్రాగన్" ఒకటి. మరి అనుపమ పరమేశ్వరన్ సహా కయదు లోహర్‌లు నటించిన చిత్రం వారి కెరీర్‌లో మంచి హిట్ అందుకున్నారు. ఇక థియేటర్స్‌లో సాలిడ్ వసూళ్లు అందుకున్న ఈ చిత్రం ఇపుడు ఫైనల్‌గా ఓటిటి రిలీజ్ డేట్‌ని ఫిక్స్ చేసుకుంది. ఈ చిత్రాన్ని దిగ్గజ స్ట్రీమింగ్ సంస్థ నెట్ ఫ్లిక్స్ సొంతం చేసుకోగా అందులో ఈ చిత్రం మార్చ్ 21నుంచి పాన్ ఇండియా భాషల్లో అందుబాటులోకి వస్తున్నట్టుగా నెట్ ఫ్లిక్స్ అనౌన్స్ చేసింది. సో అప్పుడు ఈ సినిమాని ఎవరైనా మిస్ అయితే ఇపుడు నెట్ ఫ్లిక్స్‌లో చూడవచ్చు. ఇక ఈ చిత్రానికి లియోన్ జేమ్స్ సంగీతం అందిస్తే.. ఏజిఎస్ ఎంటర్టైన్మెంట్స్ నిర్మించడం తెలిసిందే.

# నీల్‌తో చరణ్ లైనప్?

ప్రస్తుతం గ్లోబల్ స్టార్ రామ్‌చరణ్ హీరోగా దర్శకుడు బుచ్చిబాబు సానా కలయికలో భారీ సినిమా చేస్తోన్న సంగతి తెలిసిందే. మరి సినిమా చరణ్ కెరీర్లో 16వ సినిమాగా చేస్తుండగా ఈ చిత్రంపై సాలిడ్ హైప్ నెలకొంది. సినిమా కోసం అభిమానులు ఎగ్జైటెడ్‌గా కూడా ఎదురుచూస్తున్నారు.ఈ సినిమా తర్వాత చరణ్ లైనప్‌లో దర్శకుడు సుకుమార్ తప్ప ఇంకో దర్శకుడు పేరు ప్రస్తుతానికి లేదు. కానీ లేటెస్ట్‌గా సెన్సేషనల్ దర్శకుడు ప్రశాంత్ నీల్ పేరు వినిపిస్తోంది. ఈ కాంబినేషన్ కోసం కూడా చాలామంది ఎప్పుడు నుంచో ఎదురు చూస్తున్నారు. దీనితో ఈ భారీ



కలయికలో అతి త్వరలోనే అనౌన్స్మెంట్ కూడారావచ్చని టాక్. అలాగే ఈ సినిమాని చరణ్‌తో ట్రిపుల్ ఆర్ లాటి సెన్సేషనల్ సినిమాచేసిన డివివి ఎంటర్టైన్మెంట్స్ తెరకెక్కిస్తారని టాక్.
మరి ఈ క్రేజీ కలయికపై మరింత సమాచారం రావాల్సి ఉంది.

## 'వచ్చారోయ్.. మళ్లీ వచ్చారోయ్'

నార్నె నితిన్, రామ్ నితిన్, సంగీత్ శోభన్ ప్రధాన పాత్రల్లో దర్శకుడు కల్యాణ్ శంకర్ తెరకెక్కించిన చిత్రం 'మ్యాడ్ స్క్వేర్'. ఇదే కాంబోలో వచ్చిన 'మ్యాడ్‌కు సీక్వెల్గా రూపొందింది. ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా 'వచ్చారోయ్.. మళ్లీ వచ్చారోయ్' సాంగును చిత్రబృందం విడుదల




చేసింది. హుషారుగా సాగిన అల్లరి పాట ఆడియన్స్‌ను ఆకట్టుకుంటుంది.



# ఈసారి అలా చేయను!

సందీప్‌రెడ్డి వంగా దర్శకత్వంలో వచ్చిన 'అర్జున్‌రెడ్డి' సినిమా మంచి రెస్పాన్స్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఇందులో ప్రీతి పాత్రలో నటి షాలినీ పాండే మెప్పించారు. అయి తే సినిమాలోని నటీనటుల పాత్రలను కొందరు విమర్శించారు. హీరోయిన్ పాత్ర బలహీనంగా ఉందని కొందరు పోస్టుపెట్టారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో షాలినీ 'అలాంటి పాత్ర మరో సారి వస్తే అంగీకరిస్తారా?'అనే ప్రశ్నకు సమాధానమిచ్చారు."నేను కెరీర్ ప్రారంభించిన తొలినాళ్లలో నటించిన సినిమా అది. ఇప్పుడు దాని గురించి ఆలోచిస్తే అమాయకంగా అనిపిస్తోంది. నా పాత్ర మరింత బలంగా చేయొ చ్చేమో అని అనుకుంటున్నా. మరోసారి అలాంటి పాత్ర వస్తే నో చెప్పను. దానిపై మరింత అవగాహన పెంచుకొని నటిస్తాను. అప్పటికంటే ఇప్పు డు నటిగా పరిణితి చెందాను కాబట్టి భిన్నంగా చేయడానికి ప్రయత్ని స్తాను. నిజాయతీగా చెప్పాలంటే దర్శకుడితో మాట్లాడి కొన్ని మార్పు లు చేయించుకొని అంగీకరిస్తా" అని చెప్పారు. ఇటీవల డబ్బా కార్టెల్ సిరీస్‌లో షాలినీ రాజి అనే పాత్రలో కనిపించారు. హితేశ్ భాటియా దర్శకత్వంలో క్రైమ్ థ్రిల్లర్ వెబ్సరీస్‌గా ఇది రూపొందింది. షబానా అజ్మీ, జ్యోతిక కీలక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ అవుతోంది.